నలుపు

ప్రజల పక్ష పత్రిక

జూలై 16–31, 1989

వెల రూ. 3

విషవాయువు ముసలతో
పటాన్‌చెరు పరిసరాలు



మతకలహాలు ఎందుకు వస్తాయి

ఈ పుస్తకాన్ని బీరువాలో దాచిపెట్టకండి, పదిమందికీ చదివి వినిపించండి.

వైద్యుడు లేని చోట

గ్రామారోగ్యసేవాకరదీపిక

మూలం


డెవిడ్ వెర్నర్

సాదాప్రతి 50-00

మేలు ప్రతి 60-00

ఇది కేవలం ప్రథమచికిత్సకు సంబంధించిన పుస్తకం కాదు. మన ఆరోగ్యాన్ని భంగపరిచే విరేచనాల నుంచి క్షయ వ్యాధి దాకా ఉపయోగకరమైన చిట్కాలు మొదలుకొని ఆధునిక ఔషధాల వరకు అనేక విషయాలను అత్యంత సులభంగా వివరించే ఉత్తమ గ్రంథం.

ఈ పుస్తకం ఆరోగ్య కేంద్రాలకు సుదూరంగా మారుమూల ప్రాంతాలలో నివసించే గ్రామీణులకు అత్యంత సహాయకారి. వారికి తరుచుగా ఎదురయ్యే జబ్బులను గురించి వాటి నివారణకు చికిత్స చేయడానికి ఏమేమి చేయవచ్చో తేలిక మాటలలో, బొమ్మలతో తెలియపరుస్తుంది.



రాకమ్మ కథ

రచన షీలా జర్‌బ్రిగ్

వెల 12-50

గ్రామీణ ప్రాంతాల్లో అనారోగ్యం గురించి, అనారోగ్యానికి ఆర్థికమే పునాది అని వివరిస్తుందీ పుస్తకం. ప్రస్తుతం ఉన్న అస్తవ్యస్థ ఆరోగ్య వ్యవస్థకు, నేడు నెలకొన్న రాజకీయ, ఆర్థిక పరిస్థితులే కారణమని, ఆసుపత్రులు, డాక్టర్లు ప్రజల పట్ల బాధ్యతాయుతంగా ప్రవర్తించడం లేదని, ఆరోగ్య వ్యవస్థ బాగుపడాలంటే, ఎలాంటి మార్గాలు చేపట్టాల్సిందీ ఈ పుస్తకం ద్వారా తెలుసుకోవచ్చు.

హైదరాబాద్ బుక్ ట్రస్టు

చిరునామా

హైదరాబాద్ బుక్ ట్రస్ట్
ఇ.నెం. 1-1-342/బి.
వివేక్ నగర్, హైదరాబాదు - 20.

KLVA102M289

విడిప్రతి రు. 3.00
సంవత్సర చందా రు. 65.00

సంపాదకవర్గం
బొజ్జా తారకం
కె. బాలగోపాల్
డి. నరసింహారెడ్డి
కె. ఐలయ్య
సిరిల్ రెడ్డి
వి.ఎల్. విశ్వేశ్వ రావు
ఆర్. అఖిలేశ్వరి

సంపాదకుడు
బొజ్జా తారకం

ఉప సంపాదకులు
గుడిపాటి
యన్. జయ

రూపకల్పన
ఏ. షరీఫ్

ప్రచురణ, ముద్రణ
హైద్రాబాద్ బుక్‌ట్రస్ట్ తరఫున సిరిల్‌రెడ్డి

అక్షరాలు
ఓం సాయి లేజర్ గ్రాఫిక్స్ ,
నారాయణగూడ.

అచ్చు :
హైదరాబాద్ ప్రింటర్స్,
హైదరాబాదుకుగాను,
గాయత్రి ఎంటర్ ప్రైజెస్, హైదరాబాద్

సర్క్యులేషన్ మేనేజర్
శరత్‌చంద్ర
'నలుపు' పక్ష పత్రిక
ఇం. నెం. 1-1-342 /బి, వివేక్‌నగర్
హైదరాబాద్ - 500 020.

నలుపు
ప్రజల పక్ష పత్రిక

సంపుటి: 1 సంచిక: 7 జూలై 16-31, 1989

లోపలి పేజీల్లో

గోదావరి పరూలేకర్

నాటికీ నేటికీ రైతాంగ పోరాటాలలో జాజ్వల్యమైన ఘట్టం తెలంగాణా సాయుధరైతాంగపోరాటం. ఈ పోరాటం సాగుతున్న కాలంలోనే మహారాష్ట్రలో వర్లీ ఆదివాసులు తమ హక్కుల కోసం పిడికిళ్ళెత్తారు. తరతరాల దోపిడీ, అజ్ఞానం అంధకారం నుంచి బయటపడి వెలుగుబాట పట్టారు. వర్లీ ఆదివాసులను మేల్కొలిపి ఏకం చేసిన వారు గోదావరి పరూలేకర్. ఉప్పొంగిన వరద గోదావరిలో ఆమె మహారాష్ట్రలోని ఠాణేజిల్లాలో పల్లె పల్లె తిరిగారు. ఆదివాసి సమస్యలను సన్నిహితంగా పరిశీలించారు. వర్లీలు తమకు తాము దుర్భర బానిసత్వ శృంఖలాలు తెంచుకుని హక్కుల కోసం పోరాడేలా చైతన్యం కలిగించారు.

గోదావరి పరూలేకర్ ఎగువ మధ్య తరగతి కుటుంబంలో జన్మించారు. బి.ఎ.ఎల్.ఎల్.బి. చదివారు. గోఖలే స్థాపించిన 'సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ'లో కొంత కాలం పనిచేశారు. అదే సంస్థలో పనిచేస్తున్న శ్యాంరావ్ పరూలేకర్‌ను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ప్రస్తుత సాంఘిక వ్యవస్థ మారనంతకాలం ఎంత కృషి చేసినా పేదలు పేదలుగానే ఉండి పోతారనే అభిప్రాయానికి వచ్చారు. మార్క్సిజం వైపు ఆకర్షితులయ్యారు. కార్మిక కర్షక రంగాల్లో పనిచేశారు. ఆమె అనేక నిర్బంధాలకు గురవుతూ కూడా ఆదివాసులైన వర్లీలలో పనిచేసి బ్రహ్మాండమైన ఉద్యమాన్ని నిర్మించారు.

వర్లీ ఆదివాసి పోరాటం 20 ఏళ్ల పాటు సాగింది. ఠాణే జిల్లాలో దహాను, తలసారి, జవ్హార్, నడా, మొఖడా, పాల్ఘర్ మొదలైన తాలూకాల్లో దట్టమైన అడవులు వర్లీ ఆదివాసుల నివాసాలు. ఒక్క ఠాణే జిల్లాలోనే 5 లక్షల మంది ఆదివాసులున్నారు. వీరిలో ప్రధానమైనది వర్లీ తెగ.

దాదాపు 135 సంవత్సరాల క్రితం ఆ ప్రాంతంలోని భూమి అంతా వర్లీలదే. బ్రిటిష్ పాలన ఆరంభమైన తరువాత, కొత్తగా ఆ ప్రాంతం వచ్చిన వారు చాల భాగం భూములు ఆక్రమించుకొని భూస్వాములయ్యారు. సారవంతమైన భూములు తామే సాగుచేస్తూ, నాసిరకం భూముల్ని సగం పంట కౌలుపై తిరిగి ఆదివాసి వర్లీలకు ఇచ్చారు. వర్లీలు సగం పంట ఇవ్వడమే గాక, భూస్వాముల భూముల్లో వెట్టికి పనిచేసే వారు. భూస్వాముల ఇళ్లకు వంట చెరుకును చేరవేసేవారు. 15 మైళ్ళు నడిచి వెళ్లయినా సరే పాలు సరఫరా చేసేవారు. భూస్వాముల ఇళ్లలో పాచి పనిచేసేవారు. పాకీ పనికూడా చేయాల్సి వచ్చేది. భూస్వాములు తమ అతిథులకు మర్యాదలు చేయడానికి ఆదివాసి స్త్రీలను వినియోగించేవారంటే, వర్లీలు ఎంత దుర్భరమైన బానిసత్వాన్ని అనుభవించే వారో అర్థం చేసుకోవచ్చు.



1945లో వెట్టి కార్మికులు విముక్తి ఉద్యమం ప్రారంభమయింది. భూస్వాముల అధీనంలో ఉన్న విస్తారమైన పచ్చికబీళ్లలో గడ్డి కోసే సీజను అది. ఈ గడ్డికి పశుగ్రాసంగా బొంబాయి మార్కెటులో మంచి గిరాకీ ఉంది. 500 పౌండ్లు (200 కి.గ్రా) గడ్డి కోస్తే రూ. 2.50 కూలి ఇవ్వాలని వర్లీలు సమ్మె ప్రారంభించారు. భూస్వాములు పచ్చిక మైదానాల్లో గడ్డి కోసే దిక్కులేకపోయింది. కోసిన గడ్డిని తోలడానికి వర్లీలు 5000 బండ్లు కట్టేవారు. బండ్లు కట్టడానికి కూడా వర్లీలు నిరాకరించారు. భూస్వాముల పొలాల్లో పంటలు కోయటానికి కూడా ఎవరూ వెళ్లలేదు. పొలాల మీద పంటలు అలాగే ఉండిపోయాయి. వర్లీల ఐక్యత, సంఘీభావం చూసి భూస్వాముల గుండెలు అదిరాయి.

వర్లీల ఉద్యమం ప్రారంభం నుంచే భూస్వాముల దాడులు, పోలీసుల నిర్బంధాన్ని ఎదుర్కొంది. 1945లో మొదటిసారి, 1946 47లో రెండవసారి ఆదివాసులపై పోలీసుల పాశవిక దమనకాండ స్వైరవిహారం చేసింది. 1956లో సాగిన పోలీసుల దాడి అతి కిరాతకంగా సాగింది. 139 గ్రామాల్లో తీవ్ర నిర్బంధం కొనసాగింది. అనేక మంది ఆదివాసులు పోలీసు కాల్పుల్లో మరణించారు. వందలాది మంది అరెస్టయ్యారు.

ప్రస్తుతం అక్కడ పరిస్థితు లేమైనా, మారాయా అంటే మారలేదనే చెప్పుకోవాలి. ఇప్పుడు వెట్టి బానిసత్వం లేకపోవచ్చు. అజ్ఞానం, అమాయకత్వం వర్లీలలో లేకపోవచ్చు. వీరూ మైదాన ప్రాంత ప్రజల మాదిరిగా జీవిస్తూ ఉండవచ్చు. కాని భూమి పంపకం జరక్కుండా దారిద్ర్యం, దోపిడీ అంతం కావు అంటున్నారు గోదావరి పరూలేకర్.

ఆమెకిప్పుడు 79 ఏళ్ళు. 1962 నుంచి 66 వరకు ఆమె జైలులో ఉన్నారు. ప్రస్తుతం ఆమె భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) కేంద్ర కమిటి సభ్యురాలు. అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షులు. ఆదివాసుల్లో, పేద ప్రజల్లో పనిచేయాలనుకునే వారందరికీ నిత్య ఆదర్శం గోదావరి పరూలేకర్.

అడవుల్ని తినేస్తున్న మేకలు

మేకలు అడవుల్ని తినేస్తున్నాయట, అందుకని మేకల్ని లేకుండా చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వెంటనే మేకల్ని నిషేధిస్తూ ఉత్తరువులు జారీ చేశారు. ఇది చాల విచిత్రంగా ఉన్నది. మేకలు అడవుల్ని తినేస్తాయా? మేకల వలన అడవికి అసలు నష్టం ఉన్నదా? నష్టం ఉంటే ఎంత మేరకు ఉన్నది? ఆ నష్టాన్ని మేకల్ని నిషేధించకుండా ఆపగలమా లేదా భర్తీ చేసుకోగలమా? నిజంగా మేకల వలన అడవికి ప్రమాదం ఉంటే ఆ ప్రమాదాన్ని నివారించలేమా? ఏవైనా ఇతర చర్యలు తీసుకుంటే అడవికి నష్టం రాకుండా చూసుకోలేమా? ఈ ప్రశ్నలన్నింటికి సమాధానం చూసుకోకుండా మేకల్ని నిషేధించడం అనేది తెలివితక్కువతనం తప్ప మరేమి కాదు.

అడవికి నిజంగా నష్టం ఎవరి వల్ల జరుగుతున్నది? అటవీ సంపద నంతా ఎవరు కొల్లగొట్టుకుపోతున్నారు? పెద్ద పెద్ద చెట్లను కలపగా ఎవరు మోసుకు పోతున్నారు? ఎర్ర చందనం లాంటి విలువైన సంపదను ఎవరు విదేశాలకు దొంగ రవాణా చేస్తున్నారు? అడవినంతా తమ సామ్రాజ్యంగా పరిపాలన చేసుకుంటున్నవి మేకలా? కాంట్రాక్టర్లా? అటవీ సంపదతో సహా అడవిని నమ్ముకొని బ్రతుకుతున్న వేలాది ప్రజల జీవితాలతో చెలగాటమాడుతూ వారి బ్రతుకులలో మట్టి కొడుతున్నవి మేకలా? అటవీ శాఖ అధికార్లా?

మొదటి నుంచి అడవి సంపదను అనుభవిస్తున్నది కాంట్రాక్టర్లు, అటవీశాఖ అధికార్లు, దొంగరవాణా చేసే స్మగ్లర్లు! కొన్ని కోట్ల రూపాయిలు విలువైన సంపదను వారు కొల్లగొట్టుకుపోతున్నారు. దీనికి అన్ని వైపుల నుంచి ప్రభుత్వం నడుపుతున్న పెద్దలకు వాటా లభిస్తుంటుంది. బాహాటంగా అడవిని కొట్టుకు పోతున్న వ్యాపారస్థులను అటవీశాఖ అధికార్లు పట్టుకోరు కాని ఒక చిన్న ఎండుకట్టనే, రాలిపడిన పండునే తీసుకోవటానికి వచ్చిన ప్రజలను పట్టుకొని, కొట్టి, వారి దగ్గర నుండి 'దండుగ' తీసుకుంటారు. ఏదో ఎక్కడో ఒక గడ్డి పరక కొరుక్కుంటున్న మేక పిల్లని పట్టుకొని, దానికి యజమాని నుంచి 'దండుగ' తీసుకుంటారు, లేదా మేకనే తీసుకుంటారు. కోట్లాది రూపాయిలు విలువ చేసే అటవీ సంపద ఒకపక్క నుంచి దొంగ రవాణా అవుతూ ఉంటే చూస్తూ ఊరుకుంటారు, తమ జేబులు నింపుకుంటారు కాని ఒక మేక పిల్ల వస్తే అడవి అంతా నాశనమై పోతున్నదని గగ్గోలు చేస్తున్నారు. అడవిని, దాని అడుగు భాగాన్ని మేకలకు అందకుండా చేస్తున్నారు.

స్వతంత్రం వచ్చిన నాటి నుంచి 'గిరిజనులు' అని చెప్పుకుంటున్న వారిని అడవుల నుంచి తొలగించటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. షెడ్యూల్డు తెగల ప్రజలకు అడవిలో దొరికే ఏ వస్తువు కూడా దక్కనీయకుండా చేస్తూ వస్తున్నారు. లక్షలాది గిరిజనులు అడవి మీదనే బ్రతుకుతారు. అడవిలో దొరికే పండ్లు, దుంపలు తింటూ బ్రతుకుతారు, పోడు సాగు చేసుకొని బతుకుతారు. అడవి బయటకు వెళ్లే వారికి జీవనాధారం ఏమీ ఉండదు. అటువంటి ప్రజలకు బ్రతుకుదెరువు లేకుండా చేయటానికే ఎన్నో పథకాలు ప్రభుత్వం చేస్తున్నది. అడవి మీద ఆధార పడినవారికి ఆ ఆధారం లేకుండా చేస్తున్నారు. అడవిలోనుంచి కొండల మీద నుంచి గిరిజనులను తరిమి వేసి మొత్తం అడవిని, కొండలను కాంట్రాక్టర్లకు అప్పగిస్తున్నది ప్రభుత్వం. వారు కొల్ల గొట్టుకొనేది కొల్లగొట్టుకుంటే ప్రభుత్వానికి అంతో ఇంతో ముట్ట చెపుతూ ఉంటారు.

అడవి ఏమయితేనేం? గిరిజనులు ఏమైపోతేనేమి? వారికి కావలసింది డబ్బు. దళారీ పద్ధతి మీద బాగా విశ్వాసం ఉన్న ప్రభుత్వానికి ప్రజలు ఏమైపోతారు అనే సమస్య ఉండదు. వారికి కావలసిందల్లా తమ సంచులు నిండుతున్నాయా లేదా అనేదే. ఎన్ని కోట్ల రూపాయలు కాంట్రాక్టర్లు, అధికార్లు కలిసి ఎత్తుకుపోతున్నా ఫరవాలేదు కాని ఒక మేకపిల్ల ఒక పచ్చగరిక కొరకకూడదు! ఒక గిరిజన మహిళ రొట్టె కాల్చుకోడానికి ఎండు కట్టె ఏరుకోకూడదు! ఇదీ మన ప్రభుత్వ విధానం. అడవిని నరికి ఎత్తుకుపోయి ఎంత మంది లక్షాధికార్లు కోటీశ్వరులయ్యారో ఈ మేకలు చూస్తూనే ఉన్నాయి.

మేకలను పెంచి వాటిపైనే బ్రతుకుతున్న జనం మన రాష్ట్రంలో లక్షలాదిగా ఉన్నారు. మన సమాజంలోని కులవ్యవస్థలో ఒకటి రెండు కులాలు కేవలం వాటి మీదనే బ్రతుకుతారు. మరో గత్యంతరం లేదు వారికి. వారికి బ్రతుకుదెరువు లేకుండా చేయటానికే ఈ పని తలపెట్టింది ప్రభుత్వం. చేపలు పట్టుకొని బ్రతికే కులానికి ఆ పని లేకుండా చేస్తున్నారు. కుంటల్లో, చెరువుల్లో, నదుల్లో వారు ఇపుడు చేపలు పట్టకూడదు, నిషేధించారు. నేత నేసుకొని బ్రతికే కులం ఇపుడు ఆత్మహత్యలకు, ఆకలి చావులకు వెతుక్కుంటున్నది. కల్లుగీసుకొని బ్రతికే వారిని సారా వ్యాపారం మింగేసింది. ఏదో వృత్తి చేసుకొని బ్రతికే వారిని ఆ వృత్తి లేకుండా చేస్తున్నది నేటి ప్రభుత్వం. గిరిజనులకు అడవి లేకుండా చేసింది, ఆఖరికి మేకల్ని కూడా నిషేధిస్తున్నది. అడవిని తింటున్న స్మగ్లరు పులులు, అధికార సింహాలు యథేచ్ఛగా తిరగవచ్చు కాని పాపం మేకలు తిరగకూడదు!

బంగ్లాదేశ్‌లో నూటికి 79 మంది నిరుద్యోగులే

బంగ్లాదేశ్‌లోని 11 కోట్ల జనాభాలో దాదాపు ఎనిమిది కోట్ల మంది నిరుద్యోగులే. ఈ 8 కోట్ల మంది ఇతరుల ఆదాయంపై ఆధారపడి జీవిస్తున్నారని ఒక సర్వేలో వెల్లడయినట్టు బెంగాలీ దినపత్రిక 'ఇత్తెఫాక్' పేర్కొంది.

పని చేస్తున్న మూడు కోట్ల మందిలో దాదాపు 46 లక్షల మంది నగరాల్లో, పట్టణాల్లో పనిచేస్తుండగా మిగిలిన రెండుకోట్ల 63 లక్షల మంది గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్నారు. పని చేసేవారిలో మహిళల సంఖ్య కేవలం పది శాతం మాత్రమే. ఈ పనిచేసే వారిలో వ్యవసాయ రంగాలలో 60 శాతం వరకు ఉండగా పారిశ్రామిక రంగంలో కేవలం 9.9 శాతం మాత్రమే ఉన్నారు.

(21-6-1989 హిందుస్తాన్ టైమ్స్)

త్రిపురలో ఆకలి చావులు

త్రిపురలోని ఉత్తర జిల్లాల్లో 19 మంది ఆకలిచావులకు గురయ్యారు. ఈ జిల్లాల్లో కరువు చాలా ఎక్కువగా ఉన్నది. వర్షాలు లేకపోవడంతో వ్యవసాయం చేయలేకపోతున్నారు. దీనితో ఎలాంటి పనులు దొరక్క గత రెండు, మూడు నెలలుగా కూలీలు దుర్భర దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నారు. ఈ ఉత్తర జిల్లాల్లోని 130 గ్రామ పంచాయతీలను కరువు పీడిత ప్రాంతాలుగా ప్రకటించి ఆహార ధాన్యాలను సరఫరా చేయాలని సి.పి.ఐ (ఎం) ఆందోళన చేస్తోంది.

(15-6-1989 న్యూస్‌టైం)

మండేలాకు మానవ హక్కుల అవార్డు

పాతికేళ్ళుగా దక్షిణాఫ్రికా జైల్లో మగ్గుతున్న నల్లజాతి నాయకుడు. నెల్సన్ మండేలాకు లిబియా మానవ హక్కుల బహుమతి గత నెలలో ప్రదానం చేశారు. లిబియాలోని స్వతంత్ర అంతర్జాతీయ ప్రజా కమిటీ ఈ బహుమతి ప్రదానం చేసింది. ప్రపంచంలో సామూహికంగా మానవ హక్కుల ఉల్లంఘనకు వ్యతిరేకంగా పోరాటానికి మండేలా ప్రతీక అని ఈ కమిటీ అభివర్ణించింది. ట్రిపోలీలో జరిగిన ఉత్సవంలో ఈ బహుమతిని మండేలా కుమార్తె జెనటకు అంద జేశారు. ఈ బహుమతి నగదు 2,50,000 డాలర్లు ఆఫ్రికన్ జాతీయ కాంగ్రెస్‌కు అందజేశారు.

(13-6-1989 టెలిగ్రాఫ్)

అక్కడ అందరికీ చదువు వస్తుంది.

కేరళలోని కొట్టాయంలో అందరూ అక్షరాస్యులే. 70 వేల జనాభా వున్న ఈ చిన్న పట్టణంలో నూటికి నూరుశాతం మందికి చదువు వస్తుంది. ఈ పట్టణంలోని 5-64 ఏళ్ల మధ్య గల అందరు చదవను, రాయను నేర్చినవారు. జాతీయ అక్షరాస్యతా పథకం కింద ఈ పట్టణంలోని వారందరిని అక్షరాస్యులను చేశారు. దేశంలో ఈ విధంగా నూటికి నూరు మంది అక్షరాస్యులున్న పట్టణాల్లో ఇదే మొట్టమొదటిది.

(15-6-1989 టైమ్స్ ఆఫ్ ఇండియా)

అప్పులున్న దేశాల్లో భారత్‌ది 4వ స్థానం

ప్రపంచంలోని రుణగ్రస్త దేశాల్లో భారతదేశం నాలుగోస్థానం వహించింది. విదేశాలకు చెల్లించాల్సిన అప్పులు 1988 నాటికి 76 వేల కోట్ల రూపాయలకు పైగా ఉన్నాయి. ఈ ఏడాది ఈ అప్పులు 82 వేల కోట్ల రూపాయలకు పెరుగుతాయని భావిస్తున్నారు. అప్పు పడ్డ దేశాల్లో బ్రెజిల్. మెక్సికో అర్జెంటీనా తర్వాత భారతదేశం నాలుగోస్థానంలో ఉంది. ఆసియాలో ఎక్కువ అప్పులున్న దేశాల్లో భారతదేశమే అగ్రస్థానం వహించింది.

(11-6-1989 ఇండియన్ ఎక్స్‌ప్రెస్)

పన్నెండేళ్ళకు తిరిగొచ్చిన బిల్లు

మన దేశంలో కిందిస్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు రెడ్ టేపిజం పెరిగిపోయిందనడానికి రుజువుగా రాష్ట్రపతి ఆర్. వెంకట్రామన్ పన్నెండేళ్ళ తర్వాత ఒక బిల్లును కేరళ రాష్ట్ర ప్రభుత్వానికి వెనక్కి తిప్పి పంపారు. కేరళ రాష్ట్ర శాసనసభ 1977లో క్యాజువల్, టెంపరరీ, బదిలీ కార్మికుల వేతనాలకు సంబంధించిన బిల్లును ఆమోదించి రాష్ట్రపతి అంగీకారం కోసం పంపించింది. అయితే ఇన్నాళ్ళు ఈ బిల్లును ఆమోదించకుండా పెండింగ్‌లో పెట్టి ఈ ఏడాది మార్చి 18న రాష్ట్ర ప్రభుత్వానికి తిప్పి పంపారు. ఈ చట్టాన్ని తిరిగి పరిశీలించి, తగిన విధంగా సవరించాలని కూడా రాష్ట్రపతి కార్యాలయం కోరింది. ఈ విధంగా బిల్లు వెనక్కి తిరిగి రావడానికి 12 సంవత్సరాలు పట్టింది. కేరళ శాసనసభ స్పీకర్ వర్కల రాధాకృష్ణన్ ఇటీవల స్పీకర్ల సమావేశంలో ఈ విషయం చెప్పారు.

(27-6-1989 టైమ్స్ ఆఫ్ ఇండియా)

విషవాయువు బుసలతో పటాన్ చెరు పరిసరాలు

అది మెదక్ జిల్లాలోని పటాన్ చెరు పారిశ్రామిక వాడ. సుమారు మూడు వందల చిన్న, మధ్య, భారీ పరిశ్రమలతో వెలుగుతున్నది. దేశంలోనే ఇది ఉన్నతమైన వాటిలో ఒకటిగా కీర్తింపబడుతున్న పరిశ్రమల కూడలి. కాని అక్కడ పారిశ్రామికాభివృద్ధి పేరిట జరుగుతున్నది మృత్యుకుహరాల్లాంటి పరిశ్రమల స్థాపన. ఈ విషయం ప్రభుత్వానికి, ప్రభుత్వ అధికారులకు స్పష్టంగా అర్థం అవుతూ ఉన్నా అందుకు విరుగుడుగా తీసుకోవాల్సిన రద్దు, రక్షణ చర్యలు ఏమీ లేకపోవడంతో అక్కడి ప్రజల మనుగడకు ముప్పు వాటిల్లే సూచనలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

ఈ పారిశ్రామికవాడలోని పరిశ్రమల్లో సుమారు 40 (నలభై) రసాయనిక, క్రిమిసంహారక మందులను ఉత్పత్తి చేస్తున్నాయి. వీటిలో కొన్ని పరిశ్రమలు తమ కలుషిత, రసాయనిక పదార్థాలను సహజ సిద్ధంగా ఏర్పడిన 'నక్కవాగు' లోనికి మళ్ళించడంతో ఎన్నో ఏళ్ళుగా మంచినీటిని, సాగునీటిని పొందుతున్న చుట్టుప్రక్కల గ్రామాలైన పోచారం, గణపతిగూడెం, బచ్చుగూడెం, ఆరుట్ల, చిట్కుల్, బ్యాతోల్, ఐనేలు, చిద్రుప్ప, కంజర్ల, ఇస్మాయిల్, ఖాన్‌పేట్, గండిగూడెం గ్రామాలు మంచినీటి కొరతకు, కరువుకాటకాలకు గురైనాయి. గత ఏడు సంవత్సరాలగా తమ వ్యర్థపదార్థాలను విచ్చలవిడిగా 'నక్కవాగు'లోకి పంపడంతో అందులోని నీరంతా పూర్తిగా కలుషితమైపోవటంతో ప్రజలు ఆ నీటిని వాడలేకపోతున్నారు.

ఈ విధంగా నక్కవాగు కాలుష్యం విషకోరలకు బలికావడంతో కాలువకు ఇరువైపుల ఉన్న సాగుభూములు ఎడారులుగా మారి 'సహారా'ను మరిపిస్తున్నాయి. కాలుష్యపు నీరును పంటలకు పారిస్తే పంటలు మాడిపోతున్నాయి. భూములు అమ్ల, క్షార గుణాలు కలవిగా తయారవుతున్నాయి. ఫలితంగా రైతులు కాలుష్యం విసిరిన సవాలును ఎదుర్కొనలేక దాని బిగి కౌగిలిలోనే "బందీ" అయి కొట్టుమిట్టాడుతున్నారు. నక్కవాగును చూసి కన్నీరు పెట్టుకుంటూనే బావులు తవ్వి అయినా, బోరింగులు వేసి తమ బతుకులను ఈడ్చుకుందామనే తపనతో వేలాది రూపాయలను అప్పులుగా తెచ్చుకున్నారు. బావుల్లోంచికూడా కలుషితమైన నీరే ఊటగా రావడంతో కర్షకులు తనివి తీర ఏడుద్దామన్నా కంటనీరు లేక జీవచ్ఛవాల్లా బిక్కు బిక్కుమంటున్నారు. ఈ పరిశ్రమలు వదిలిన విషపునీరే భూమిలోనికి ఇంకిపోయి, బావులు, త్రవ్వినా, బోరింగులు వేసినా ఊటగా వస్తున్నట్లు, ఇక ముందు ఆ ప్రభావం తీవ్రంగానే వుంటుందని జియాలజిస్టులు అంటున్నారు.

కాలుష్య రక్కసి కోరలకు బలైన పెద్ద కంజర్ల రైతు రహీమొద్దీన్, చేసిన అప్పులను తీర్చలేక పడే అవస్థలు వర్ణనాతీతం. ఇతడు కంది గ్రామంలోని ఆంధ్రాబ్యాంకు నుండి 25 వేల రూపాయలు అప్పు తెచ్చుకొని, బావి తవ్వి కరెంట్ మోటార్ బిగించుకుంటే విషం నీరు ఊటగా వస్తుండడంతో నివ్వెరపోయి, చేసిన అప్పులు తీర్చలేక ఇబ్బందుల పాలవుతున్నాడు.

పంటల నష్టం

పటాన్‌చెరు మండలంలోని వివిధ గ్రామాల్లో పంటలపై, భూములపై, కరెంట్ మెటార్లు, పశువులపై అత్యధికంగా నష్టం వాటిల్లింది. ఐనేలు గ్రామంలో 15 కుటుంబాలకు చెందిన 36 ఎకరాల భూమి, ఇతరంలపై 13 లక్షల 89 వేల రూ॥లు నష్టపోగా, చిట్కుల్ గ్రామంలోని 9 కుటుంబాలు తమ 30 ఎకరాల భూమి విషమయం కావడంతో 4 లక్షల 3 వేల వరకు నష్టపడ్డాయి. గణపతిగూడెం గ్రామానికి చెందిన 16 కుటుంబాలు తమ 2 ఎకరాల భూమిని కాలుష్య గంగ కబళించడంతో 10 లక్షల 10 వేలు రూ॥లను, పెద్ద కంజర్ల గ్రామంలో సుమారు 20 లక్షల రూ॥ల విలువ జేసే పంటభూములు, కరెంట్ మోటార్లను 44 కుటుంబాలు నష్టపడగా, బండ్లగూడకు చెందిన 22 కుటుంబాలు 45 ఎకరాల భూమి పాడు కావడంతో 11 లక్షల 30 వేల రూ॥ల నష్టం వాటిల్లింది. ఆరుట్లకు చెందిన పది కుటుంబాలు తమ పన్నెండు ఎకరాల భూమిని వదులుకోవాల్సిన పరిస్థితి ఎదురుకావడంతో లక్షా 70 వేలు నష్టంరాగా, చిద్రుప్ప గ్రామంలో 22 కుటుంబాలకు చెందిన 82 ఎకరాలు మాడి మసికావడంతో 4 లక్షల 84 వేలు నష్టం వచ్చింది. పటాన్ చెరు గ్రామంలో అత్యధికంగా అంటే 138 ఎకరాల విస్తీర్ణంలో పంటభూమి పాడుపడడంతో సుమారు పది లక్షల రూ॥ల నష్టం రాగా, లక్డారం గ్రామంలో 19 కుటుంబాలు తమ 22 ఎకరాల భూమిని కాలుష్యపు అగ్నికి

అహుతి చేసుకోవాల్సి వచ్చింది భ్యాతోలు గ్రామంలో 16 కుటుంబాలు తమ 66 ఎకరాల భూమి కాలుష్యంతో ఖాయిలా పడడంతో 10 లక్షల 32వేల రూ॥ల నష్టం వాటిల్లింది. (ఇవన్నీ పశువుల మరణాలు, కరెంట్ మోటార్లు చెడిపోవడం, బావుల పాడు పడటం, పంటల నష్టంలను కలుపుకొని అంచనావేయడం జరిగింది)

పశువుల మరణాలు

తరతరాలుగా పటాన్‌చెరు పరిసర గ్రామాలకు మంచినీటిని అందిస్తున్న 'నక్కవాగు' కలుషితం కావడంతో నీరంతా విషపూరితంగా మారి, పశు, పక్ష్యాదుల ప్రాణాలను బలితీసుకుంటున్నది. ఈ నీరును తాగిన పశువులు సుమారు 400 వరకు చనిపోయి వుండవచ్చుని ఒక అంచనా. ఇందులోని నీళ్ళను త్రాగిన వెంటనే పశువులు కాళ్ళు ఈడ్చుకుంటూ స్వల్పవ్యవధిలోనే చనిపోవడం జరిగింది డాక్టర్లు సైతం అంతు చిక్కని ఈ రోగాలతో ఆశ్చర్య పోతున్నారు సుల్తాన్‌పురం గ్రామంలో కలుషితమైన నీరు త్రాగి వేలాది రూపాయల విలువజేసే గేదెలు, దున్నపోతులు చనిపోయాయి.

ఇక్కడి పరిసర గ్రామాల్లో మంచినీటి సౌలభ్యంకై ప్రభుత్వం వేయించిన బోరింగ్ బావుల్లోకి సైతం రసాయనాలు చేరడంతో ఆ నీళ్ళను తాగే ప్రజానీకం వివిధ రకాలైన జబ్బులకు లోను కావల్సి వస్తోంది. ఇక్కడి ప్రాంతాల్లో నివసించే జనాలకు దగ్గు, ఉబ్బసం, జ్వరం, కీళ్ళనెప్పులు, వాపులు, తలనొప్పి, అరికాళ్ళ నెప్పులు, మొదలైన రోగాలు రావడమే గాక ఈ దశాబ్దాంతానికి ప్రభుత్వం ప్రకటిస్తున్నట్లుగా, ఇంటింటికో ఉద్యోగం మాట ఏమిటో గాని, ఇంటికో క్యాన్సర్ రోగి మాత్రం తయారు కావడం ఖచ్చితమని వైద్య నిపుణులు అంటున్నారు.

నక్కవాగులోని నీటితో వంట పాత్రలు కడిగితే చిల్లులు పడుతున్నాయి. కాళ్ళు చేతులు కడుగుతుంటే దురద, బొబ్బలుఎక్కడం, చర్మ వ్యాధులు రావడం సంభవిస్తున్నాయి. ఇక్కడి పొలిమేరల్లో నివసించే ప్రజలు కూడ నల్లబడుతున్నట్లు తెలిసింది. కొంతమంది స్త్రీలు మాతృత్వానికి నోచుకోక కాలుష్యంతో అబార్షన్ల పాలు అవుతున్నట్లు సర్వేలో తేలింది.

దినసరి కార్మికులుగా రైతులు

తమ వేలాది ఎకరాల పంట భూములు కాలుష్యం బారిన పడడంతో తెచ్చిన అప్పులు తీర్చలేని పరిస్థితిలో, భార్యా బిడ్డల పోషణకోసం ఇక్కడి ఫ్యాక్టరీల్లో రోజు కూలీలుగా చేరక తప్పలేదు. ఈ విధంగా పుడమితల్లిని 'అన్నపూర్ణ'గా తీర్చిదిద్దే రైతుల చేతులు కెమికల్ గొట్టాలను ఎత్తడానికి, మరమ్మత్తు చేయడానికి, విషపూరిత పదార్థాల తయారీకి సన్నద్ధం అయ్యాయి.

ప్రాణాంతకమైన వోల్టాస్ ఫ్యాక్టరీ

ఇది అన్ని పరిశ్రమల కంటే అతి ప్రమాదకారిగా పరిగణింపబడుతున్నది. ఇందులో పనిచేసే కార్మికులు నల్లగా మారుతున్నట్లు తెలిసింది. వీరికి ప్రతి ఆరునెలల కొకసారి రక్తం మరియు ఇతర వైద్య పరీక్షలు చేయించాల్సినబాధ్యత యాజమాన్యం పై వుండగా, దానిని తొక్కిపెడుతున్నట్లు తెలియ వచ్చింది. వోల్టాస్ కంపెనీ జోలాన్ అనే క్రిమి సంహారక మందును తయారు చేయడానికి అనుమతి వుండగా, ఫోరేట్ ఉత్పత్తికై ప్రభుత్వ అనుమతి ఇవ్వకున్నా వున్న ప్లాంటనే కొద్దిపాటి మార్పులు చేసి ఉత్పత్తి చేస్తూ ఇతర దేశాలకు పంపుతున్నట్లు తెలుస్తున్నది. ప్రపంచ వ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన 'భోపాల్' మారణకాండకు మూల హేతువైన 'మిక్' గ్యాస్ ఉత్పత్తికై ఇటీవల ఈ ప్లాంట్‌లో ప్రయోగాలు నిర్వహించినట్లు తెలుస్తున్నది. ఇది ఇక్కడి ప్రజానీకానికి మరో 'యూనియన్ కార్బైడ్'గా గోచరిస్తున్నది.

హిందుస్థాన్ ఫ్లోరో కార్బన్స్ స్థాపన

అత్యంత ప్రమాదకరమైన ఈ పరిశ్రమను పటాన్‌చెరుకు సమీపంలో వున్న రుద్రారం గ్రామం వద్ద నిర్మించారు. దీని ప్రభావం వల్ల క్యాన్సర్ వ్యాధి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు శాస్త్రజ్ఞుల అభిప్రాయం. ఈ ఫ్యాక్టరీ జనావళికి 20 కి.మీ దూరంలో నిర్మించాలనే నిబంధన వుండగా సుమారు లక్షకు పైగా నివసించే జనం మధ్యలో ప్రారంభించారు. దీని చుట్టు ప్రక్కల ఎద్దనూరు, లంబాడి తండా, కంది, ఇస్మాయిల్‌ఖాన్‌పేట్, మామిడిపల్లి, రుద్రారం గ్రామాల ప్రజలు నివసిస్తున్నారు. ఈ కాలుష్యం ప్రభావంతో రక్తం చెడిపోయి శుక్రకణాల్లో ప్రవేశించి మెదడుకు సంబంధించిన వ్యాధులు, పుట్టబోయే శిశువులకు అంగవైకల్యం, పుట్టుకతోనే 'క్యాన్సర్ వ్యాధులు వచ్చే అవకాశాలు మెండుగా వున్నట్లు శాస్త్రవేత్తలు అభిప్రాయ పడుతున్నారు. ఈ ప్లాంట్ నెలకొల్పడానికి మహారాష్ట్ర, గుజరాతు రాష్ట్రాలు తమ సమ్మతిని తెలియపర్చకపోవడంతో, ఆంధ్ర ప్రభుత్వం వెంటనే ఒప్పేసుకొని మెదక్ జిల్లాలో నిర్మించమని గేట్లు బార్లా తెరిచింది. ఫలితంగా లక్షకు పైగా ప్రజానీకం తమ ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని జీవిస్తున్నారు.

ఇది పటాన్‌చెరు పరిశ్రమల వేధింపులైతే, వాటికి తామేమీ తీసిపోలేదంటూ 'బొల్లారం' పారిశ్రామిక వాడలోని కార్మాగారాలు వీటితో పోటీ పడుతున్నాయి.

మంచినీరు, మంచిగాలి కరువైన

పటాన్ చెరు ప్రజలలాగ బొల్లారం పారిశ్రామిక వాడ చుట్టువున్న గ్రామాల ప్రజలు అట్టుడికి పోతున్నారు. ఈ ప్రాంతంలోని రెడ్డీ లాబొరేటరీస్, ఎ.పి.మెటల్స్ (ఆంధ్రప్రదేశ్ మెటలాజికల్స్) ఇతర పరిశ్రమలు ప్రజల జీవితాలతో చెలగాట మాడుతూ, వారి జీవించే హక్కును కాలరాస్తు న్నాయి. చుట్టుప్రక్కల గ్రామాలైన నిజాంపేట్, మియాపూర్, హాఫీజ్‌పేట్, మదీనాగూడా, మల్లంపేట్, బొల్లారం, కానుకుంట, అశోక్‌నగర్, రామచంద్రా పురం ప్రజలు రాత్రి పడుతుంది అంటుండగానే ఊపిరి పిల్చుకోవటానికి జంకుతారు. ఎందుకంటే ఆ సమయంలో వారి కొంపలను నడుపుకుంటుండగా వెలువడే విష వాయువుల తాకిడికి తుట్టుకోలేక. ఇక్కడి పరిశ్రమల మూలంగా సుల్తాన్‌పురం గ్రామానికి చెందిన 120 ఎకరాల భూమి పనికి రాకుండా పోగా, కిష్టారెడ్డి పేటలో 40 ఎకరాలు, గండిగూడెంలో 10 ఎకరాలభూమి సేద్యానికి పనికి రాకుండా పోయింది. దీనికి సంబంధించిన నష్టం కూడ లక్షల రూపాయల్లో ఉంటుంది. ఎ.పి. మెట్స్ కార్మాగారం నుండి వెలువడే కలుషిత రసాయనిక నీరు గుంటల్లో నిండి పోయిన కారణంగా యాజమాన్యం దొంగతనంగా సుల్తాన్‌పురం గ్రామ చెరువులోకి మళ్ళిస్తుండగా ఆ గ్రామ ప్రజలు రాత్రి పూట మాటు వేసి పట్టుకొని అందుకు బాధ్యులైన వారిని బంధించారు. పటాన్‌చెరు కాలుష్య సంఘర్ష సమితి అధ్వర్యంలో సంబంధిత యాజమాన్యాలతో చర్చించి నష్టం వాటిల్లిన మేరకు అంటే సుమారు 97 వేల రూపాయలను వివిధ ఫ్యాక్టరీల యజమాన్యాలు తమ భాగస్వామ్యంలో నష్టపోయిన రైతులకు పరిహారంగా చెల్లించాయి. ఈ విధంగా కాలుష్య బాధితులు సంఘటితంగా వుండి తమ పోరాటంలో ఒక అడుగు ముందుకు వేసినట్లు చెప్పొచ్చు..

ఇ.టి.పిలు లేని పారిశ్రామిక వాడలు

కాలుష్యాన్ని శుద్ధి పరిచే యంత్రాలు (ఇటిపి) లేకపోవడంతో ఇక్కడి పారిశ్రామిక వాడల, చుట్టుప్రక్కల వున్న గ్రామాల ప్రజలు కాలుష్యం తాకిడితో అన్యన్ధతకు గురౌతుండగా, మరి కొందరు తమ ప్రాణాలను కోల్పోతున్నారు. ఇటీవల సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన 'జీతయ్య' అనే వ్యక్తి మరణించగా, అదే గ్రామానికి చెందిన బోయమ్మ కుమారుడు 'ఫిట్స్' వచ్చి పడిపోయినట్లు, గండిగూడెం గ్రామంలో గండయ్య, పటాన్‌చెరులో 17 సం॥ల జనార్థన్‌రావ్ మెదడుకు సంబంధించిన వ్యాధి వచ్చి ప్రాణాపాయస్థితిలో వున్నట్లు పటాన్‌చెరు, కాలుష్య నివారణ సంఘర్ష సమితి నాయకులు తెలిపారు. ఇక్కడి పరిశ్రమలలో నిత్యం సుమారు 100 పైగా ట్యాంకర్ల పరివాహణంలో రసాయనిక వ్యర్థ జలం ఉత్పత్తి అవుతుండగా, అట్టి జలాలను ప్రభుత్వం సూచించిన ప్రదేశంలో వదలడానికి రామచంద్రాపురం మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ఒక చెక్ పోస్ట్‌ను ఏర్పాటు చేయగా, అందులో సక్రమంగా నమోదు చేయించక 'నక్కవాగు' లోనే వదులుతున్నట్లు ప్రత్యక్ష సాక్షులు చెప్పుతున్నారు.



పరిశ్రమలు వెలువరిస్తున్న కాలుష్యపు నీరు నక్కవాగులోకి ఉరకలు వేస్తున్న దృశ్యం

కాలుష్య నివారణ సంఘర్ష సమితి పోరాటం

పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతంలో స్వచ్ఛందంగా ఏర్పాటు అయిన కాలుష్య నివారణ సంఘర్ష సమితి అంచెలంచెలుగా తన పోరాట పరిధిని విస్తృత పరుచుకుంటూ ధర్నాలు, రాస్తారోకోలు, నిరాహార దీక్షలు నిర్వహించింది. ప్రజల ప్రాణాలపై ఎలాంటి రక్షణ చర్యలను, నష్టపరిహారాన్ని చెల్లించుటలో విఫలమైన ప్రభుత్వంకు వ్యతిరేకంగా

అందోళనలను నిర్వహించింది. అందులో భాగంగానే జూలై 10,1986 నుండి వారం రోజుల పాటు 'సామూహిక నిరాహార దీక్షలను', అదే సంవత్సరం అగష్టు 16న 'చలో అసెంబ్లీ' నినాదంతో కాలుష్య వ్యతిరేక ర్యాలీని, అగష్టు 18,21 తేదీలలో 'రాస్తారోకో' కార్యక్రమాన్ని నిర్వహించి ముఖ్యమంత్రికి విజ్ఞాపన పత్రంను అందజేసింది. అప్పటి పంచాయత్ రాజ్ శాఖా మంత్రి కరణం రామచంద్ర రావ్ ప్రత్యక్షంగా పరిస్థితులను పరిశీలించినా, తీసుకొన్న చర్యలు ఏమీ లేవు. ప్రజలు నిరాశ, నిస్పృహలకు గురి అయ్యారు. పోరాట సమితి 1987 సెప్టెంబర్ 9న, స్థానిక పత్రికా విలేఖరులతో, కాలుష్యం విరుగుడుకై తీసుకోవాల్సిన చర్యలపై చేపట్టవలసిన ఆందోళనా కార్యక్రమంపై సమావేశాన్ని ఏర్పాటు చేసింది. మరునాడు అన్ని దిన పత్రికలు పతాక శీర్షికలతో వార్తలు ప్రచురించినా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడ లేకపోయింది. ఆ మరుసటి రోజు నష్టపోయి కర్షకులే గాక సంగారెడ్డి రెవెన్యూ డివిజన్‌లోని వివిధ గ్రామాల ప్రజలు తమ ఎడ్ల బండ్లతో నక్కవాగు వద్ద పన్నెండు గంటల రాస్తారోకో నిర్వహించి, సమస్యల సాధనకై అనుసరించాల్సిన పోరాట వ్యూహంపై బహిరంగ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జీడిమెట్ల, నాచారం, మౌలాలి తదితర ప్రాంతాల సౌహార్థ ప్రతినిధులు హాజరుకావడమే గాక, 'సిటిజన్స్ అగెనెస్ట్ పొల్యూషన్' నాయకులు కూడ హాజరయ్యారు. ట్రాఫిక్ స్థంబనతో జిల్లా కేంద్రమైన సంగారెడ్డి నుండి కలెక్టర్ వచ్చి లిఖితపూర్వకమైన హామీ ఇవ్వడంతో పోరాట సమితి తాత్కాలికంగా తన ఆందోళనను విరమించుకుంది.

కొన్ని రోజులు గడిచిన అనంతరం సెప్టెంబరు 24-25 తేదీలలో పటాన్‌చెరు మండల రెవెన్యూ అధికారి కాలుష్యంను వదిలిపెట్టే పది పరిశ్రమలను మూసివేశారు. అప్పుడు పరిశ్రమల యాజమాన్యాలు ఇ.టి.పి.లు నిర్మించటానికి కోర్టుల నుంచి ఉత్తరువులు తెచ్చుకొని తమ ఉత్పత్తులను ప్రారంభించారు.

ప్రభుత్వం, పరిశ్రమల కాలుష్య నివారణకై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో డిసెంబర్ 1988లో పటాన్ చెరు మండల రెవెన్యూ కార్యాలయం వద్ద పెద్ద కంజర్ల రైతులు రహిమొద్దీన్, వెంకటరెడ్డిలు వంతులవారీగా నిరాహార దీక్షలకు కూర్చుంటే జిల్లా కలెక్టర్ వచ్చి వారికి నిమ్మరసం ఇచ్చి, తక్షణమే చర్యలు తీసుకుంటామని మళ్ళీ లిఖిత పూర్వకమైన హామీ పత్రాన్ని ఇవ్వడం, దీక్షలను విరమించడం రెండూఒక్కసారే జరిగిపోయాయి. ఈ మధ్య ఏడునెలల కాలవ్యవధిలో అంటే మే 17వ తేదీన కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవడం లేదన్న కారణంగా అధికారులు పన్నెండు పరిశ్రమలకు నోటీసులు జారీ చేసి మూసివేశారు. రెండు పరిశ్రమలు మినహా అన్ని ఫ్యాక్టరీల యజమానులు అనవాయితీ ప్రకారం కోర్టుల నుండి అనుమతిని తెచ్చుకోటానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

కర్షక పరిషత్ ఎన్నికల బహిష్కరణ?

ఈ విధమైన సమస్యలు కుక్క గొడుగుల్లా పుట్టుకొస్తున్న క్రమంలో, కర్షకుల మేలును కాంక్షించే కర్షక పరిషత్‌లను ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం ప్రకటిస్తున్నది. కాలుష్యంతో నష్టపోయిన తమకు ఎలాంటి పరిహారంను ఇవ్వలేకపోవడమే గాక, ఇటిపిల నిర్మాణానికి పరిశ్రమల యజమాన్యాలపై ఎలాంటి ఒత్తిడిని కలుగజేయడం లేదని, ఆగ్రహావేశాలతో నున్న సంగారెడ్డి, పటాన్‌చెరు, జిన్నారం మండలాలకు చెందిన రైతులు జరుగబోయే కర్షక పరిషత్ ఎన్నికలను బహిష్కరించనున్నట్లు తెలిసింది.

రైతుల అంతిమ విజ్ఞప్తి

కాలుష్యంతో నష్టపోయిన తమ వద్దనుండి రుణాల వసూళ్ళను నిలిపి వేయాలని, కరెంట్ బిల్లులను మాఫీ చేయాలని, నష్టపరిహారం చెల్లించాలని, ఇటిపిల నిర్మాణంను చేపట్టాలని, తాగేందుకు కొన్ని గ్రామాలకు సరఫరా చేస్తున్న 'మంజీర' నీటిని అన్ని గ్రామాలకు అందించాలని, చెరువులు, బావులు కలుషితమైనందున పశువులు మంచినీటికి ఇబ్బందిని ఎదుర్కొంటున్నందున ప్రత్యామ్నాయ చర్యలను చేపట్టాలని రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

— అవినాష్ రఘు.

'నలుపు' నిర్వహణలో భాగస్వాములు కండి

'నలుపు' ప్రజల పత్రిక, పత్రిక నిర్వహణలో ప్రజలే భాగస్వాములు కావాలని కోరుతున్నాం. అందువల్లనే రాష్ట్రంలో ప్రత్యేకంగా విలేఖరులను నియమించలేదు. వాస్తవానికి ఈ బాధ్యతను ప్రజలలో పనిచేస్తున్న వారు చేపట్టగలరని మా నమ్మకం.

మీ ప్రాంత ప్రజలు జీవన పరిస్థితులు, సమస్యలు, వారి ఆందోళనలకు సంబంధించిన రిపోర్టులు రాసి పంపండి. అంతే కాదు ప్రజలపై అత్యాచారాలు, నిర్బంధకాండ గురించి రిపోర్టులు పంపండి. ప్రతి రిపోర్టుతో పాటుగా అందుకు సంబంధించిన ఫోటోలు పంపించడం మరిచిపోకండి.

ఎడిటర్
నలుపు
1-1-342/బి, వివేకనగర్
హైదరాబాదు-20

వరకట్న నిషేధ అధికారాలు ఆర్.డి.ఒ.లకా?

మన దేశంలో వరకట్నం తీసుకోవటం, ఇవ్వటం నిషేధిస్తూ చట్టాలున్నాయి. వాటిని అమలు పరిచే యంత్రాంగమూ ఉంది. అయినా కట్నం చావులు పెరిగిపోతున్నాయి. కట్నం కోసం భర్త, అత్తమామలు..స్త్రీలను వేధిస్తున్నారు. ఏదో రూపంలో హత్యలు చేస్తున్నారు. ఆ హత్యలను ఆత్మహత్యలుగా చిత్రించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. మనం పత్రికల్లో ఈ కట్నం చావుల వార్తలు చదవని రోజు లేదు. పైగా ఈ వార్తలను చదివి నిర్లిప్తంగా ఉండే పరిస్థితి సమాజంలో పెరుగుతున్నది. కట్నం కోసం సాగుతున్న ఈ హత్యలను నిరోధించడానికి తగిన చర్యలు తీసుకోవాలనే చిత్తశుద్ధి పాలకులకు లేదు. అయినా ఈ సమస్య పట్ల తమకు శ్రద్ధ ఉన్నట్టు కనిపించడానికి ప్రభుత్వం అప్పుడప్పుడు కొన్ని ప్రకటనలు చేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేసిన ప్రకటన కూడా అందులో భాగమే.

రాష్ట్రంలో ఇకనుంచి వరకట్న నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయటానికి సబ్‌కలెక్టర్లు, రెవిన్యూ డివిజనల్ అధికారులు (ఆర్.డి.ఒ.) వరకట్న నిషేధ అధికారులుగా పని చేస్తారని ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు గతనెల ఎనిమిదిన ప్రకటించారు. సంబంధిత రెవిన్యూ డివిజన్‌లలో వీరు వరకట్నం కేసులను విచారిస్తారని ఆయన చెప్పారు. వరకట్నం తీసుకున్నవారు, ఇచ్చేవారు, కట్నాన్ని ప్రోత్సహించే వారిపై వచ్చే ఫిర్యాదులను ఈనిషేధ అధికార్లు విచారణ జరుపుతారు.

వరకట్న నిషేధ చట్టాలను పటిష్టంగా అమలు చేయటానికి చర్యలు తీసుకోవటం సముచితమే. కాని ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యవల్ల జరిగేదేమి లేదు. కాగా నష్టాలే ఎక్కువగా జరుగుతాయి. ఈ అధికారాలను న్యాయస్థానాల పరిధి నుంచి తొలగించి ఆర్డీవోలకు అప్పగించడంవల్ల త్వరితంగా న్యాయం జరుగుతుందని, కేసులు పరిష్కారమవుతాయని అనుకోవడం అపోహ మాత్రమే అవుతుంది. ఆర్.డి.ఒ., సబ్‌కలెక్టర్ల కార్యాలయాల్లో భూమికి సంబంధించిన లేదా ఇతరత్రా రెవిన్యూ కేసులు సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయి. ఈ అధికారులు ఇప్పుడు వారి పరిధిలో ఉన్న విధులనే సక్రమంగా, సకాలంలో నిర్వహించడం లేదు. ఇక ఇప్పుడు వరకట్న నిషేధ అధికారాలను అప్పగించడమంటే వారిమీద అదనపు భారం మోపడమే అవుతుంది. అంతకన్నా ముఖ్యంగా కేసులు ఏళ్ళ తరబడి పెండింగ్‌లో పడిపోయే ప్రమాదముంది. తిమ్మిని బమ్మిని చేసే ఈ కార్యాలయాల్లో హత్యలు, ఆత్మహత్యలుగా నిరూపణయ్యే అవకాశముంది. రెవిన్యూ కేసుల్లో న్యాయం ఏమాత్రం | జరుగుతుందో అందరు ఎరిగిన విషయమే. ఇక కట్నం కేసుల్లో మాత్రం సక్రమంగా న్యాయం జరుగుతుందని ఎలా ఆశించగలం?

వరకట్న చావులను ఆపాలని, చట్టాలను సరిగా అమలు చేయాలనే చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఉంటే అందుకు తీసుకోవాల్సిన చర్యలు వేరే ఉన్నాయి. అందువల్ల ప్రభుత్వం వరకట్న నిషేధచట్టాలను ఆర్డీవోలు, సబ్ కలెక్టర్లకు అప్పగించాలనే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి. కట్నం హత్యలను ఎప్పటికప్పుడు విచారించి, దోషులను శిక్షించడానికి ప్రత్యేక న్యాయస్థానాలు ఏర్పాటు చేయాలి. ఈచర్యకూడా పరిమితమైందే. కాని ప్రస్తుతం కట్నాన్ని పూర్తిగా నిర్మూలించడానికి ముందు కట్నం చావులను ఆపాల్సిన బాధ్యత పాలకులపై ఉన్నది. అరకొర చర్యలు తీసుకోవడం వల్ల ఈసమస్య పరిష్కారం కాదు. అందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలి.

విలేకర్లకు బెదిరింపు

అధికారంలో ఉన్న పార్టీలు పత్రికా స్వేచ్ఛను కాపాడు తామని, జర్నలిస్టుల హక్కులను పరిరక్షిస్తామని వాగ్దానాలు చేస్తుంటాయి. కాని మరోవైపున మంత్రుల దగ్గర నుంచి కిందిస్థాయి నాయకుల వరకు జర్నలిస్టుల మీద దాడులు చేయటం పరిపాటి అయింది. ఇందులో కాంగ్రెసు వారయినా, తెలుగుదేశం వారయినా తీసిపోరు. తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలో గత నెలలో జరిగిన సంఘటన ఈవిషయాన్ని మరోసారి రుజువు చేసింది.

రాజమండ్రిలో వివాదాస్పదమైన పోలీస్ అధికారి ఎ.ఎస్.పి. రాజీవ్ త్రివేది ప్రవర్తనపై జూన్ 9-10 తేదీలలో ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి పత్రికలలో వార్తలు వచ్చాయి. కాంగ్రెస్ (ఐ), తెలుగుదేశం నాయకులు ఆయన గురించి రాయడమే నేరంగా భావించారు. అందువల్ల 12, 14. తేదీలలో పట్టణంలోనూ, ఈ పత్రికా కార్యాలయాల ముందు వారు ప్రదర్శనలు జరిపారు. పత్రికా విలేకరులు నశించాలని నినాదాలు ఇచ్చారు. విలేకరు

లను నానారకాలుగా దుర్భాష లాడారు. ఇలాంటి రాతలు రాస్తే ప్రాణాలు తీస్తామని బెదిరించారు. ఈ పత్రికా కార్యాలయాల ముందు బీభత్సం సృష్టించారు.

తెలుగుదేశం పార్టీ స్థానిక శాసనసభ్యుడు గోరంట్ల బుచ్చయ్య చౌదరి సోదరుడు గోరంట్ల రాజేంద్ర ప్రసాద్, కాంగ్రెస్‌లోని ఒక వర్గం రాజీవ్ త్రివేదికి మద్దతుగా ఈప్రదర్శనను నిర్వహించారు. ఈ ప్రదర్శనలకు పోలీసుల మద్దతు కూడా ఉంది. పోలీసుల అండదండలతో వారు ఈ ప్రదర్శనలు జరిపారు. 12 నాడు జరిపిన ప్రదర్శనకు విలేకరులు నిరసన తెలిపారు. అధికారులు పత్రికా విలేకరులకు రక్షణ కల్పిస్తామని చెప్పారు. కాని 14 న మళ్ళీ కాంగ్రెస్, తెలుగుదేశం వర్గాలు ప్రదర్శనలు జరిపాయి.

పత్రికా స్వేచ్ఛపై, పాత్రికేయు లపై సాగిస్తున్న ఈ దాడులకు నిరసన వ్యక్తం చేస్తూ రాజమండ్రి రిపోర్టర్స్ గిల్డ్ సభ్యులు జిల్లా కలెక్టర్ జయ ప్రకాష్ నారాయణ్‌కు 15 న వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సంఘటన లపై విచారణ జరపటానికి ఆయన హామీ ఇచ్చారు. ఆ తరువాత 17 న ఈ సంఘటనలను నిరసిస్తూ ఒక సభకూడా నిర్వహించారు. వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు ఈ నిరసన సభలో పాల్గొన్నారు.

ఎ.ఎస్.పి. రాజీవ్ త్రివేది ప్రొబేషన్ కాలంలో ముందుగా ఇక్కడ నియమితులయ్యారు. ఆయన ఇక్క డికి వచ్చినప్పటినుంచి పోలీసుల అరాచకం పెరిగింది. శాంతి భద్రతల పేరుతో పట్టణంలో నలుగురు నిల బడినచోట లాఠీ ఛార్జీలు జరిపిన సంఘటనలు చాల ఉన్నాయి. ఆయన అరాచకం గురించి రాసి నందుకు స్థానిక పత్రిక గౌతమి టైమ్స్ సంపాదకులు దిగవల్లి శివరాం కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేసి నానా చిత్రహింసలు పెట్టారు. రోజుల తరబడి వివిధ స్టేషన్లలో ఉంచి చితక బాదారు. అక్రమ కేసులు బనా యించారు.

గత ఏడాది నవంబర్ 27 న రాజీవ్ త్రివేది 43వ వార్డులోను, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద ప్రజలమీద విచక్షణా రహితంగా లాఠీఛార్జీ చేశారు. ఈ సంఘటనకు నిరసనగా అన్ని పార్టీల వారు పట్టణ బంద్ జరిపారు. ముఖ్యమంత్రి దృష్టికి ఈ విషయాన్ని తీసుకు వెళ్ళారు. ఆయన ఈ సంఘటనలపై న్యాయ విచారణకు జస్టిస్ పున్నయ్య నాయకత్వాన ఏక సభ్య సంఘాన్ని నియమించారు. ఈ సంఘం రాజమండ్రిలో జూన్ 15 న విచారణను ప్రారంభించింది.

పత్రికలపై ఆంక్షలు

రాజమండ్రి పోలీసులు పత్రికల అమ్మకాలపై ఆంక్షలు విధిస్తున్నారు. పాన్‌షాపుల్లో 'నలుపు' పత్రికలు అమ్మటానికి వీల్లేదని పోలీసులు బెదిరించారు. ఫలితంగా తాము ఎలాంటి రాజకీయ పత్రికలు షాపుల్లో పెట్టకూడదని పాన్‌షాపుల యజమానుల సంఘం నిర్ణయించింది. గతంలో విజయవాడలో కూడా రాజకీయ పత్రికలు అమ్మకుండా పోలీసులు బెదిరించారు. రాజమండ్రి పోలీసులు ఇప్పుడు అదే పద్ధతిలో వ్యవహ రిస్తున్నారు. ఇలాంటి బెదిరింపుల ద్వారా భావాల ప్రచారాన్ని అడ్డుకోలేరు. భావ ప్రకటనా స్వేచ్ఛను హరించలేరు. ప్రజల పత్రికలను ప్రజలకు చేరడాన్ని ఆపలేరు.

మలహర్‌రావు హత్య

బూటకపు ఎన్‌కౌంటర్లను ఆపాలంటూ నిన్న మొన్నటి వరకూ పౌరహక్కుల సంఘాలు, నక్సలైట్ వర్గాలు మాత్రమే డిమాండ్ చేసేవి. కాని ఇప్పుడు తెలుగుదేశం నాయకులే ఈ ఎన్‌కౌంటర్లను ఆపాలని డిమాండ్ చేస్తున్నారు. ఇది కొత్త పరిణామం. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు నిరసనగా కరీంనగర్ జిల్లాలో ఎనిమిదిమంది 'దేశం' మండలా ధ్యక్షులు రాజీనామా చేశారు. ఈచర్య ఆపార్టీలో ఏర్పడిన అసంతృప్తి, సంక్షోభాన్ని ప్రతిబింబిస్తుంది.

ఎమర్జెన్సీ తర్వాత రాష్ట్రంలో 1982 నుంచి ఎన్‌కౌంటర్లు ప్రారంభమయ్యాయి. అప్పట్నించి ఎన్‌కౌంటర్ల పేరుతో జరుగుతున్న వన్నీ హత్యలేనన్నది స్పష్టం. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ప్రజాస్వామిక హక్కులు హరించుకు పోయాయి. గత కొన్నేళ్ళుగా నక్స లైటు వర్గాల కార్యకలాపాల మీద నిషేధాలు విధించారు. వారు ఊరే గింపులు, సభలు జరపటానికి అనుమతించడం లేదు. కార్యకర్త లను విచ్చలవిడిగా అరెస్టులు చేస్తూ చిత్రహింసలు పెట్టడం మామూలు విషయమైంది. నిన్న మొన్నటి వర కూ ప్రతిపక్షాలు ఈ విషయమై నోరు మెదపలేదు.

రాష్ట్రంలో పీపుల్స్‌వార్ గ్రూపు మలహర్‌రావును హత్య చేయడంతో వాస్తవాలను అందరు గుర్తించక తప్ప ని పరిస్థితి ఏర్పడింది. పోలీసులు జరుపుతున్న బూటకపు ఎన్ కౌంటర్లను మునుపెన్నడూ లేని విధంగా బట్టబయలు చేసింది మలహర్ రావు హత్య. అందువల్లనే ప్రతిపక్షాలతో సహా తెలుగుదేశం నాయకులు ఈ ఎన్‌కౌంటర్లకు వ్యతి రేకంగా నోరువిప్పాల్సి వచ్చింది. గత ఆరేళ్ళుగా ఎన్‌కౌంటర్ల గురించి నోరువిప్పని ప్రతిపక్షాలు ఈనాడు ప్రభుత్వాన్ని నిలదీయక తప్పడం లేదు.

మతకలహాలు ఎందుకు వస్తాయి?

మతం పేరుతో కుత్తుకలు కోసుకోవటం, గృహ దహనాలు, లూటీలు నానాటికి తీవ్రరూపం దాలుస్తున్నాయి. మత కలహాలకు కారణాలు ఏమిటన్నప్పుడు చాలా మంది ఆంగ్లేయుల 'విభజించి పాలించు' విధానమనే లేదా అంతకు ముందు ముస్లిం పరిపాలన ప్రభావమనే చెబుతారు. వాటి ప్రభావం నేటికీ కొంత వరకు ఉన్న మాట వాస్తవమే. ఆధునిక భారతంలో మత విద్వేషాలకు దోహదం చేస్తున్న కారణాలను లెక్కించేటప్పుడు దేశ ఆర్థిక పురోగతి, దానితో పాటు వస్తున్న సామాజిక మార్పులు పరిశీలించాలి. అంతే కాక ఈ నేపథ్యంలో మత తత్వాన్ని ప్రోత్సహించటంలో విభిన్న రాజకీయ పార్టీల పాత్రను పరిశీలించాల్సి ఉంది. మత తత్వ ముద్ర వేసుకున్న ఆర్.ఎస్.ఎస్. జమాత్-ఎ-ఇస్లామి వంటి పార్టీల మీద పూర్తి నింద వేయ్యటం సరికాదు. మత వైరుధ్యాలు గెచ్చ గొట్టడంలో ఈ పార్టీల భూమిక లేదన్నది నా ఉద్దేశం కాదు. ప్రధాన బాధ్యత ఈ పార్టీలదే అయినప్పటికీ, లౌకిక పార్టీలని చెప్పుకుంటున్న ఇతర అధికార, ప్రతిపక్ష పార్టీలు సైతం మత కలహాలను ప్రజ్వలింప చేయటంలో ఎంతో కొంత పాత్ర వహిస్తున్నాయి.

ప్రస్తుత దేశ కాల పరిస్థితులకు అన్వయించే విధంగా మత కలహాల సిద్ధాంత అంశాలను విస్తృతంగా పరిశీలిద్దాం. మత పరమైన ఏ విధ్వంస కాండకైనా సూక్ష్మ కారణాలు, స్థూల కారణాలు ఉంటాయి. స్థూల కారణాలు సిద్ధాంతాలకు సంబంధించినవి అయితే, సూక్ష్మ కారణాలు స్థానిక అంశాలకు సంబంధించినవి. ఈ రెండు కారణాలు దేశ సామాజిక - ఆర్థిక ప్రగతిలో విడదీయలేనంతగా ముడిపడి ఉన్నాయి. అంటే సామాజిక మార్పు, ప్రగతి దృష్టిలో పెట్టుకుని సమస్యను పరిశీలించాలి.

నేటి భారతంలో మత కలహాలను అర్థం చేసుకోవాలంటే వివిధ వర్గాలు, సామాజిక సంస్థలు, రాజకీయ పార్టీల పాత్రను అర్థం చేసుకోవాలి. మత కలహాలకు కారణం మతమేనని చాలా మంది నమ్మిక. కాని స్వార్థ పరశక్తుల చేతుల్లో మత కలహాలు ఒక బలమైన ఆయుధంగా ఉపయోగ పడుతున్నాయని గుర్తించాలి. మత విశ్వాసాలలోనే, మత సూక్తుల లోనే విభేదాల వల్ల చెలరేగే కలహాలు వేరు. కాని రాజకీయ లబ్ధికో, ఆర్థిక ప్రాబల్యం సాధించటానికో మత కలహాలను రెచ్చ గొడితే అవి చాలా తీవ్ర రూపం దాలుస్తాయి. లౌకిక అంశాల నుండి మత కలహాలు పుడుతున్నాయి. ఈ దృష్ట్యా మత తత్వ పార్టీలకు లౌకిక వాదులు నాయకత్వం వహించటం, లేదా మతతత్వాన్ని లౌకిక నాయకులు ప్రోత్సహించటం ఆశ్చర్యం కలిగించదు. దేశ విభజనకు ముందు ముస్లిం లీగ్‌కు నాయకత్వం వహించిన మహ్మద్ అలీ జిన్నా పూర్తిగా పాశ్చాత్య పద్ధతుల్లో పెరిగిన వ్యక్తి. ఆధునిక భావాలు కలవాడు. హిందూ మహాసభకు మూలపురుషుడైన సావార్కర్‌కు కూడా ఆధునిక భావాలున్నాయి. హిందూ మతంలో సంస్కరణలు అవసరమని భావించిన వ్యక్తి. ముస్లిం లీగ్‌కు ముల్లానే, హిందూ మహాసభకు శంకరాచార్యుడే నాయకత్వం వహించలేరు.



మతతత్వాన్ని, మత కలహాలను ప్రోత్సహిస్తున్న స్థూల అంశాలను మొదట పరిశీలిద్దాం. సమాజం వర్గాలుగా విభజించి ఉండటం, ఆర్థికంగా పురోగమించకపోవటం, వనరుల కొరత స్థూల అంశాల్లో ముఖ్యమైనవి. ఆర్థిక వెనుకబాటుతనం ప్రాంతీయ అసమానతలకు, ప్రజల మధ్య అసమానతలకు దారి తీస్తుంది.

సమాజం మతాల వారీగా విభజన అయి ఉన్నప్పుడు వర్గ సంఘీభావం ఏర్పడటం కష్టం. అంటే ధనికులైనా, పేదలైనా వర్గ ప్రాతిపదిక మీద తేలికగా ఐక్యంకారు. ఒక మతంలోని ధనికులు వేరే మతానికి చెందిన ధనికులను దెబ్బ తీయటానికి తమ మతంలోని సామాన్య ప్రజల మద్దతు పొందటానికి ప్రయత్నిస్తారు. ఇందుకు తమ కోర్కెలను వర్గ ప్రాతిపదిక మీద కాక మత ప్రాతిపదిక మీద చేస్తారు. అంటే తమ ఆర్థిక కోర్కెలకు మత, సాంస్కృతిక అంశాలు చేరుస్తారు. దీనికి తోడు ఇరుమతాలకు చెందిన మతతత్వవాదులు చరిత్రను తిమ్మిని బమ్మిని చేసి మా మతం గొప్పదంటే మా మతం గొప్పదని చెబుతారు. తమ తమ పాలనలో ప్రజలు ఎటువంటి వైషమ్యాలు లేకుండా సుఖంగా జీవించారని ప్రచారం చేస్తుంటారు. ఈ విధంగా గత చరిత్ర గొప్పలు కల్పించి చెప్పటం ప్రజలను సమీకరించటానికి బాగా ఉపయోగ పడుతుంది. ప్రత్యేకించి భారతదేశం వంటి వెనుకబడిన దేశంలో మతం బలియమైన శక్తిగా పనిచేస్తుంది.

మతతత్వం ప్రధానంగా పట్టణాలకే పరిమితమై ఉందని, ఇది పట్టణ పెటీ బూర్జువా వర్గంలో బలంగా వేళ్ళూనుకుని ఉందని సామాజిక శాస్త్రజ్ఞులందరూ అంగీకరిస్తారు. వెనుకబడిన సమాజంలో ఈ వర్గంలోనే మతభావాలు బలంగా ఉంటాయి. డి.ఆర్.డి.ఎ , జమాత్.ఎ.ఇస్లామీల ప్రభావం ఎక్కువగా పట్టణ పెటీ బూర్జువా వర్గంలో ఉండటం ఆశ్చర్యం కలిగించదు. ఈ మతభావాలను అయా మతాల్లోని ధనికులు తమ తమ స్వార్థ రాజకీయాలకు ఉపయోగించుకొంటారు. అధికారానికి తలొగ్గి ఉండటం పెటీ బూర్జువా వర్గ లక్షణాలలో ఒకటి. ఈ లక్షణం ఆధారంగా మతతత్వ పార్టీలు ప్రజాస్వామ్య వ్యతిరేక, పెత్తందారి సంఘాలుగా రూపొందుతాయి. స్వేచ్ఛగా ఆలోచించటం, ప్రజాస్వామ్యయుతంగా పని చేయటం కంటే అధికారానికి తల ఒగ్గడానికే ఆర్.ఎస్.ఎస్., జమాత్-ఎ-ఇస్లామీలు ప్రాధాన్యతనిస్తాయి. ఈ విధంగా దేవుడు, మత గ్రంథాలలో గుడ్డి నమ్మకం బలపడి, సమాజంలో ఛాందస భావాలు పెరుగుతాయి.

సామాజిక, ఆర్థిక మార్పులవల్ల నష్టపోయే ప్రజల్లో భద్రతలేకపోవడం అనే భావన ఏర్పడుతుంది. ప్రత్యేకించి కార్మిక, పెటీ బూర్జువా వర్గాలలో ఇది ఎక్కువ. ఈవర్గాల ప్రజలు సాంప్రదాయబద్ధులని ఇంతకుముందే తెలుసుకున్నారు. సామాజిక, ఆర్థిక మార్పులు ఈ భావనలను బలపరుస్తాయి. మత పరమైన ఉద్యమాలకు, మత పునరుద్ధరణకు వీళ్ళు ఆధారమవుతారు. సామాజిక ఆర్థిక మార్పులను పైపైన చూసేవాళ్ళకు, యాంత్రికంగా చూసే వాళ్ళకు ఈవిధమైన ప్రవర్తన అసంబద్ధంగా కనపడుతుంది. సామాజిక ఆర్థిక మార్పులు హేతుబద్ధతకు దారితీయాలని వీళ్ల అభిప్రాయం. ఇది సరిఅయినది కాదు. ప్రజల్లో పెరుగుతున్న అభద్రతా భావనవల్ల మతప్రభావం పెరుగుతుంది. మానసిక వత్తిడులకు మతం ద్వారా ఊరట దొరుకుతుంది. పెరుగుతున్న మత ఛాందసత్వాన్ని ఈదృష్టితో చూడాలి. మత పునరుద్ధరణలో రెండు వేర్వేరు ధోరణులున్నాయి. బాబాలు, యోగులు, మతగురువులు, మంత్రతంత్రగాళ్ళ సంఖ్య పెరగటం మొదటి ధోరణి. పెరుగుతున్న అభద్రతా భావన, పట్టణ-పారిశ్రామిక జీవితం వల్ల కలిగే వత్తిడులను సొమ్ముచేసుకొని పైరకం వాళ్ళందరు బతికేస్తున్నారు. నడమంత్రపు సిరి తన్నుకొచ్చిన వాళ్ళకు సామాజిక గుర్తింపు కలిగిస్తున్నారు. స్మగ్లర్లు, నల్లబజారు వ్యాపారస్తులు, ఇతర అక్రమ మార్గాల నుంచి అధికారంలో ఉన్న పార్టీలకు నల్లడబ్బు చేరటానికి ఉపయోగ పడుతున్నారు. సమాజంలో మూఢనమ్మకాలు పెరగటానికి తోడ్పడుతున్నారు. దీని వల్ల ప్రజల చైతన్యం పక్కదోవ పట్టించడం తేలికవుతుంది. సమాజం ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభంనుంచి దృష్టి మళ్ళించడానికి ఇది ఉపయోగ పడుతుంది కాబట్టి పాలక వర్గాలు బాబాలను, యోగులను ప్రోత్సహిస్తుంటాయి. ఈవిధమైన మత పునరుద్ధరణ వల్ల మతతత్వం పెరిగే అవకాశంగానీ, మత కలహాలు చెలరేగే ప్రమాదం కాని ఉండదు.

విశ్వ హిందూ పరిషత్, పెరుగుతున్న ఇస్లాం మత ఛాందసత్వం మత పునరుద్ధరణలో రెండవ ధోరణి కింద కొస్తుంది. ఈ ఉద్యమాలు పెటీ బూర్జువా వర్గ ఆకాంక్షలను ప్రతిబింబిస్తాయి. వీటికి రాజకీయ లక్ష్యాలూ ఉంటాయి. కొంతమంది దళితులు ఇస్లాం మతం తీసుకున్న సందర్భంలో విశ్వహిందూపరిషత్ ఒక పద్ధతి ప్రకారం పెద్ద ఎత్తున ప్రచారం చేసి దేశవ్యాప్తంగా మత విద్వేషాలు పెరగటానికి దోహదపడింది. పరిషత్ ప్రచారం ఫలితంగానే డిసెంబరు 83లో అహ్మదాబాద్‌లోను, ఆ తర్వాత పూనా, షోలాపూర్, పంఢర్‌పూర్‌లలోను మత కలహాలు చెలరేగాయి. 1982 సెప్టెంబరు- అక్టోబరులో మీరట్ మత కలహాల్లో విశ్వ హిందూ పరిషత్ చెయ్యి ఉంది. మతతత్వం తీవ్ర రూపం దాల్చడానికి విశ్వ హిందూ పరిషత్ సాయశక్తులా తోడ్పడింది. సామాజిక సంక్షోభాలు దాటేయ్యడానికి పాలక వర్గాలకు ఇది ఎంతగానో అనుకూలించింది.

పరిమితమైన ఆర్థిక వనరులను పంచుకోవడంలో తలఎత్తే

విభేదాలు మతతత్వం పెరగడానికి దోహదం చేస్తాయి. ఆర్థిక అభివృద్ధి మందకొడిగా ఉండటంతో అందరి ఆకాంక్షలు తీరే అవకాశం లేక, ఈ వైరుధ్యాలు ప్రాంతీయ తత్వ రూపంలోనే, మతతత్వ రూపంలోనే బయట పడతాయి. అస్సాం, పంజాబ్ లలోని పరిణామాలు దీనిని ధృవీకరిస్తున్నాయి.

కేరళలో అనేక శతాబ్దాలుగా అన్ని మతాల వారు సామరస్యంతో జీవిస్తున్నారు. సాంస్కృతిక, భాషా రంగాల్లో నవైక్యత సాధించిన రాష్ట్రమిది. మన అంచనాల ప్రకారం ఈ రాష్ట్రంలో మత కలహాలకు తావు ఉండకూడదు. మారుతున్న సామాజిక ఆర్థిక పరిస్థితుల వల్లా, రాజకీయ పరిణామాల వల్లా ఇక్కడ కూడా మతతత్వం మెల్లగా ప్రవేశించింది. 1956లో కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని కూలదోయటానికి ఏర్పరచిన ఆతురతలో అది పెట్టిన షరతులకు, నిబంధనలకు కాంగ్రెసు పార్టీ అంగీకరించింది.

ఆ తర్వాత ఏర్పడిన అనేక సంఘటనల్లో మతతత్వ ముఠాలను చేర్చుకోటానికి వివిధ రాజకీయ పార్టీలు పోటీ పడి అవి కోరిన కోర్కెలల్లా తీర్చటానికి సిద్ధపడ్డాయి. ఈ నేపథ్యంలో కేరళలో ఆర్.ఎస్.ఎస్. బలపడటానికి నాయర్లు అన్ని విధాల దోహదపడ్డారు. 1970లో తెల్లిచెరిలో ఈ రాష్ట్రంలో మత కలహాలు ఆరంభమయ్యాయి. ఈ కలహాల్లో ఆర్.ఎస్.ఎస్. హస్తం ఉందని తర్వాత ఏర్పడిన విచారణ సంఘం నిర్ధారించింది. హిందూ-ముస్లిం కొట్లాటలే కాకుండా హిందూ-క్రిష్టియన్ కొట్లాటలు సైతం చెలరేగాయి.

కేంద్రంలోను, రాష్ట్రంలోను వివిధ రాజకీయ పార్టీలు ఓట్ల కోసం మతతత్వాన్ని, కులతత్వాన్ని రెచ్చగొడుతున్నాయి. లౌకిక పార్టీలని చెప్పుకుంటున్న రాజకీయ పార్టీలూ సీట్లు గెలవడం కోసం సిగ్గూ ఎగ్గూ లేకుండా మతతత్వాన్ని ప్రోత్సహిస్తున్నాయి.

దేశంలో ఆర్థిక సంక్షోభం నానాటికి తీవ్రతరమవుతోంది. పెట్టుబడిదారీ పంథా అవలంభించిన అన్ని మూడవ ప్రపంచదేశాలు ఈ విధమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. ఈ



సంక్షోభాలకు పెట్టుబడిదారీ విధానంలో పరిష్కారాలు లేవు. అందుకే ఇవి వక్కదారులు తొక్కుతుంటాయి. ఇందులో భాగంగానే మత సాంప్రదాయకత్వాన్ని, మత ఛాందసత్వాన్ని ప్రోత్సహించి ఫ్యూడల్ శక్తుల్ని బలపరుస్తుంటారు.

ఇప్పటి వరకు మతతత్వానికి దోహదం చేసే స్థూల కారణాలు పరిశీలించాం. ఇప్పుడు సూక్ష్మ కారణాలను పరిశీలిద్దాం. మత కలహాలు చెలరేగటానికి వెనుకనున్న స్థానిక కారణాలను చాలా మంది నిర్లక్ష్యం చేస్తుంటారు. దేశ విభజనకు ముందు ఆవుని చంపటం, మసీదు ముందు సంగీతం వాయించటం వంటి చిన్న చిన్న ఘటనల వల్లే మతకలహాలు చెలరేగేవి. ఈ నాటికి ఈ కారణాల వల్ల మత వైషమ్యాలు భగ్గున అంటుకుంటున్నాయి. వీటికి తోడు మరిన్ని కారణాలు వచ్చి చేరాయి. వేర్వేరు మతాలకు చెందిన ఇద్దరు వ్యాపారస్తుల మధ్య, ఉత్పత్తిదారుల మధ్య తగాదాలు మత విద్వేషాలకు దారి తీస్తున్నాయి. స్మగ్లింగ్, దొంగసారా వంటి చట్ట విరుద్ధ కార్యక్రమాల్లో రెండు ముఠాల మధ్య తగాదాలు కూడ మత కలహాల రూపం దాలుస్తున్నాయి. కార్మిక సంఘ ఉద్యమాలను, ఐక్యతను దెబ్బతీయడానికి స్థానిక పారిశ్రామిక వేత్తలు మత కలహాలను సృష్టిస్తున్నారు. స్థానిక, అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలప్పుడు మత వైరుధ్యాలు రెచ్చగొట్టి 'ఓట్లు' చేసుకుంటున్నారు.

చిన్న పట్టణాలలో ముస్లిం జనాభా 20-50 శాతం వరకు ఉంటే మతకలహాలు చెలరేగటానికి ఎక్కువ అవకాశాలుంటాయి. హిందూ వ్యాపారస్తుల గుత్తాధిపత్యాన్ని సవాలు చేసే ముస్లిం వ్యాపారస్తులున్నప్పుడు మరింత తేలికగా మత వైషమ్యాలు

పెచ్చరిల్లుతాయి. అంతకు ముందెప్పుడైనా మత కలహాలు సంభవించి ఉంటే అవి పునరావృతం కావడానికి అవకాశాలు ఎక్కువ. వీటిని దృష్టిలో పెట్టుకుంటే మురదాబాద్, అలీఘడ్, మీరట్, జమ్‌షెడ్‌పూర్, కాశి, భివాండి, మాలెగావ్, హైదరాబాదు పాత బస్తీ వంటి పట్టణాల్లో తరుచు మత కలహాలు చెలరేగుతుండటాన్ని అర్థం చేసుకోవచ్చు. ఈ అంశాలను కొంత వివరంగా ఉదాహరణలతో పరిశీలిద్దాం.

ఎన్నికల రాజకియాల్లో మతం ఒక పాచిక వంటిది. మీరట్ జనాభాలో 40 శాతం ముస్లింలున్నారు. కాబట్టి ఏ ఎన్నికలలోనైనా ముస్లిం అభ్యర్థి గెలవటానికి ఎక్కువ అవకాశాలుంటాయి. దీంతో కాంగ్రెస్-ఐలోను మతపరంగా విభజన ఏర్పడింది. ఈ పార్టీలోని హిందూ నాయకులకుపోటీ చేసే అవకాశాలు లభించక పోవటంతో వీళ్ళల్లో అసంతృప్తి పేరుకుపోయింది. అందు వల్ల బి.జె.పి. నాయకత్వంతో లోపాయికారీగా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ రాజకీయ ఘర్షణ మసీదు-గుడి వివాదం రూపంలో బయటపడి మత కలహాలకు దారితీసింది.

బీహార్‌లోని నలందా జిల్లాలోని బిహార్ షరీఫ్‌లో ముస్లింలు 35 శాతం దాకా ఉంటారు. జిల్లాలో బంగాళా దుంప (అలుగడ్డ) సాగు చాలా లాభసాటిగా ఉండటంతో భూముల ధరలు ఆకాశాన్నంటాయి. వాడుక లేకుండా పడిఉన్న ముస్లింల విశాల శ్మశాన భూమిపై యాదవ కులస్తులు కన్ను వేశారు. దీంతో ముస్లింలు - యాదవుల మధ్య కొట్లాటలు చెలరేగాయి. ఈ అల్లర్లలో యాదవులకు ఆర్.ఎస్.ఎస్. పూర్తి మద్దతు లభించింది. ఇక్కడి కలహాలకు ఆర్థిక అంశం కారణ మయ్యింది. దీనితో పాటు రాజకీయ కారణాలూ ఉన్నాయి. ఇక్కడ బీడీ తయారీలో హిందూ, ముస్లిం కార్మికులు పనిచేస్తున్నారు. భారతీయ కమ్యూనిస్టు పార్టీ ఈ కార్మికుల్ని సంఘటిత పరచింది. దీనివల్ల భా.క.పా. స్థానికంగా బలపడింది. మత కలహాలు చెలరేగిన సమయంలో అసెంబ్లీ, పార్లమెంటు సీట్లు భా.క.పా. వే. ఈ అల్లర్ల ఫలితంగా హిందూ-ముస్లింల పేద ప్రజల వర్గ చైతన్యం మత చైతన్యంగా మారింది. ఇది ఆర్.ఎస్.ఎస్.కు లాభించింది.

గోధ్రా (గుజరాత్)లో సింధీలు, ఘంఛీ ముస్లింల మధ్య కలహాలు చెలరేగాయి. ఇక్కడ ఘంఛీ ముస్లింలు అధిక సంఖ్యలో ఉన్నారు. వీళ్ళు బాగా కష్టించి పనిచేస్తారు. ఆర్థికంగా బలపడుతున్నారు. పంచమహల్ జిల్లాలోని రవాణా వ్యాపారమంతా వీళ్ల చేతుల్లోనే ఉంది. చిన్న చిన్న వ్యాపారాల్లోను, జూదగృహాలు నడపటంలోను సింధీ-ఘంఛీ ముస్లింల మధ్య తీవ్రపోటీ ఉంది. ఇళ్ళకున్న కొరత కారణంగా ఘంఛీ ముస్లింల ఆస్తులపై సింధీలు కన్ను వేశారు. స్టేషను రోడ్డులో దుకాణాలు పెట్టుకోవడానికి సంబంధించి విభేదాలున్నాయి. ఈ రెండు వర్గాల మధ్య మత కలహాలు సాధారణమైపోయాయి. సింధీల పట్ల గుజరాతీ హిందువులకు, ఘంఛీ ముస్లింల పట్ల ముస్లింలకు సానుభూతి ఉన్నప్పటికీ వీళ్ళు ప్రత్యక్షంగా ఎన్నడూ కలహాల్లోకి దిగలేదు. దీన్ని బట్టి చూస్తే హిందువులందరూ ఒకే తాటి మీద ఉన్నారని గాని, ముస్లింలందరూ ఒక్కటే అని గాని అనటం సరైనది కాదని తెలుస్తుంది.


ఈ విధంగా ఆర్థిక కారణాలు, ప్రత్యేకించి ముస్లింలు ఆర్థికంగా పుంజుకుంటున్నప్పుడు మతకలహాలు చెలరేగుతాయి. ముస్లింలు ఆర్థికంగా పురోగమించాలంటే దాని మూల్యం రక్తంతో చెల్లించి తీరాలన్న నిర్ధారణకు రాకూడదు. వెనుకబడిన పెట్టుబడిదారీ ఆర్థిక విధానంలో, మన వంటి దేశాల్లో వర్గ పోటీ వర్గ-కుల రూపంలోను, వర్గ-మత రూపంలోను బహిర్గతమవు తుంటుంది. ఈ ఘర్షణలో ఒక్కొక్కసారి వర్గం, ఒక్కొక్కసారి మతం ప్రధాన అంశమవుతుంది.

దొంగసారా, విదేశీ వస్తువుల స్మగ్లింగ్, ఆయుధాల అక్రమ వ్యాపారాలు చేసే మాఫియా ముఠాల పాత్రను స్థానిక అంశాల్లో పరిగణించాలి. బరోడాలో దొంగసారా తయారు చేస్తున్న హిందూ, ముస్లిం ముఠాలు రెండున్నాయి. వీటి మధ్య పోటీ 1982 సెప్టెంబరు-అక్టోబరులలో మత కలహాలకు దారితీసింది. ఒక ముఠానాయకుడైన శివ కహార్‌కు అధికార పార్టీలోని కొంతమంది మద్దతుంది. ఈ రోజుల్లో ఎన్నికల్లో గెలవాలంటే రాజకీయ నాయకులకు డబ్బు, అంగబలం చాలా అవసరం. మాఫియా ముఠాలు రాజకీయ నాయకులకు అవసరమైనప్పుడు ఉపయోగపడుతుంటే వాళ్ళపై ఎటువంటి చర్య తీసుకోకుండా రాజకీయ నాయకులు అడ్డుపడుతున్నారు. జమ్‌షెడ్‌పూర్, మురాదాబాద్ మతకలహాల్లో సంఘ వ్యతిరేక శక్తుల పాత్ర అందరికీ తెలిసిందే. రాజకీయ నాయకులు- మాఫియా ముఠాల మధ్య సంబంధాలు నానాటికి పెరుగుతున్నాయి. కొన్ని చోట్ల మాఫియా నాయకులే ఎన్నికల బరిలోకి దిగుతున్నారు. ఇది మరింత ప్రమాదకరమైన పరిణామం.

మత కల్లోలం పట్ల పరిపూర్ణ సిద్ధాంతం రూపొందాలంటే స్థూల, సూక్ష్మ అంశాలను పరిశీలించాలి. మన దేశంలో ప్రస్తుతం వర్గ సంఘీ భావం కంటె కుల, మత సంఘీభావం ఎక్కువని చెప్పక తప్పదు. ఈ అంశాన్ని పాలక వర్గాలు తమ స్వార్థ ప్రయోజనాలకు వాడుకుంటాయి. ఆర్థిక రంగం మందగతిన పురోగమించటం వల్ల సంక్షోభం తీవ్రతరమయ్యే అవకాశాలున్నాయి. అయితే ప్రజల వర్గ చైతన్యాన్ని మత చైతన్యంగా పాలక వర్గాలు తేలికగా మలచగలవు. దీనిని ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచిది.

— అస్గర్ అలీ ఇంజినీర్

ఆధునీకరణకు ఆరువేలమంది బలి



కేంద్రప్రభుత్వం ఒకవైపున జవహార్ రోజగార్ యోజన' పథకం కింద యువకులకు ఉపాధి కల్పిస్తామని ప్రచారం చేస్తూనే మరోవైపున ఆధునీకరణ, కంప్యూటరైజేషన్ పేరుతో కార్మికులను వీధులపాలు చేసే విధానాలను చేపట్టింది. వివిధ ప్రభుత్వ రంగ సంస్థలలో ఆధునీకరణ విధానాలవల్ల యువకులకు ఉద్యోగావకాశాలు తగ్గుతున్నాయి. అయితే ఇప్పుడు బొగ్గుగనులలో కార్మికుల సంఖ్యను తగ్గించడానికి ఆధునీకరణ, హేతుబద్ధీకరణ, స్వచ్ఛంద పదవీ విరమణ చర్యలను అనుసరిస్తోంది. ప్రభుత్వం గత ఏడాది ఈవిధంగా ఆరువేలమంది కార్మికులను తొలగించింది. ఈవిషయాన్ని అధికారులే స్వయంగా ఇటీవల వెల్లడించారు.


బొగ్గుగనుల్లో మానవశక్తిని తగ్గించే ప్రయత్నం ఈకార్మికుల తొలగింపు ద్వారా విజయవంతమైనట్టు అధికారులు ప్రకటించుకున్నారు. బొగ్గుగనుల్లో "ఉన్న మనుషుల"తోనే పనులు చేసుకోవాలని, కొత్తవారిని ఉద్యోగాల్లోకి తీసుకోరాదని కూడా పరిశ్రమల మంత్రిత్వశాఖ ఆదేశాలు జారీచేసింది. బొగ్గుగనుల్లో యంత్రాలను ప్రవేశపెట్టి ఉద్యోగులకు శిక్షణ ఇవ్వడంద్వారా ఉద్యోగ నియామకాలను తగ్గించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

బొగ్గుగనుల్లో ప్రస్తుతం ఉన్న ఉద్యోగుల సంఖ్యను తగ్గించడానికి 'స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పథకం' ప్రవేశ పెట్టింది. ఈపథకంలో ఆకర్షణీయమైన అంశాలు ఉన్నాయి. ప్రభుత్వం దీనిని కొన్ని కేటగిరీలకే నిర్దేశించింది. 10 సంవత్సరాల సర్వీసు ఉండి, 40 ఏళ్ళ వయస్సు పైబడ్డవారు ఈపథకం కింద ఉద్యోగ విరమణ చేయడానికి అర్హులని ప్రభుత్వం ప్రకటించింది. ఈ విధంగా ఉద్యోగ విరమణ చేసేవారికి ఆర్థికంగా పెద్ద మొత్తాలను చెల్లిస్తారని పేర్కొంది. ప్రభుత్వరంగ సంస్థల బ్యూరో ఈపథకాన్ని రూపొందించింది. సాధ్యమైనంత మేరకు ఉద్యోగాల సంఖ్యను తగ్గించాలనే బొగ్గుగనుల్లో ఈపథకాన్ని అమలు చేస్తున్నారు. 'స్వచ్ఛంద విరమణ' అనే ముద్దుపేరు పెట్టినప్పటికీ ఇది కార్మికులను బలిచేసే ప్రయత్నమే.

బొగ్గుగనుల్లో అవసరానికి మించినంతమంది ఉద్యోగులు ఉన్నారనే వాదన ఈనాటిది కాదు. కొన్ని సంవత్సరాలుగా యాజమాన్యాలు ఈ వాదనను ముందు పెడుతున్నాయి. అవసరానికి మించి ఉద్యోగులు ఉండటం వల్లనే ఏటా బొగ్గు ధరలు పెంచాల్సి ఉందని కూడా వారు వాదిస్తున్నారు. కాని ఉద్యోగులను తొలగించడానికే యాజమాన్యం ఈవాదనలు చేస్తోందని కార్మిక సంఘాలు ఆరోపించాయి.

కార్మికుల సంఖ్యను తగ్గించడం ద్వారా ఆధునీకరణను సాధించాలనుకోవడం గర్హనీయమైన అంశం. ఆధునీకరణ కార్మికుల ఉపాధిని దెబ్బతీసే విధంగా ఉండరాదన్న సూత్రానికి ఇది విరుద్ధంగా ఉంది. ప్రభుత్వం ఇప్పటికే బ్యాంకుల్లో ఇంకా ఇతర సంస్థల్లో ప్రవేశపెట్టిన విధానాలవల్ల ఉద్యోగావకాశాలు తగ్గాయి. ఈరకమైన విధానాలను ఉపేక్షిస్తే ప్రభుత్వం మిగతా రంగాలకు కూడా ఈపద్ధతులను విస్తరింప చేసే ప్రమాదముంది. అందువల్ల కార్మికులు ఈ అసంబద్ధమైన విధానాలకు వ్యతిరేకంగా సంఘటితం కావాల్సిన అవసరముంది.

అవినీతి కూపంలో అస్సాం ప్రభుత్వం



అస్సాంలో ఇటీవల వెలుగులోకి వచ్చిన బియ్యం కుంభకోణం ప్రఫుల్ల కుమార్ మహంతా ప్రభుత్వాన్ని కుదిపి వేస్తోంది. సహకార మంత్రిత్వ శాఖను కూడా చూస్తున్న ముఖ్యమంత్రి మహంతాకు బియ్యం కొనుగోలులో జరిగిన అవకతవకలతో ప్రత్యక్ష సంబంధం ఉందని శాసనసభా సంఘం విచారణలో వెల్లడయింది. అంతేగాక కొనుగోలు చేసిన బియ్యం పశువులు తినటానికి కూడా పనికి రాకుండా ఉన్నాయని ఈ సంఘం నిర్ధారించింది.

అస్సాం రాష్ట్రప్రభుత్వ సంస్థ 'రాష్ట్ర సహకార మార్కెటింగ్ వినియోగదారుల సమాఖ్య' (స్టేట్‌ఫెడ్) 12 కోట్ల రూపాయలు విలువచేసే ఒక లక్షా ఎనిమిదివేల టన్నుల బియ్యాన్ని ఈఏడాది కొనుగోలు చేసింది. ఈకొనుగోలు వ్యవహారంలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని ఏప్రిల్ 28న శాసనసభలోని వివిధ పక్షాల సభ్యులు ఆరోపించారు. ఢిల్లీలోని ఒక ప్రయివేటు వ్యాపారసంస్థ సరఫరా చేసిన బియ్యం ముక్కిపోయి తినటానికి పనికిరాకుండా ఉన్నాయని సభ్యులు విమర్శించారు. ఈసంస్థ 80 లక్షల రూపాయల బియ్యాన్ని స్టేట్‌ఫెడ్‌కు సరఫరా చేసినట్టు ఢిల్లీ రైల్వే అధికారులు ఇచ్చిన రసీదుతప్ప మరో సాక్ష్యం లేదని సభ్యులు విమర్శించారు. దీనితో సభ్యుల డిమాం

డ్‌ను అనుసరించి ఈకుంభకోణంపై విచారణకు ఏడుగురు సభ్యులతో ఒక విచారణ సంఘాన్ని నియమించారు. ఈ సంఘం అందజేసిన తాత్కాలిక నివేదికను జూన్ ఆరున శాసనసభకు సమర్పించడంతో అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయి.


ఈ ఏడాది స్టేట్‌ఫెడ్ 58 ప్రయివేటు వ్యాపార సంస్థలనుంచి బియ్యాన్ని కొన్నది. అయితే ఈ వ్యాపార సంస్థలకు బియ్యం సరఫరా కంట్రాక్టులు ఇచ్చే ముందు ఎలాంటి బహిరంగ టెండర్లను ఆహ్వానించ లేదు. సహకార శాఖ కార్యదర్శి, కమీషనర్ ఈ బియ్యం కంట్రాక్టులకు సంబంధించి ఎలాంటి బహిరంగ టెండర్లను పిలవలేదని సభాసంఘానికి ఇచ్చిన జవాబులో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి మహంతా ప్రత్యేకించి నాలుగు ప్రయివేటు సంస్థలకు బియ్యం సరఫరా చేసే కాంట్రాక్టులు ఇవ్వాల్సిందిగా చెప్పారని స్టేట్‌ఫెడ్ మాజీ మేనేజింగ్ డైరెక్టరు నిరంజన్ ఘోష్ సభాసంఘానికి తెలిపారు. దీనితో ఈకుంభకోణంలో ముఖ్యమంత్రికి పాత్ర ఉందనే అంశం బయటపడింది. మహంతా నోటి మాటగా ఇచ్చిన ఆదేశాలను అనుసరించి బియ్యం సరఫరా కంట్రాక్టులను ఈవ్యాపార సంస్థలకు ఇచ్చినట్టు కనబడుతోందని సభా సంఘం తన నివేదికలో పేర్కొంది.

గోదాముల్లో 13 లక్షల రూపాయలు విలువచేసే 5 వేల క్వింటాళ్ళ బియ్యంకూడా తగ్గాయనే విషయంకూడా ఈసంఘం విచారణలో వెల్లడయింది. అంతేగాక బియ్యం మనుషులు తినటానికి పనికిరాకుండా ఉన్నాయని సంఘం తెలిపింది. స్టేట్‌ఫెడ్ అధికారుల నాణ్యత, తూకం గురించి పట్టించుకోక పోవడానికి ఉన్నతస్థాయి వ్యక్తులనుంచి వచ్చిన ఆదేశాలు కారణమని సంఘం నిర్దేశించింది. దీనికి సహకార మంత్రిత్వశాఖ నిర్వహిస్తున్న మహంతాదే బాధ్యత అని కూడా నివేదికలో పేర్కొంది.

ఈ పరిణామాలన్నీ మహంతా ప్రభుత్వాన్ని, పార్టీని కుదిపివేస్తున్నాయి. పార్టీలోని అసమ్మతివాదులు ఈ కుంభకోణంతో మహంతా రాజీనామా చేయాలని కోరే అవకాశం ఏర్పడింది.

అస్సాంలో యువనాయకత్వానికి పట్టంకట్టిన ప్రజలకు ఈపరిణామాలతో మహంతా ప్రభుత్వంపై ఏవగింపు కలిగింది. అస్సాం గణపరిషత్ అధికారంలోకి వచ్చింతర్వాత ఇలాంటి అవినీతి ఆరోపణలు చాల వచ్చాయి. అందువల్ల మహంతాకే కాక పార్టీకి ఈ పరిస్థితులు సవాళ్ళుగా పరిణమించాయి.

కరువు కోరల్లో ఒరిస్సా



ఒరిస్సాలోని బొలంగీర్, కలహాండి, కోరాపుట్ జిల్లాల్లో ఏర్పడిన తీవ్ర అనావృష్టి పరిస్థితుల వల్ల ప్రజల బతుకులు దుర్భరమయ్యాయి. ఈజిల్లాల్లో గత మూడేళ్ళుగా కరువు పరిస్థితుల వల్ల బావులు, చెరువులు ఎండిపోయి ప్రజలు మంచినీళ్ళ కటకటతో బాధపడుతున్నారు. వర్షాలు లేక పోవటంవల్ల పంటలు పండడంలేదు.

బొలంగీర్ జిల్లాలో 2000 గ్రామాల్లో, కలహాండిలో 1000 గ్రామాల్లో బావులు ఎండిపోవటంతో చుక్కనీరు దొరకక ప్రజలు అల్లాడుతున్నారు. ఈగ్రామాల్లో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. రాష్ట్రంలో నీటిపారుదల సౌకర్యాలు పరిమితంగా ఉన్నాయి. అందువల్ల రైతులు ఎక్కువగా వర్షాలపై ఆధారపడి వ్యవసాయం సాగిస్తున్నారు. కాని గత మూడేళ్ళుగా సకాలంలో వర్షాలు కురవకపోవటంతో వ్యవసాయం కొనసాగడం లేదు. ఫలితంగా ఉత్పత్తులు పడిపోతున్నాయి.

దేశం మొత్తం మీద 58 శాతం భూములకు నీటిపారుదల సౌకర్యాలుండగా ఒరిస్సాలో 42 శాతం భూములకు మాత్రమే ఉన్నాయి. రాష్ట్రంలో అనేక చిన్న, పెద్దతరహా ప్రాజెక్టులు సకాలంలో పూర్తికాకపోవడం కూడా ఈసమస్యకు కారణం. ఇంద్రావతి, కొలబ్ ప్రాజెక్టుల ఎగువభాగం, రెంగాలి ప్రాజెక్టు దిగువ భాగం నిర్మాణం పూర్తయితే నీటిపారుదల సౌకర్యాలు మెరుగవుతాయి. కాని నిధుల కొరత, జాప్యంవల్ల ఈ ప్రాజెక్టుల నిర్మాణం నత్తనడక నడుస్తుంది.

మరోవైపున ఇటీవల బాలసోర్ జిల్లాలో భారీవర్షాలు, తుఫానువల్ల ప్రజలకు పెద్ద ఎత్తుననష్టం వాటిల్లింది. ఈతుఫాను వల్ల 30వేల హెక్టార్ల పంట పొలాలు దెబ్బతిన్నాయి. వేలాదిమంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. బాలసోర్ కోస్తా తీరంలోని 270 గ్రామాల్లో 90శాతం పక్కా ఇళ్ళు కూలిపోయాయి. తమలపాకులు, వక్కలపంట దెబ్బతిన్నది. పంటపొలాలు దెబ్బతినడంవల్ల పనులు దొరక్క వ్యవసాయ కూలీలు వలస పోతున్నారు. రైతులు తుఫానులో ఇళ్ళు, వాకిళ్ళు కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రభుత్వం మొక్కుబడిగా తీసుకుంటున్న సహాయక చర్యలు తుఫాను బాధితులను ఓదార్చలేక పోతున్నాయి. తుఫానుకు గురయిన ప్రాంతాల్లో ఆహార ధాన్యాలు పంపిణీ చేయాలని, రుణాలను రద్దు చేయాలని ఆర్థిక సహాయాన్ని అందించాలని ప్రజలు కోరుతున్నారు.

రాష్ట్రంలో ఒకవైపున అనావృష్టి, మరోవైపున అతివృష్టి వల్ల బాధ

వడుతున్న ప్రజల ఓట్లనసంపాదించటానికి అధికార, అనధికార పక్షాలు ప్రయత్నాలు చేస్తున్నాయి. ప్రధాని రాజీవ్‌గాంధీ జూన్ మొదటి వారంలో కలహాండి జిల్లాలో పర్యటించారు. జనతాదళ్ నాయకులు కూడా ఈకరువు జిల్లాల్లో వర్యటించారు. ఈవర్యటనలు రానున్న ఎన్నికల్లో ప్రజల ఓట్లను నంపాదించడానికి ఉద్దేశించినవి మాత్రమే. రాజీవ్‌గాంధీగాని, జనతాదళ్ నాయకులు గానీ ఈఅతివృష్టి అనావృష్టి పరిస్థితులను శాశ్వతంగా తొలగించటానికి ఎలాంటి చర్యలు తీసుకుంటారో నామమాత్రంగా అయినా ప్రకటించ లేదు. అధికార పార్టీకిగాని, ప్రతిపక్షాలకుగాని ఈప్రాంత ప్రజల ఓట్లే తప్ప వారి సమస్యలను పట్టించుకోవాలనే ధ్యాసకూడా లేదని స్పష్టమవుతుంది. ఈ పరిస్థితుల్లో ఒరిస్సా ప్రజలు ఏ మార్గం అనుసరిస్తారో చూడాలి.

న్యూస్‌ప్రింటు – పత్రికల వైఖరి

అబద్ధం చెబితే యధార్థం చెప్పేవాడికంట్లో కారం కొట్టినట్లుండాలని సామెత. ప్రభుత్వం న్యూస్‌ప్రింట్ ధర పెంచడం పత్రికా స్వేచ్ఛమీద దాడిచేయటమేనని పత్రికల యాజమాన్యాలు చేస్తున్న అట్టహాసపు ప్రచారం కూడా ఆవిధంగానే ఉంది. వాస్తవాలను పరిశీలించకపోతే పత్రికల వారు చేసున్న ప్రచారం నిజమేనని అనుకునే ప్రమాదముంది.

అయితే ప్రభుత్వం పత్రిక స్వేచ్ఛకు భంగం కలిగించే చర్యలు తీసుకోలేదని, పత్రికలమీద దాడికి పాల్పడటం లేదని చెప్పడం మా ఉద్దేశం కాదు. ఎమర్జన్సీలో పత్రికలపై సెన్సార్ షిప్, నిన్నమొన్న పరువునష్టం బిల్లు ద్వారా పత్రికల గొంతు నొక్కాలన్న ప్రభుత్వ ప్రయత్నాలను ఇక్కడ విస్మరించడం లేదు. కాని న్యూస్‌ప్రింటు ధర పెంచడం కూడా పత్రికలమీద దాడిగా పేర్కొనడం వాస్తవాలను వక్రీకరించడమే అవుతుంది.

ప్రభుత్వం న్యూస్‌ప్రింటు ధరలను టన్నుకు 30 శాతం పెంచింది. పారిశ్రామిక సరుకుల ఖర్చులు, ఖరీదులకు సంబంధించిన బ్యూరో న్యూస్‌ప్రింటు ధరలను పెంచాలని సిఫార్సు చేసింది. దానికి అనుగుణంగా ప్రభుత్వం ధరలను పెంచింది. ఈ బ్యూరో న్యూస్‌ప్రింట్ తయారీకి సంబంధించిన ముడిపదార్థాల ధరలు, ఇతర ఖర్చులను లెక్కించి ధర పెంచాలని సూచించడనేది వాస్తవం. విదేశీ న్యూస్‌ప్రింటు ధరలు కూడా పెరిగాయి. అందువల్ల ప్రభుత్వం విదేశీమారక ద్రవ్యం నిల్వలను ఎక్కువగా విడుదల చేయాల్సి వచ్చింది. మన అవసరాలకు గాను 32 శాతం మేరకు విదేశీ న్యూస్ ప్రింటును దిగుమతి చేసుకుంటున్నాం. ఇప్పుడు ఈదిగుమతులను 32 నుంచి 38 శాతంవరకు పెంచుతున్నారు. ఈపరిస్థితుల్లో ప్రభుత్వానికి న్యూస్‌ప్రింటు ధరలను పెంచటం తప్ప మరోమార్గం లేకుండా పోయింది.

వాస్తవాలు ఇలా ఉండగా పత్రికల గొంతు నొక్కడానికే న్యూస్‌ప్రింటు ధరలు పెంచినట్టు పత్రికలు పనిగట్టుకుని ప్రచారం చేస్తున్నాయి. మనదేశంలో పత్రికలు కొంతమంది పెట్టుబడిదారుల గుత్తాధిపత్యం కింద ఉన్నాయన్న నిజాన్ని మనం విస్మరించకూడదు. వారే ఈరోజున ఈప్రచారాన్ని పుణికి పుచ్చుకున్నారు. న్యూస్‌ప్రింటు ధరలు పెంచాల్సి వస్తుందని, ఫలితంగా సామాన్యులు పత్రికను కొని చదవలేరని ఈవిధంగా పత్రికా స్వేచ్ఛ మీద దాడి చేస్తున్నారని అంటున్నారు. నిజాలను 'మసిపూసి మారేడుకాయ చేయడమంటే ఇదే కావచ్చును.

దేశంలో దినపత్రికలను కొని చదివేవారు ఎక్కువగా మధ్యతరగతికి చెందినవారు. పత్రికల ధరలు పెరుగుతున్నా సర్క్యులేషన్ తగ్గడం లేదనేది నిజం. ఇప్పుడు అనేక పత్రికల ధరలు పెరిగాయి. అందువల్ల వాటి సర్క్యులేషన్ తగ్గిన దాఖలాలేం లేవు. న్యూస్‌ప్రింటు ధరల పెరుగుదల వల్ల పేజీలు తగ్గించుకోవాల్సి వస్తుందని పత్రికలవారు అంటున్నారు. పేజీలు తగ్గించటం వల్ల పాఠకులకు వచ్చే నష్టం ఏంలేదు. ఇప్పుడు పత్రికల్లో దాదాపు 40 శాతానికి పైగా పేజీలు వ్యాపార ప్రకటనలతో నిండి ఉంటున్నాయి. న్యూస్‌ప్రింటు ధరలు పెంచిన అదను చూసుకుని ప్రకటనల రేట్లను కూడా పత్రికలవారు విపరీతంగా పెంచారు. మరోవైపున ప్రభుత్వం పత్రికలపై దాడి చేస్తుందని ప్రచారం చేస్తున్నారు.

ప్రభుత్వానికి పత్రికా స్వేచ్ఛ మీద గౌరవం ఉందని మేం ఇక్కడ చెప్పడం లేదు. నిజానికి ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాసే పత్రికలు వేళ్ళమీద లెక్కించదగినన్ని లేవు. అందుకోసం న్యూస్‌ప్రింట్ ధరలను పెంచి మొత్తం పత్రికలను ఇబ్బందిపాలు జేస్తుందనడం తిమ్మిని బమ్మిని చేసే ప్రయత్నం మాత్రమే. ఈ అంశాలను గమనిస్తే పత్రికలు చేస్తున్న వాదనల్లో పసలేదని తెలుస్తోంది.

జూట్‌మిల్లు కార్మికుల ఆందోళన



పశ్చిమ బెంగాల్ జూట్ మిల్లుల కార్మికులు గత మూడు నెలలుగా తమ డిమాండ్ల సాధనకు ఆందోళన చేస్తున్నారు. మూసిన

జూట్‌మిల్లులను వెంటనే తెరవాలని, తమ బకాయిలను చెల్లించాలని వారు ప్రధానంగా డిమాండ్ చేస్తున్నారు. అధికారంలో ఉన్న వామపక్ష ప్రభుత్వంలో విభేదాలు తలెత్తటానికి కూడా కార్మికుల ఆందోళన దోహదం చేసింది.

రాష్ట్రంలో ఉన్న 56 జూట్‌మిల్లుల్లో 10 మిల్లులు ఇప్పటికే లాకౌట్ ప్రకటించాయి. యాజమాన్యాలు ఈవిధంగా గత జనవరి నుంచి లాకౌట్లు ప్రకటించి మిల్లులను మూసివేయటం వల్ల కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారు. మిల్లులకు ఏటా నష్టాలు వస్తున్నాయని, ఎగుమతులకు తగిన ధరలు లభించడం లేదని ఫలితంగా లాకౌట్ ప్రకటిస్తున్నట్లు యాజమాన్యాలు అంటున్నాయి. కాని నిజానికి ప్రభుత్వం వారికి అనేక ప్రోత్సాహకాలు ఇస్తోంది. మిల్లుల అధునీకరణకు రుణాలు, సబ్సిడీలు అందజేస్తోంది. అంతేగాక సిమెంట్, చక్కెర, ఆహార ధాన్యాలు, ఎరువులు మొదలైన పరిశ్రమలలో జూట్ సంచులను తప్పక ఉపయోగించాలని కేంద్రప్రభుత్వం ఒక చట్టం చేసింది. అయినా యజమానులు కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ మిల్లులను మూసివేస్తున్నారు. ఫలితంగా 50వేలమంది కార్మికులు ఉపాధి కోల్పోయారు.

మిల్లులను మూసివేసిన యాజమాన్యాలు కార్మికులకు వేతనాలు, బకాయిలు చెల్లించడంలేదు. కార్మికుల నుంచి ప్రావిడెంట్‌ఫండ్, ఇ.ఎస్.ఐ ల నిమిత్తం వసూలు చేసిన 115 కోట్ల రూపాయలు యాజమాన్యాలు స్వాహా చేశాయి. అందువల్ల తమకు రావాల్సిన ఈబకాయిలను వెంటనే చెల్లించాలని కార్మికులు కోరుతున్నారు. కొన్ని మిల్లుల్లో అధునీకరణ పేరుతో కార్మికుల సంఖ్యను తగ్గిస్తున్నారు. ఈ పరిస్థితులన్ని కూడా కార్మికులు ఆందోళన మార్గాన్ని చేపట్టడానికి దారి తీశాయి.

సి.పి.ఐ. అనుబంధ సంస్థ ఎ.ఐ.టి.యు.సి. ఈ కార్మికుల ఆందోళనకు నాయకత్వం వహిస్తోంది. ఈసంఘం పిలుపు మేరకు మే 24న కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకో జరిపారు. ఈసందర్భంగా హౌరా జిల్లాలో రాష్ట్రమంత్రి శ్రీమతి ఛాయబెరా కారును కూడా ఆందోళనకారులు రెండుగంటలపాటు నిలిపివేశారు. అతర్వాత కూడా కార్మికులు ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించారు. మూసిన మిల్లులను వెంటనే తెరవాలని, కార్మికుల బకాయిలను చెల్లించాలని; అధునీకరణ పేరుతో కార్మికులను తొలగించే చర్యలను వెంటనే నిలిపివేయాలని వారు కోరుతున్నారు.

సి.పి.ఎం. అనుబంధ సంస్థ సి.ఐ.టి.యు. ఈ ఆందోళనను వ్యతిరేకించింది. వామపక్షప్రభుత్వానికి ఈ ఆందోళన వ్యతిరేకమని ప్రచారం చేసింది. ఈ ఆందోళన వల్ల వామపక్ష సంఘటనలోని సి.పి.ఐ, సి.పి.యం మధ్య విభేధాలు తలెత్తాయి. సంఘటనలోని ఫార్వర్డ్ బ్లాక్ సి.పి.యం. విధానాలను నిరసించి ఆందోళనకు మద్దతు ప్రకటించింది. అయితే జూట్ మిల్లుల్లోని పరిస్థితులకు కేంద్ర ప్రభుత్వమే కారణమని, అందువల్ల వారు ఆందోళన సాగించాల్సింది ఢిల్లీలో కాని ఇక్కడ కాదని ముఖ్యమంత్రి జ్యోతిబసు వ్యాఖ్యానించారు.

అయితే కేంద్రప్రభుత్వ విధానాలకు, మిల్లు యజమానుల కుట్రలకు వ్యతిరేకంగా ఆందోళన కొనసాగిస్తున్నామని వామపక్ష ప్రభుత్వాన్ని దెబ్బతీసే ఉద్దేశం తమకు లేదని ఎ.ఐ.టి.యు.సి ప్రధాన కార్యదర్శి ఇంద్రజిత్ గుప్తా అన్నారు.

రాష్ట్రంలో ఇప్పటివరకు వివిధ రకాలైన 45వేల చిన్న, పెద్ద తరహా పరిశ్రమలను మూసివేశారు. అందువల్ల వేలాది మంది కార్మికులు ఈ ఉపాధికోల్పోయి రోడ్డున పడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పరిశ్రమలను తిరిగి తెరిపించడానికి ఎలాంటి ప్రయత్నాలు చేయడం లేదు. ఈ పరిస్థితుల్లో జూట్‌మిల్లుల మూసివేత వల్ల రోడ్డునపడ్డ 50 వేల మంది కార్మికులు సంఘటిత మయ్యారు. వారు తమ డిమాండ్లను ఆమోదించేవరకు ఆందోళన కొనసాగించాలని నిర్ణయించారు.




రస్తారోకో ఆందోళన సందర్భంగా ఛాయబెరా కారును చుట్టుముట్టిన సి.పి.ఐ కార్యకర్తలు

చైనాలో కల్లోలం

ఒక పెద్ద తుఫాను తరువాత ఉండే ప్రశాంతతలా ఉన్నది ఇపుడుచైనా. ఎంతమంది చనిపోయారో; ఎంతమంది గాయపడ్డారో, ఎంతమందిని జైల్లో వేశారో, ఎంత మందికి మరణ శిక్ష విధించారో లెక్కలు తెలియటం చాల కష్టం. చైనాలో అసలు ఏం జరిగిందే, ఎందుకు 'జరిగిందో తెలుసుకోవటం కష్టం. ఎవరికీ, విదేశానికీ, ఏ వార్తా సంస్థకూ, ఏ గూఢచారి విభాగానికీ కూడా తెలియదు. అక్కడక్కడా అప్పుడప్పుడూ జారి వచ్చిన వార్తలు తప్ప వాస్తవాలు చైనా వెలుపల తెలియటం లేదు. చైనా ప్రభుత్వం బయట ప్రపంచానికి ఏవో కొన్ని వార్తలు అందించింది. రాయబార కార్యాలయాల్లోని ఉద్యోగులు అందించిన సమాచారం కొంత. ఇవి అన్నీ కలిపినా అసలు ఏం జరిగిందో పూర్తిగా తెలియటం లేదు. "స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం" రెండూ కావాలని అందోళన చేసిన విద్యార్థులను అంత పాశవికంగా ఎందుకు చంపవలసి వచ్చిందో తెలియటం లేదు. చర్య తీసుకోవటానికి మొదట నిరాకరించిన సైన్యం మళ్లీ ఎందుకు రంగంలోకి దిగింది? సైన్యంలో రెండు వర్గాలున్నాయా? అధికారంలో రెండు వర్గాలున్నాయా? అధికారంలో ఉన్న వర్గాలు తమ అధిపత్యం కోసం సైన్యాన్ని వాడుకున్నారా?.తమ పెత్తనం చెలాయించటం కోసం వేలాది విద్యార్థులను పొట్టన పెట్టుకున్నారా అనేది సరిగ్గా తెలియటం లేదు.

ఒకటి మాత్రం తెలుస్తున్నది. జూన్ 3-4 తారీఖుల్లో తియనాన్‌మెన్ స్క్వేర్ దగ్గర దాదాపు మూడు వేల మంది విద్యార్థుల్ని సైన్యం చంపి వేసింది. కొన్ని విదేశీ పత్రికలు మరణించిన వారి సంఖ్య ఇంకా ఎక్కువ ఉంటుందని అంచనా కడుతున్నా మూడు వేలు చనిపోయారని చెప్పుకున్నా అది దారుణమే. ఒక దేశం యుద్ధాలు ఏవీ లేని రోజుల్లో శాంతియుతంగా ఉద్యమం జరుపుతున్న తన పౌరులపైన సైన్యాన్ని పంపి వేలాది మందిని చంపించటం ప్రపంచ చరిత్రలో ఎక్కడా ఉండినట్లు లేదు.

చైనాలో విద్యార్థులు అందోళన చేయటం ఇది మొదటిది కాదు, మూడోదో, నాలుగోదో అయి ఉంటుంది. అయితే ఇంత ఎక్కువ సంఖ్యలో విద్యార్థుల్ని చంపటం అనేది ఇపుడే జరిగింది. ఇంతకుముందు ఆందోళన చేసిన అన్ని సార్లు ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగానే. ఈ సారి కొత్త నినాదం తీసుకొని వచ్చారు. వారు అడిగినది చూస్తే కొంత ఆశ్చర్యం వేస్తుంది- ఏమిటి చైనాలో కూడా లంచగొండితనమా? బంధుప్రీతి ఉంటుందా? అని. ఎందుకంటే 1949లో చైనాలో విప్లవం వచ్చిన తర్వాత మావో నాయకత్వంలో చైనా రూపుదిద్దుకుంటున్న సందర్భంలో 'అక్కడ ఒక కొత్త మానవుడు' తయారవుతున్నాడు అనుకున్నారు. ఇతర దేశాలలోలేని విధానాలు, పద్ధతులు, కొత్త పద్ధతిలో మనుషుల్ని తయారు చేయటం జరిగింది. అక్కడ చూసి వచ్చిన రచయితలు, పాత్రికేయులు చాల మంది నిజంగానే అక్కడ కొత్త మనిషిని చూశాం' అన్నారు. అటువంటి చైనాలో



ఇంతఘోరమా? లంచగొండితనమా? తన వాళ్లకే ఉన్నత పదవులు కట్టబెడతారా? ఉన్నత పదవుల్లో ఉన్నవాళ్లు లంచాలు తీసుకుంటారా? అనిపిస్తుంది. కాని ఇపుడు చైనా సమాజం అలా దిగజారిపోతున్నది. ఆకలిని లేకుండా చేసిన దేశంలో మళ్లీ ఈ అవలక్షణాలు ఏమిటి అనిపిస్తుంది.


లంచగొండితనం నశించాలి, కుటుంబ సభ్యులకే పదవులు కట్టబెట్టడం తగ్గిపోవాలి, ప్రజాస్వామ్యం కావాలి అనేది ప్రధానమైన డిమాండ్లు విద్యార్థులవి.

1949లో రాజకీయ విప్లవం అంటూ వచ్చింది. కాని సమాజంలో ఆశించిన మార్పు రావాలంటే 'కొన్ని వందల సాంస్కృతిక విప్లవాలు రావాలి' అన్నాడు మావో. ఆయన కాలంలో వచ్చిన ఒక సాంస్కృతిక విప్లవం సందర్భంగా ఆయన అన్న మాటలు ఇవి. కొన్ని సాంస్కృతిక విప్లవాలు వస్తే తప్ప ఈ సమాజం ముఖ్యంగా ఆసియా సమాజం మారదు. సాంస్కృతిక విప్లవాలలో, మానవ సమాజం మారటం, కార్మిక వర్గ లక్షణాలతో పాత భావాలు తొలగిపోవటం, తోటి పౌరుని పట్ల ఒక సోదరభావం, అతనిని దోచుకోకూడదనే దృఢ సంకల్పం లాంటివి ఎన్నో జరుగుతాయి. రాజకీయ విప్లవంలో దొరికిన కొన్ని ప్రయోజనాలను కాపాడుకోవాలంటే ఎన్నో సాంస్కృతిక విప్లవాలు రావాలి. ఆ మధనంలో కొత్త మనిషి పుట్టుకువస్తాడు. ఈ విధానం చైనాలో జరుగుతున్నట్టు లేదు. కొన్ని ఆర్థిక పరమైన మార్పులు తేవటానికి అధికార వర్గం ప్రయత్నించటం లేదు. మార్పును కోరుతున్న విద్యార్థులకు అది దొరకక పోయేసరికి నిరాశ నిస్పృహలకు లోనవుతారు. చెడు మార్గాలు తొక్కుతారు. చైనాలో మాత్రం శాంతియుతంగా సమ్మె చేయటానికి దిగారు. ఎన్నో రోజుల తరబడి, ఆ స్క్వేర్ దగ్గర కూర్చుండి పోయారు. కారణం ఏమయినా వారు చూపిన నిశ్చయం, వారి సంకల్పం గాని చాలా గొప్పది, మరచిపోలేనట్టిది. సైన్యం కూడా చాల వరకు నిబ్బరంగానే వ్యవహరించింది. కాని హఠాత్తుగా తమ 'పిల్లల' పైననే టాంకులు నడిపించారు. ఒకసారి అవి జరిగిన తర్వాత వెనక్కి తీసుకోవటం ఇపుడు ప్రభుత్వానికి పరువుకు సంబంధించిన పని అయిపోయింది. ఊహించటానికి వీల్లేనంత నష్టం అయింది. చైనీయులు జూన్ మూడు రాత్రిని తమ జీవితాలలో మరిచిపోలే నట్టిది అయింది. ఒక భయంకరమైన వాస్తవం అక్కడ ముద్రమిగల్చి వెళ్ళిపోయింది.

అసలు విద్యార్థులు కోరుకున్నది ఏమిటి? 'స్వేచ్ఛ', 'ప్రజాస్వామ్యం' అంటున్నారు. ఈరెండింటికీ కూడా దేశాన్ని బట్టి, పరిస్థితిని బట్టి అర్థాలు మారుతూ ఉంటాయి. అమెరికాలోని ప్రజాస్వామ్యానికి భారతదేశంలోని ప్రజాస్వామ్యానికి తేడా ఉన్నది. స్వేచ్ఛకు కూడా అలాంటి అర్థమే. స్వేచ్ఛగా భావాలు ప్రకటించుకోవటం, అభిప్రాయాలు తెలపటం, స్వేచ్ఛగా ప్రధానమంత్రినో, అధ్యక్షుడినో విమర్శించ గలగటం, వారు ఏదైనా తప్పుచేస్తుంటే ప్రజాభిప్రాయాన్ని నిర్మించి వారిని గద్దె దింపే ప్రయత్నం చేయటం ఇలాంటివి స్వేచ్ఛకు నిదర్శనాలుగా భావిస్తారు. ఇప్పుడు దాదాపు 60వేలకు పైగా చైనా విద్యార్థులు విదేశాలలో చదువు కుంటున్నారట. విదేశమంటే ఎక్కువగా అమెరికా, యూరప్ దేశాలు అయి ఉండ వచ్చు. అమెరికాలోని 'స్వేచ్ఛ'ను వారు చూశారట. అధ్యక్షుడిని సూటిగా, బాహాటంగా విమర్శించటం వారు చూశారు. దేశరాజకీయ పరిస్థితులు బహిరంగంగా చర్చించుకోవటం, విమర్శించుకోవటం చూశారు. ఒక అధ్యక్షునికి వ్యతిరేకమైన ప్రచారం బాహాటంగా చేయటం వారు చూశారు. ఇతర దేశాలలో ఒక మంత్రిగాని, ముఖ్య మంత్రిగాని ఏదైనా తప్పుచేశాడని తెలిస్తే అతనిని దింపివేయటం చూశారు. అక్కడ జరుగుతున్నది, చైనాలో ఎందుకు జరగకూడదు అనే ఆలోచన వారిలో బయలు దేరింది. ఆ ఆలోచనకు దోహదం చేసే వాస్తవ పరిస్థితులు చైనాలో ఉండవచ్చు. వివిధ రాజకీయ అభిప్రాయాలను బాహాటంగా చర్చించుకోవాలనే కోరిక కలిగి ఉండవచ్చు. రెండు రాజకీయ పార్టీలో లేదా మూడు పార్టీలో మాకు ఉంటే బాగుండును అని అనిపించ వచ్చు. ఏది ఏమైనా అరవై వేలమంది విద్యార్థులు విదేశ వాతావరణంలో ప్రభావితులై వచ్చి ఉన్నారు అనే విషయాన్ని దృష్టిలో ఉంచుకొని జరిగిన పరిస్థితులను అంచనా వేస్తే కొంతదారి కనపడవచ్చు. మావో పటాన్ని మలిన పరచటం అనేదాన్ని కూడా ఇక్కడ గమనించాలి. అది ఎవరో ఇద్దరు ముగ్గురు అల్లరి కుర్రవాళ్ళు చేసినది అని సర్ది పెట్టుకున్నా, దానిని మిగిలిన వేలాది విద్యార్థులు సమర్థించలేదు అని చెప్పుకున్నా ఆ ఆలోచన రావటం, దానికి విదేశ పత్రికలు విపరీతమైన ప్రచారం చేయటం కూడా గమనించాలి. అదే విధంగా అమెరికాలో ఉన్న 'ప్రజాస్వామ్య దేవత' నమూనాను తీసుకొచ్చి తియనాన్‌మెన్ స్క్వేర్‌లో పెట్టటం కూడ గమనించవలసిందే.

మార్పు చెందుతున్న దేశంలో రెండు విభిన్నమైన ధోరణులు పరస్పరం సంఘర్షించుకుంటూ ఉంటాయి. అభివృద్ధి చెందుతున్న దేశంలో రెండు పరస్పర విరుద్ధమైన ధోరణులు సంఘర్షించుకుంటూ

ఉంటాయి. ఈ రెండు విభిన్నమైన ధోరణులు ప్రజా వ్యతిరేకమైన పోకడలకు అనుకూలతకు దారితీయకుండా చూసుకోవటం ప్రభుత్వంలో అధినేతలుగా ఉన్నవారు చేయవలసిన పని. సమాజం కూడా తన శ్రేయస్సును కాంక్షించే పోకడను కాపాడుకోవడం కోసం ప్రయత్నిస్తుంది. ఆకర్షణలు, తాత్కాలికమైన అనర్థాలు కళ్ళనుండు



మిరిమిట్లు గొల్పుతున్నా నిజమైన, స్థిరమైన, శాశ్వతమైన దారిని వెతుక్కుంటూ వెళ్ళవలసిన అవసరం నాయకత్వానికి ఎప్పుడూ ఉంటుంది. అలా కానప్పుడు మధ్యమధ్య కొన్ని గందరగోళాలు, అనిశ్చిత పరిస్థితులు, నష్టాలు సంభవిస్తూ ఉంటాయి.

చైనాలో అంతర్గతంగా రెండు విభిన్న ధోరణులు నిత్యం సంఘర్షిస్తూనే వస్తున్నాయి. ఒక్కసారి 1949కి ముందు ఉన్న పరిస్థితులను పరిశీలిస్తే అనాటికి సమాజంలో ఉన్న శక్తులను పరిగణనలోనికి తీసుకుంటే, ఆ శక్తుల ప్రభావాన్ని అంచనాలోకి తీసుకుంటే చైనా సమాజాన్ని అర్థం చేసుకోవటానికి వీలుంటుంది. విప్లవం వచ్చేనాటికి కార్మిక ,కర్షక ప్రజలు ఉన్నట్టే బూర్జువాలు ఉన్నారు, ఫ్యూడల్ శక్తులూ ఉన్నాయి. ప్రజలు ఫ్యూడల్ శక్తులపై విజయం సాధించటం జరిగింది కాబట్టి విప్లవం సాధ్యమయింది. అంత మాత్రాన ఫ్యూడల్ శక్తులూ వాటి ప్రభావాలూ అంతరించి పోయాయి అని చెప్పటానికి వీల్లేదు. తలెత్తుకోలేక పోవచ్చు, తిప్పికొట్టనూలేక పోవచ్చు, కాని తన 'ప్రయత్నం' తాను చేస్తూనే ఉంటుంది. అపుడు కొన్ని కథలు వస్తుండేవి ఎవరో ఒక పెద్ద భూస్వామినే, లేదా రాజకుటుంబములోని వానినే ఒక ఫ్యాక్టరీలో పనిచేయించటం, వ్యవసాయ క్షేత్రంలో పనిచేయించటం లాంటివి. ఫ్యూడల్ భావాలనుంచి వారికి విముక్తి కలిగించే క్రమంలో వారిచేత పని చేయించటం జరిగేది., ఆ పద్ధతిలో శ్రామిక సంస్కృతిని అలవర్చుకుంటారని ఉద్దేశం.

1949లో ఓటమి పొందిన శక్తులు, వాటి అవశేషాలు లేదా వాటినుంచి పుట్టిన కొత్తశక్తులు ఇంకా చైనాలో ఉన్నాయి. అందుకనే మావో ఎన్నో సాంస్కృతిక విప్లవాలు కావాలన్నాడు. సాంస్కృతిక విప్లవాల ద్వారా మాత్రమే మనిషిని మార్చగలమనే నమ్మకం మావోకి ఉండేది. విప్లవం తర్వాత విప్లవ వ్యతిరేక శక్తులకు మాట్లాడే అవకాశంకూడా లేకుండా చేయటం జరిగితే జరిగి ఉండవచ్చు. అది అనాటి అవసరం. ఆ తర్వాత ఆయన నాయకత్వంలోనే 'వంద పూవులు వికసించనీయండి' అనే ధోరణి బయటకు వచ్చింది. ఆయన బ్రతికి ఉండగానే సాంస్కృతిక విప్లవం బయలుదేరి చైనాను కుదిపివేసింది. రాజకీయ ప్రభావంతోపాటు దేశ ఆర్థిక జీవనాన్ని ఎంతో ప్రభావితం చేసింది. ఆసందర్భంగా చైనాలో నిద్రపోతూ ఉన్న కొన్ని శక్తులు బయటపడటం, వాటిని ప్రజలు ఎండకట్టడం, ఆ ధోరణులు అరికట్టటానికి ప్రతిజ్ఞ పూనటం ఇవన్నీ జరిగాయి.

పరస్పరంగా సంఘర్షిస్తున్న ఈరెండు ధోరణులు లోపల లోపల సంఘర్షించుకుంటూనే ఉన్నాయి. అదే నాయకత్వం కోసం పోట్లాట రూపంలో బయటపడేది. "గ్యాంగ్ఆఫ్ ఫోర్"గా ప్రచారంలోకి వచ్చిన నాయకత్వం కొన్ని రోజులు చైనాను ప్రభావితం చేస్తే దానిని కిందకు దించటం, ఆ స్థానంలో మరో నాయకత్వం రావటం జరిగింది. డెంగ్ ఆధిపత్యంలోకి రావటం, మళ్ళి ఆయనను దింపివేయటం, తిరిగి మళ్ళి డెంగ్ తిరుగులేని నాయకత్వంలోకి రావటం ఇవన్నీ ఈ సంఘర్షణ ప్రభావమే అనిపిస్తుంది. కొన్ని రోజుల తర్వాత హ్వా ప్రభావం చైనాలో ఉంటే ఆ తర్వాత ఆయనను వెనక్కినెట్టి వేయటం, ఆతర్వాత ఝువోజియాంగ్ ప్రభావం, తిరిగి ఆయనను వెనక్కినెట్టివేయటం ఇవి కూడా వాటిలోని భాగాలే అని పిస్తుంది.

సమాజంలో జరుగుతున్న మార్పులకు త్వరగా ప్రభావితం

అయ్యేవాళ్ళు విద్యార్థులు. చైనాలో జరుగుతున్న సంఘర్షణకు ప్రభావితం కావటం సహజమే. ఉన్నత పదవుల్లో ఉన్నవారి పిల్లలే తిరిగి కీలకమైన స్థానాలలోనికి వెళ్లటం ఎవరూ సహించరు. చైనాలో అంతకంటే సహించరు. ఎందుకంటే 'కొన్ని కుటుంబాలు మాత్రమే పరిపాలించటానికి తగినవి' అనే ధోరణి చైనాలో ఉండటానికి వీల్లేదు. అదేవిధంగా లంచగొండితనం చైనాలో కనబడటం ఎవరూ సహించరు. ఈరెండింటికి వ్యతిరేకంగా విద్యార్థులు ఆందోళన చేస్తున్నారంటే దానికి అందరూ మద్దతు తెలపవలసిందే, దానిని అందరూ హర్షించవలసిందే.

అయితే ఆర్థికరంగంలో కొన్ని మార్పులు కోరుతున్నారు అనేదాని పట్ల కొంత జాగ్రత్త వహించాల్సి వస్తుంది. చైనాలో రైతులు తమ ఉత్పత్తిని ప్రభుత్వ సంస్థలకు అమ్మాలి. నేరుగా బజారుకు తీసుకు వెళ్ళి అమ్మటానికి వీల్లేదు. అయితే ఈపద్ధతి ఇటీవల ప్రవేశపెట్టడం జరిగింది. ఆర్థిక సంస్కరణల పేరిట కొన్ని సడలింపులు చేశారు. ఇపుడు రైతులు మార్కెటులోకి వెళ్ళి తమ ఉత్పత్తిని అమ్ముకోవటం వల్ల లాభాలు వస్తున్నాయట. వారి చేతుల్లోకి డబ్బులు ఎక్కువ వస్తున్నాయట. అదే విధంగా కొన్ని విలాస వస్తువులు నేరుగా బజారులో కొనుక్కునే అవకాశం ఉండటం వల్ల వారికి ఇష్టమెనవి కొనుకుంటున్నారట. దానితో వారు చాలా హాయిగా జీవిస్తున్నారని విదేశ పత్రికలు పొగిడాయి. ఈ ధోరణి కొనసాగించటం చైనాకు లాభదాయకమా హానికరమా చైనా ఆలోచించాలి. తిరిగి మార్కెట్ బయలుదేరితే, పెట్టుబడిదారీ వ్యవస్థ మళ్ళీ అక్కడ ఏర్పడే అవకాశం రావచ్చు. ఏవ్యవస్థకు వ్యతిరేకంగా చైనీయులు పోరాడి ప్రాణత్యాగం చేశారో తిరిగి అదే వ్యవస్థను నెలకొల్పటం జరుగుతున్నదంటే దానిని చైనా ప్రజలు సమర్థించరు. అది ప్రజాస్వామికం పేరు మీద జరగనీ, వేరే పేరుమీద జరగనీ. అందుకనే పరస్పరం సంఘర్షిస్తున్న రెండు విభిన్న ధోరణుల మధ్య యుద్ధం తీవ్రంగా జరుగుతున్నది. సహజంగానే ప్రతి దానిలోనూ రెండు చీలికలు వస్తాయి.

అయితే విద్యార్థులకు మేధావుల మద్దతు లభించి . కార్మికుల మద్దతు లభించింది, పాత్రికేయుల మద్దతు లభించింది. అంటే ఏధోరణికి ఎందుకు లభించిందో చూడాలి. సాధారణంగా మానవత్వం' ధోరణిలో విద్యార్థులపై జరుగుతున్న దాడిని ఖండిస్తూ ప్రజాభిప్రాయం పెల్లుబికి ఉంటుంది. ఏది ఏమయినా వాస్తవ పరిస్థితులు పూర్తిగా తెలియకుండా ఒక అంచనాకు రావటం కష్టం. అంతమాత్రాన విద్యార్థులపై జరిపిన అమానుషకాండను ఎవరూ ఖండించకుండా, నిరసించకుండా ఉండలేరు. ఆ చర్యను అందరూ వ్యతిరేకించ వలసిందే. అలా జరగకుండా చూసుకోవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది. బహుశా గోర్బచేవ్ రాక సందర్భంగా కొంత వెనక్కి వెళ్ళవలసిన పరిస్థితి ఏర్పడటం 'పరువు' సమస్యగా ప్రభుత్వం తీసుకొని ఉంటుంది.

1949 తర్వాత చైనాను కుదిపివేసిన సంఘటనలలో ఇది నాలుగోది. అయితే ఇది మిగిలిన మూడింటికంటే ఎంతో తీవ్రమైనట్టిది. అయితే వీటి అన్నిటికి తట్టుకొని నిలబడగల సత్తువ చైనా ప్రజలు సంపాదించుకున్నారు. ఈ సందర్భంలో విద్యార్థుల పాత్ర కూడా ఎంతో మెచ్చుకోవలసిందే.

— బొజ్జాతారకం

ఆర్థికంగా తోడ్పడండి

'నలుపు' ప్రజల పత్రిక, ప్రజలు విరాళాలు, చందాల రూపంలో అందించే సహకారమే పత్రిక ఆర్థికంగా నిలదొక్కుకోడానికి ఆధారం. పత్రిక నిరాటంకంగా వెలువడటానికి ప్రజల సహకారం తప్పనిసరి.

మీరు విరాళాలు ఇవ్వడం ద్వారా తోడ్పడవచ్చు లేదా శాశ్వత చందాదారులుగా కాని, సంవత్సర చందాదారులుగా కాని చేరి ఆర్థికంగా సహాయపడవచ్చు. మీరు విరాళం ఇవ్వాలనుకుంటున్నారా? మీకు తోచినంత మొత్తాన్ని పంపించండి. శాశ్వత చందా రు. 500 లు. సంవత్సర చందా రూ. 65 లు

విరాళాలు, చందాలు హైదరాబాద్ బుక్ ట్రస్ట్ (మాగజైన్) పేర ఈ అడ్రసుకు పంపండి.

చందాదారులకు విజ్ఞప్తి

మీరు 'నలుపు' పత్రికకు చందాదారులా? అయితే మీకు పత్రిక క్రమం తప్పకుండా అందుతున్నదా? అందకపోతే వెంటనే తెలియజేయగలరు. మీరు ఎప్పుడు చందాదారులైంది? ఎన్ని రోజులుగా మీకు పత్రిక అందడం లేదే వివరాలు రాయండి. మీ పూర్తి చిరునామా ఇవ్వడం మరచిపోకండి.

సర్క్యులేషన్ మేనేజర్, నలుపు 1-1-342/బి
వివేక్‌నగర్, హైదరాబాద్ - 20.

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డి.ఆర్.డి.ఏ)

గ్రామసీమల్లో పేదలు అన్ని విధాలుగా భూస్వాములపై ఆధారపడి ఉంటారు. ఒకప్పుడు భూస్వాములు నేరుగా పేదలకు అప్పులిచ్చేవారు. అలివి గాని వడ్డీలతో పేదలను కట్టుబానిసలుగా మార్చేవారు. పాత తరహా 'వడ్డీ వ్యాపారం' పూర్తిగా తొలగిందని చెప్పలేంగాని, పరిస్థితి క్రమంగా మారిపోతున్నది. "పటేలు మాకు అప్పులు ఇస్తాడు" అనే మాట ఈనాడు పెద్దగా వినిపించదు. "పటేలు మాకు అప్పులు ఇప్పిస్తాడు" - అని అనుకుంటూ ఉంటారు. 'ఇస్తాడ'నే మాటపోయి 'ఇప్పిస్తాడ'నే మాట వచ్చింది. అదీ తేడా. పెళ్ళికి, ఎద్దులు కొనుక్కోడానికి ... దేనికైతేనేం... .భూస్వామి మంత్రదండం ఊపేసరికి బ్యాంకులనుంచి అప్పులు వచ్చేస్తాయి. ఇదీ ఇప్పటి భావన. పరిస్థితి ఈవిధంగా మారడానికి ఒక ముఖ్య కారణం "జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ" (డి.ఆర్.డి.ఏ) అని చెప్పొచ్చు.

సమగ్ర గ్రామీణాభివృద్ధి కార్యక్రమం (ఐ.ఆర్.డి.పి) అనే పథకం అందరికీ తెలిసే ఉంటుంది. ఈ కార్యక్రమానికి ఆర్థిక పునాది సమకూర్చే సంస్థే డి.ఆర్.డి.ఏ. 1976-77లో 20 జిల్లాల్లో ఐ.ఆర్.డి.పి. ప్రారంభమయింది. 1960,70 దశాబ్దాల్లో గ్రామీణ ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఆందోళనలకు దిగారు. ఆ అసంతృప్తిని చల్లార్చడానికైతేనేమి, 1980 నుంచి మొదలైన "గరీబీ హటావో" కార్యక్రమంలో భాగంగానైతేనేమి - ఐ.ఆర్.డి.పి.ని దేశంలోఅన్ని బ్లాకులకు విస్తరించారు. దారిద్ర్యరేఖకు దిగువన మగ్గుతున్న ప్రజానీకానికి ఉపాధికల్పించి వారి ఆదాయాన్ని పెంచి పైకితీసుకురావడం ఈ కార్యక్రమం ఉద్దేశం. గతంలో బ్యాంకులు పేదలకు ఆర్థిక సహాయం అందించాలంటే చాల సందేహించేవి. ప్రస్తుతం డి.ఆర్.డి.ఏ. పేదలకు ఇచ్చే రుణాలమీద సబ్సిడీలు సైతం కల్పిస్తున్నది. చిన్న రైతులకు 25 శాతం, సన్నకారు (మార్జినల్) రైతులు వ్యవసాయ కూలిలు చేతివృత్తులవారికి 33 1/2 శాతం, ఆదివాసులకు 50 శాతం సబ్సిడీలు ఉంటాయి.

గత పదేళ్ళుగా డి.ఆర్.డి.ఏ. ఆధ్వర్యంలో పేదలకు బ్యాంకులనుంచి రుణసదుపాయం లభిస్తోంది. ఈరుణాల పంపిణీలో మధ్యదళారీల ప్రమేయం ఉండకూడదనే సదాశయం మాత్రం ఇంతవరకు ఆచరణకు రాలేదనే చెప్పాలి. గ్రామీణపేదలే ఆత్మగౌరవాన్ని ఫణంపెట్టకుండా డి.ఆర్.డి.ఏ నుండి ప్రయోజనాలు సాధించాలంటే తమలో తాము సంఘటితం కావటం ఒక్కటే మార్గం. ఇందుకోసం డి.ఆర్.డి.ఏ. పని విధానాలను సాకల్యంగా అర్థం చేసుకోవడం కూడా అవసరం. అప్పుడే వారు - ఏభూస్వామి వద్దా బిచ్చగాళ్ళ వలెనుంచోనవసరం లేకుండా, తమకు రావలసినదాన్ని రాబట్టుకోగలుగుతారు. జిల్లా కేంద్రంలో డి.ఆర్.డి.ఏ. కార్యాలయం ఉంటుంది. ఈ కార్యాలయంలో ఒక ప్రాజెక్టు ఆఫీసర్ ఉంటారు. ఆయన కింద పలువురు అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్లు (ఎ.పి.ఒలు) ఉంటారు. వీరు జిల్లాలో వివిధ ప్రాంతాలకు సంబంధించిన పనులు చూసుకుంటూ ఉంటారు. ఇంతకుముందు పేర్కొన్నట్లు ఐ.ఆర్.డి.పి. కార్యక్రమాన్ని అమలు చేయడమే డి.ఆర్.డి.ఏ. పనుల్లో ప్రధానమైనది.

ఐ.ఆర్.డి.పి. సబ్సిడీ కార్యక్రమాలు

డి.ఆర్.డి.ఏ. సంస్థ ప్రతి సంవత్సరం మార్చి నెలలో ఆపేడాదికి గాను ఒక ప్రణాళికను రూపొందించుకుంటుంది. ఏ ఏ గ్రామాల్లో ఎందరెందరు లబ్దిదారులకోసం ఎంతెంత మొత్తాలు ఖర్చుపెట్టాలనే విషయమై అంచనాలతో ఈవార్షిక ప్రణాళిక తయారవుతుంది. ఉదాహరణకు రంగారెడ్డి జిల్లా డి.ఆర్.డి.ఏ. సంస్థ 1988-89 సంవత్సరానికి గాను- 33 మండలాల్లోని 295 గ్రామాల్లో 4950 మంది లబ్దిదారులకు గాను 142 లక్షల 64వేల రూపాయల మొత్తాన్ని కేటాయించింది. 4950 మంది లబ్దిదారులలో 2480 మంది ఎస్.సి.లు, 631మంది ఎస్.టి.లు. డి.ఆర్.డి.ఏ. సంస్థ ఆయాగ్రామాలను ఎంపికచేసుకున్న తరువాత, దానికి ఆప్రాంతం పార్లమెంటు సభ్యుడు లేదా శాసనసభ్యుని ఆమోదం పొందాల్సి ఉంటుంది. ఈ విధంగా ఆయా 'ప్రజాప్రతినిధుల'కు ఓట్‌బ్యాంకులుగా పనిచేసే స్థానిక భూస్వాముల మాటకు తగినంత ప్రాముఖ్యం లభిస్తుంది. భూస్వామి కావాలనుకుంటే తన 'శాసనసభ్యుని' ద్వారా తన గ్రామాన్ని లబ్దిదారీ గ్రామాల జాబితాలో చేర్పించగలుగుతాడు. తిరిగి తన గ్రామంలో ఎవరెవరికి రుణాలు ఇప్పించవచ్చో తానే ఆలోచించగలుగుతాడు. రానున్న మండల ఎన్నికల్లోనే మరో ఎన్నికల్లోనే ఫలానా కులం ఓట్లు తనకు వేయించగల మనుషులకే రుణాలు లభించేలా చూడగలుగుతాడు.

ఈ పని ఎలా జరుగుతుందో చూద్దాం. డి.ఆర్.డి.ఏ. ఎంపిక చేసుకున్న గ్రామసముదాయాల (క్లస్టర్ విలేజెస్) గురించి మండలాభివృద్ధి అధికారి(ఎం.డి.ఓ)కి, బ్యాంకు అధికార్లకు వర్తమానం ఉంటుంది. ఇక ఏఊరికి ఆఊళ్ళో లబ్ది దారుల ఎంపిక చేయడానికి ఆ ఊళ్లో గ్రామ సభను సమావేశపరచవలసి ఉంటుంది.

అంటే, ముందుగా ఒకరోజు రుణ ప్రదానశిబిరం (క్యాంప్) గురించి ఊళ్లో చాటింపు వేయించి, ఆరోజు ఊళ్లో అందరిని సమావేశపరచి, అందరి సమక్షంలో లబ్ధిదారులను ఎంపిక చేయాలి. గ్రామసభ సమయానికి ఎం.డి.ఓ. బ్యాంకు ప్రతినిధి, డి.ఆర్.డి.ఏ. అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసరు - అందరూ రావాలి. ఎంపిక చేసిన లబ్ధిదారుల ఫోటోలు తీసి, అవసరమైన కాగితాలు పూరించడం కూడా ఆరోజే జరిగిపోవాలి. ఇదీ జరగాల్సిన తతంగం. రుణ ప్రధానంలో మధ్య దళారీల బెడదను తొలగించడమే ఈ తతంగం ఉద్దేశం.

కాని, జరగాల్సింది వేరు. వాస్తవంగా జరిగేది వేరు. రుణప్రధాన శిబిరానికి ముందు చాటింపు వేయరు. శిబిరం గురించి స్థానిక భూస్వామి, సర్పంచ్‌వంటి పెత్తందార్లకు మాత్రమే తెలుస్తుంది. వారికి ఇష్టులైన పేదలకు - అంటే ముందే నిర్ణయమైపోయిన లబ్ధిదారులకు తెలియవచ్చు. ఇతరులు తమకు పోటీ వస్తారనే భయంతో వారా సంగతి ఇంకెవ్వరికీ చెప్పరు. సేద్యానికి దుక్కిటెద్దులు కొనాల్సి ఉన్న మల్లయ్య ఆసమయానికి పట్నంలో రిక్షాతొక్కుతుంటాడు. భూస్వామి ప్రత్యర్థి బృందానికి చెందిన పేద ఎల్లయ్య ఊళ్లోనే ఉన్నా అతనికి శిబిరం సంగతే తెలిసి ఉండదు. శిబిరం సమయానికి అధికారులు పంచాయితీ ఆఫీసుకు చేరుతారు. పంచాయితీ ఆఫీసు అనవాయితీగానే భూస్వాముల ఇళ్ళమధ్యనే ఉంటుంది. అక్కడున్న కొన్ని కుర్చీల్లో అధికారులు పెత్తందార్లు కొలువుతీరి కూర్చుంటారు. కాబోయే లబ్ధిదారులు నేలమీద చతికిల పడతారు. నిర్ణయాలు ముందే జరిగాయి గనుక పనులన్నీ చకచకా అయి పోతాయి. సభను వీలయినంత తొందరగా ముగించామని అధికార్లు సంతోషపడతారు. దాంతో అధికారికి ప్రణాళికలో మరోలక్ష్యం నెరవేరినట్లు లెక్క. మరికొందరు పేదవాళ్ళు దారిద్ర్యరేఖ దాటేసినట్లు లెక్క.

హష్‌హష్ వ్యవహారంలో అర్హులుకాని వారెందరో...

ఇలాంటి హష్‌హష్ వ్యవహారంలో అర్హులు కాని వారెందరో లబ్ధిదారుల జాబితాలో చేరిపోతారని వేరే చెప్పనవసరం లేదు. ధనిక రైతులు సైతం 'దొంగ లెక్కల'తో చిన్న రైతులయిపోయి ఐ.ఆర్.డి.పి. రుణాలు తీసు కుంటారు. ఉదాహరణకు 1988లో రంగారెడ్డి జిల్లాలో ఒక ఉదంతాన్ని చూడండి. రామ్‌రెడ్డి అనే పెద్దమనిషికి 1932 నాటికి యాచారం మండలం యాచారం గ్రామంలో 1178-1183 ఎకరాలు, నకెర్తా గ్రామంలో 400-500 ఎకరాలు, గట్‌పల్లిలో 100-130 ఎకరాలు -- మొత్తం 1678-1813 ఎకరాల పొలం ఉంది. ఇదిగాక, ఇద్దరు కొడుకుల పేరిట 280 ఎకరాలుంటుంది. ఈసంగతి తానే హైదరాబాదు (ఈస్ట్) కలెక్టరుముందు అంగీకరించాడు. ఇతని మనవడు, సంపన్నరైతు, న్యాయవాది, మాజీ సర్పంచ్, కో ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడూ అయిన చంద్రశేఖర రెడ్డి డి.ఆర్.డి.ఏ. నుంచి బోర్‌బావి రుణం సంపాదించగలిగాడు. తనకు 7-28 ఎకరాలు, తన భార్యకు 6 ఎకరాలు పొలం మాత్రమే ఉందని - అందువల్ల తాను చిన్నరైతుగా రుణానికి అర్హుడనని చెప్పుకోగలిగాడు. ఇదే మండలం ఇదే గ్రామానికి చెందిన మరో రామ్‌రెడ్డి, తన నలభై ఎకరాల పొలాన్ని భార్యా బిడ్డల పేరిట రాసేసి, తనకు 4-39 ఎకరాలకు మించి పొలంలేదని చూపించుకొని రుణం సంపాదించాడు.

ఇన్ని అక్రమాలకు ఆస్కారం ఉంది గనుకనే, పేదలు సంఘటితమై తమ ప్రయోజనాలను తామే కాపాడుకోవాలి. డి.ఆర్.డి.ఏ. లేదా ఎం.డి.ఓ. ఆఫీసునుంచి గ్రామ సముదాయాల పేర్లు, ఆయా గ్రామాల్లో రుణ ప్రదాన శిబిరాలు జరిగే తేదీలు - బాగా ముందుగా తెలుసుకోవాలి. శిబిరానికి ముందురోజు చాటింపు వేసే విధంగా గ్రామ సర్పంచ్‌మీద ఒత్తిడి తీసుకురావాలి. ఈశిబిరం ప్రాముఖ్యం ఏమిటి, దీన్నుంచి పేదలకు ఒనగూడే లాభాలేమిటి మొదలైన విషయాలు ప్రజల్లో ప్రచారం చేయాలి. గ్రామస్తులందరూ శిబిరానికి వచ్చేలా చూడాలి. నిజమే, రుణాలు కొంత మందికే లభిస్తాయి. అందరికీ దొరకవు. కాని, అందరూ సభలో ఉండటం అవసరం. నిజంగా నిజమైన అర్హతలున్నవారే లబ్ధిపొందడానికి ఇది దోహదం చేస్తుంది. లబ్ధిదారులను ఎంపిక చేశాక, ఫోటోలు అతికించడం, కాగితాలు పూరించడం మొదలైన పనులన్నీ అక్కడికక్కడే పూర్తి చేయాలని పట్టుబట్టాలి. అలాచేయకపోతే లబ్ధిదారులు బ్లాక్‌ఆఫీస్‌ల చుట్టూ చక్కర్లు కొట్టాల్సి ఉంటుంది. చిన్న పెద్ద అధికారులకు ముడుపులు ముట్టజెప్పాల్సి ఉంటుంది. "నీకు రూ.1500 సబ్సిడీ వస్తున్నప్పుడు, వాకు ఓ రెండొందలు ముట్ట జెప్పలేవా?" - అంటారు వారు.

ప్రభుత్వ కార్యక్రమాల్లో మరో అవలక్షణం ఉంటుంది. అధికారులు లబ్ధిదారులను చిత్తంవచ్చినట్లు నిరంకుశంగా ఎంపిక చేస్తారు. ఆతరువాత పనులనూ చాల యాంత్రికంగా నిర్వహిస్తారు. దరిమిలా పేదలమధ్య చీలికలు తయారవుతాయి. పేదవాళ్ళే పేద వాళ్ళకు వ్యతిరేకం అవుతారు. పేదవాళ్ళు మొదటినుంచి సమైక్యంగా ఉంటే దీనికి అవకాశం ఉండదు. తక్షణం ఆర్థికసాయం అవసరమైన వారెవరూ కొన్నిరోజులు ఆగడానికి అవకాశమున్న వారెవరు - అని తమలో తాము నిర్ణయాలు చేసుకోగలుగుతారు. అలాంటి ఐక్యత ఉన్నప్పుడు పేదల్లో నిరుపేదలకు ముందస్తుగా సాయం అందుతుంది.

ఎలాంటి పనులకు ఆర్థిక సాయం ...

డి.ఆర్.డి.ఏ. సబ్సిడీ పథకాల క్రింద పాడిపశువులు, దుక్కిటెద్దులు, కూరగాయల వ్యాపారం, సైకిల్‌షాప్, షామియానాలు అద్దెకు ఇచ్చే దుకాణం వంటి కార్యక్రమాలుంటాయి. బావులు బోర్‌లవంటి చిన్నతరహా

సేద్యపునీటి పథకాలూ ఉంటాయి. అతరువాత ప్రతిపాదనలను "ప్రాపర్ ఛానల్" ద్వారానే పంపించుకోవాలనే సంగతి మరచిపోకూడదు. ఆర్.డి.ఎ. ప్రాజెక్టు ఆఫీసరు పేదలపట్ల సానుభూతి ఉన్నవాడైతే సరే. లేకుంటే, ప్రతిపాదనలను ఎం.డి.ఓ. ఆఫీసు ద్వారా డి.ఆర్.డి.ఎ. ఆఫీసుకు పంపించుకొని - అతరువాత అపని జరిగేలా చూసుకోవాలి. ఇక - డి.ఆర్.డి.ఎ. నుంచి ఏఏవ్యవహారాల్లో సబ్సిడీ రుణాలు పొందవచ్చునో సమగ్రంగా తెలుసుకోవడం అవసరం.

తోటల పెంపకం : సొంతభూమిలో - వీలయితే కొంతవంది ఉమ్మడిభూమిలో - 'తోటలు పెంచదలచుకుంటే దానికి ఆర్థికసాయంకోసం డి.ఆర్.డి.ఎ.కు దరఖాస్తు పెట్టుకోవచ్చు. సాధారణంగా ఆభూమికి బావివంటి నీటివనరు ఏదైనా ఉన్నప్పుడే అదరఖాస్తును పరిశీలిస్తారు. డి.ఆర్.డి.ఎ. వారు రుణానికి అనుబంధంగా సబ్సిడీ ఇస్తారు. తోట కాపునకు వచ్చేవరకు ఈసహాయం ఆదుకోగలుగుతుంది. ఉదాహరణకు మామిడి తోట అంటే - చిన్న మొక్కలు, ఎరువులు, నీరు పెట్టడం వంటి పనులెన్నో ఉంటాయి. కాపునకు వచ్చేకాలం (గెస్టేషన్ పీరియడ్) 6-7 ఏళ్ళు ఉంటుంది.

చేవల పెంపకం: భూమిలో కొంతభాగాన్ని చేవలపెంపకానికి కేటాయించుకోదలిస్తే పెంపకానికి అవసరమైన డబ్బుకోసం డి.ఆర్.డి.ఎ.కు దరఖాస్తు పెట్టుకోవచ్చు.

పట్టు పరిశ్రమ : పొలంలో నీటివనరు ఉన్నట్లయితే మల్బరీ మొక్కలు పెంచి, సెరికల్చర్ డిపార్ట్‌మెంట్‌నుంచి పట్టుపురుగులు తెచ్చి పెంచవచ్చు. అ డిపార్ట్‌మెంట్‌వారే పట్టుపురుగు ఉండలను (సిల్క్‌కకూన్స్) కొనేస్తారు. ఇది ఎక్కువ శ్రమశక్తి అవసరమయ్యే కార్యక్రమం.

పశువుల పెంపకం : మేలుజాతి పశువులను సరఫరాచేయడం ద్వారా చక్కని పశువులను పెంచడానికి కూడా డి.ఆర్.డి.ఎ. సాయపడుతుంది.

స్త్రీ, శిశు అభివృద్ధి :- స్త్రీలు సంఘాలుగా రూపొంది తమకుతాము అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం ఈపథకం సారాంశం. ఆంధ్రప్రదేశ్‌లో 8 జిల్లాల్లో మాత్రమే ఈ పథకానికి అవకాశం ఉంది.

జవహర్ రోజ్‌గార్ యోజన : ఇటీవల విపరీతంగా ప్రచారంలో ఉన్న ఈపథకానికి డి.ఆర్.డి.ఎ. సంస్థ నేతృత్వం వహించాల్సి ఉంది. ఆర్.ఎల్.ఇ.జి.పి. ఎన్.ఆర్.ఇ.పి. పథకాలను రద్దుచేసి; గ్రామపంచాయితీలకు నేరుగా నిధులు అందిస్తారు. సాంకేతిక ఆమోదం బ్లాక్‌స్థాయిలో జరుగుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ఈపథకాన్ని జిల్లా పరిషత్తులు నిర్వహిస్తాయి. డి.ఆర్.డి.ఎ. సంస్థలు తమ నిధులను ఇప్పటికే విడుదల చేశాయి.

కరువు పీడిత ప్రాంతాల కార్యక్రమం (డి.పి.ఎ.పి) : దీనికింద కొన్ని కరువుపీడిత ప్రాంతాల్లో చిన్న తరహా నీటి వనరులు, భూసార సంరక్షణ, పశువుల మేత అభివృద్ధి, ఊట చెరువులు, సామాజిక అడవులు, కమ్యూనిటీ ఇరిగేషన్ బావులు - మొదలైన కార్యక్రమాలు చేపడుతున్నారు.

స్వయంఉపాధి కోసం యువజనులకు శిక్షణ (టి ఆర్ వై ఎస్ ఇ ఎం) : డి.ఆర్.డి.ఎ. నిధులతో 18-35 ఏండ్ల మధ్య వయస్సులో ఉన్న యువతీ యువకులకు కొన్ని వృత్తి పనులలో శిక్షణ ఇస్తారు. రేడియో టీవీ రిపేర్లు, వడ్రంగం, వెల్డింగ్, విద్యుత్ పరికరాల సర్వీసింగ్, ఖాదీ, చేనేత మొదలైన పనులు నేర్పిస్తారు. గుర్తింపు పొందిన సంస్థల్లో శిక్షణ నేర్పుతారు. గ్రామంలోనే శిక్షణ ఇస్తున్నట్లయితే సంస్థకు శిక్షణ ఖర్చులే గాక, విద్యార్థికి రూ. 75. ఉపకార వేతనం ఇస్తారు. గ్రామానికి బయట రక్షణ ఇస్తున్నట్లయితే భోజనం, బస వసతుల కోసం రూ. 300 ఉపకార వేతనం ఉంటుంది.

పేదలు ఏకమైతే అవినీతికి సమాధి

చిన్న రైతులు, వ్యవసాయ కూలీలకు మాత్రమే డి.ఆర్.డి.ఎ ఆర్థిక సాయం అందాలి. ఈ నంగతి అందరూ గుర్తించుకోవాలి. ఐదెకరాలకు లోపు పొలం ఉన్న కుటుంబాలే దీనికి అర్హులు. భూమి గాని విద్యగాని లేని అశేష పేద ప్రజానీకం సంఘటితంగా లేకపోవడం వల్ల మధ్యతరగతికి ధనిక రైతులే డి.ఆర్.డి.ఎ. సహాయాన్ని కొట్టేస్తున్నారు. డి.ఆర్.డి.ఎ నిధులు ప్రభుత్వం సొమ్మేమీ కాదు. సంపదలు సృష్టించడం ద్వారానైతేనేమి, పన్నులతో సహా ధరలు చెల్లించి వినిమయ సరుకులు కొనడం ద్వారానైతేనేమి - అందులో ప్రతి పైసా ప్రజలు సంపాదించి పెట్టినదే. అది మన డబ్బే అయినప్పుడు దాన్ని ఎలా ఖర్చు చేయాలో కూడా మనకు తెలిసి ఉండాలి. ప్రస్తుతం సాగుతున్న దుర్వ్యయాన్ని అక్రమ వినిమయాన్ని అరికట్టడం కూడా మన బాధ్యతే. ప్రజలకు సాయపడే మనస్తత్వమూ, కాస్త యోచన శక్తి ఉన్న అధికారులుంటే ఈ పని సులభమవుతుంది. అదే, పేద ప్రజలు సంఘటితంగా ఉన్నట్లయితే - అవినీతికి మారు పేరయిన అధికారులు సైతం ప్రజల డబ్బును దుర్వినియోగం చేయలేరు. భూస్వాములు - అధికారులు కుమ్మక్కై పేదల మధ్య విభేదాలు సృష్టించడానికి యత్నించినా, దీనికి పేదలు అవకాశం ఇవ్వక పోవడంతో ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం అప్పులు ఇచ్చే పని చేయకుండా బ్యాంకర్లు వెళ్ళిపోయిన సందర్భాలెన్నిటినో నేను చూశాను. ప్రజల అప్రమత్తత ఒక్కటే ప్రజాధనం దుర్వినియోగం అనే రోగానికి సరైన మందు. దుర్వినియోగాన్ని అరికట్టినప్పుడే ప్రజలకు ఎంతో కొంత మేలు.

- గీతా రామస్వామి.

ప్రాథమిక విద్య దుస్థితి

మళ్ళీ బళ్ళు తెరుస్తున్నారు. చదువుకునే వయస్సు వచ్చిన పిల్లలు ఎందరో బడిదారికాకుండా పాలెందారి పడుతున్నారు. నికృష్టమైన పనుల్లోకి యీడ్వబడతారు. మరెందరో పిల్లలు బళ్ళుమానేస్తారు. నిర్బంధోచిత ప్రాథమిక విద్యగురించిన పాలకుల తీపి మాటలన్నీ "నీటిమూటలు"గా తేలిపోయాయి. విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న సందర్భంగా, పాలకుల నిర్లక్ష్యాన్ని కళ్ళకు కట్టినట్లు చెప్పడం ఈవ్యాసం ఉద్దేశ్యం.

నేటివిద్యార్థులే "భావి భారత పౌరులు"

1950 జనవరి 26వ తేదీన ప్రవేశపెట్టబడిన భారత రాజ్యాంగర బాల, బాలికలకు నిర్బంధోచిత ప్రాథమిక విద్యను గ్యారంటీ చేస్తానని చెప్పుకుంటుంది. పిల్లలకు నిర్బంధోచిత విద్య గూర్చి చెబుతూ అది ఈ "రాజ్యాంగం అమలులోనికి వచ్చిన తరువాత 10 సంవత్సరాలు, 14 సంవత్సరాలలోపు బాలలందరికీ నిర్బంధ, ఉచితవిద్య అందించడం కోసం ప్రభుత్వం కృషి చేస్తుంది" అని అంది. అయితే వాస్తవ పరిస్థితి ఏమిటి?

రాజ్యాంగంలో ఆ లక్ష్యాన్ని ప్రకటించిన పాలకులు గత 40 సంవత్సరాలుగా దీన్ని అమలు పరచటంలో మాత్రం నిర్లక్ష్యవైఖరిని ప్రదర్శించారు. ఇప్పుడున్న ఈ ప్రాథమిక విద్య క్రూర అవహేళనం పాలయింది. దీన్ని అమలుపరిచేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలేమిటి? సామాజిక పరిస్థితులకు కారణం ఆలోచించాలి. ప్రభుత్వ వైఫల్యాలకు కారణమేమిటని, అందరికీ విద్య అన్నసంగతి అలా ఉంచినా, అసలు చదువుకునే ఈ కొద్దిమంది విద్యార్థులకైనా సరిపడే వసతులు కల్పించడంలో ప్రభుత్వం దారుణంగా విఫలమవుతోందని గుర్తించాలి. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన "నూతన విద్యావిధానం" ద్వారా విద్యావకాశాలను, సంపన్న వర్గాలకు పరిమితం చేస్తూ విద్యను ప్రైవేటు వర్గాలకు అప్పజెప్పడముతో విద్యా 'వ్యాపారము' లాభసాటి వ్యాపారాల జాబితాలో మొట్టమొదటి స్థానం ఆక్రమించింది. పేద విద్యార్థులకు కనీసం ఈ సౌకర్యాలు లేక చదువుకు నోచుకోని పరిస్థితి ఏర్పడింది. కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న రీతిలో రాష్ట్రప్రభుత్వం కూడా విద్యను విద్యార్థులకు దూరం చేయడానికి "ఉన్నత విద్యా మండలి"చట్టాన్ని ప్రవేశపెట్టింది. రాష్ట్రంలో కనీస సౌకర్యాలు నెరవేర్చక ఉన్న సౌకర్యాలను కూడా కల్పించక 'విద్య'ను వ్యాపార వస్తువుగా మార్చి ప్రైవేటు శక్తులకు అందించింది. పేద విద్యార్థులకు విద్య అందుబాటులో లేక విద్యను అభ్యసించనివారు, విద్యకు దూరమవుతున్న వారు కోట్లాదిమంది విద్యార్థులున్నారు.

విద్యా బడ్జెట్

దేశంలో విద్యావిధానం కనీస అభివృద్ధికి 10% అయినా కేటాయించాలని అభిప్రాయ పడ్డారు. కాని ప్రభుత్వం విద్యకోసం కేటాయించిన బడ్జెటు గత సంవత్సరము 2%కాగా ప్రస్తుతం దాన్ని 1.8%నికి రానురాను తగ్గిపోయింది. విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నది. కాని, బడ్జెటు కేటాయింపు రోజురోజుకు తగ్గిపోతున్నది. మొత్తం విద్యాబడ్జెటులో 1.5% యూనివర్సిటీ చదువు కోసమయితే ప్రాథమిక విద్య కళాశాల చదువులకు కేవలం 0.7% మాత్రమే వ్యయం చేస్తున్నారు. పైగా బడ్జెటును ప్రాథమిక అవసరాలకు ఉపయోగించక, ఈ ప్రభుత్వాలు అణచివేత యంత్రాంగానికి, ఆయుధాల కొనుగోలుకు, శ్రీలంక లాంటి చోట్లకు సైన్యాన్ని పంపడం చేస్తున్నది. పెద్దయెత్తున సైన్యాన్ని శ్రీలంకకు పంపి, వారికి రోజుకు 6.7 కోట్ల చొప్పున మన ప్రభుత్వం ఖర్చుపెడుతున్నది. విద్యకు కేటాయించిన నామమాత్ర బడ్జెట్ అనేక చేతులు మారి అసలు వరకు వచ్చే సరికి ఎలా "హారతి కర్పూరంలా హరించుకు పోతుందో, అలాంటప్పుడు మిగిలేది, దాని వల్ల జరిగేది ఎంతటి ప్రగతో? ఆలోచిస్తే మనకు అర్థమవుతుంది.

పాఠశాలల దుస్థితి

విద్యార్థుల విజ్ఞానానికి స్థిరమైన పునాదివేయడంలో కీలక పాత్ర వహించాల్సిన ప్రాథమిక విద్యా దశ ప్రశాంత వాతావరణంలో ఉండి, అన్ని కాలాల్లో విద్యార్థులకు తగు నీడ నిచ్చి కాపాడాల్సిన పాఠశాలలు ఘోరంగా నిర్లక్ష్యం చేయబడుతున్నాయి. చిన్న చిన్న గదులలో విద్యార్థులను పశువుల్లాగ చొరగొట్టబడుతున్నారు. వేలాది స్కూళ్లను బందెల దొడ్లుగా మురికి కూపాలుగా, కనీస సౌకర్యాలు లేకుండా ఉన్నాయి. పాఠశాలలు లేకున్నా ఉన్నట్టు కాగితాల్లోకి ఎక్కించడం మన పాలక వర్గాలకు ఆనవాయితి. 40% ప్రాథమిక పాఠశాలలకు కనీస సౌకర్యంగాని, ఫర్నీచర్‌గాని, గుడిసెలు గాని, చివరకు బహిరంగ స్థలాలు కూడా లేవని పేర్కొంటున్నారు. వర్షాకాలం వస్తే విద్యార్థులు, టీచర్లు కలిసి చెట్ల క్రింద వర్షానికి తడుస్తు విద్యను నేర్చుకొంటున్న పరిస్థితి రోజు రోజు మరింత అధికమవుతున్నది. మరో ప్రక్క

విద్యార్థుల కవసరమైన 'పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు సకాలంలో అందించడంలో ప్రభుత్వం విఫలమౌతున్నది. కేంద్ర ప్రభుత్వం న్యూస్ ప్రింట్ ధరను దారుణంగా పెంచి దేశవ్యాప్తంగా సంక్షోభాన్ని ఒక ప్రక్క సృష్టించగా రాష్ట్ర ప్రభుత్వం పుస్తకాల ముద్రణ బాధ్యతను వదులుకొని ప్రైవేటు ముద్రాపకులకు రాయితీల కోసము కాపీరైటును అమ్మివేసింది. పుస్తకాల పంపిణీలో ఉన్న అవకతవకలు బ్లాక్‌మార్కెటింగ్ విద్యార్థుల తల్లిదండ్రులకు భారంగా తయారైంది. మధ్యాహ్న భోజన పథకం, బట్టలు, ఉచిత నోట్‌బుక్స్ అని చెపి ఇచ్చి ఇప్పుడు ఆ పథకాలను కూడా అమలు పరచకపోవడంతో పేద విద్యార్థులు విద్యకు దూరమయి ఎలాంటి గత్యంతరం లేక చదువును మానుకోవాల్సిన "దుస్థితి" కూడా ఏర్పడుతుంది.

టీచర్ల కొరత

అనేక పాఠశాలలు పరిస్థితి ఈ విధంగా ఉంటే, టీచర్ల నియామకం కొరత మరో విధంగా పరిణమించింది. ఈ కొరత ఫలితంగా ఇప్పుడు బోధిస్తున్న టీచర్లు అదనపు పనిభారాన్ని ఎదుర్కోవలసి వస్తుంది. అదే విధంగా సామాజిక ఉత్పత్తికి ఉపయోగపడని అశాస్త్రీయ విద్యా విధానం వలన ఎన్ని డిగ్రీలు చదివినా ఉద్యోగము దొరకక చివరకు నిరుద్యోగులుగా లక్షలాది మంది రోడ్ల వెంబడి తిరుగుతున్నారు. ఉద్యోగం దొరకని పేరు మీద ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారు. పని విలువలకు, సామాజిక వికాసానికి సంబంధంలేని విద్యా విధానం మెజారిటి విద్యార్థి లోకాన్ని నిరుద్యోగానికి బలిచేసి కొంత మందిని బానిస ఉద్యోగస్తులుగా కూడా చేస్తుంది. ఇలాంటి పరిస్థితిలో వివిధ సెక్టర్లకు చెందిని ఇంజనీర్లు, డాక్టర్లు 10 వేలకు పైగా ఉన్నారు. విద్యను బోధించే టీచర్లు మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 25 వేల్ల పోస్టులు ఖాళీలుగా ఉంటే వివిధ సెక్టర్లకు చెందిన వారు 10 కోట్లకు పైగా నిరుద్యోగులున్నారు. అయినా ఈ ప్రభుత్వం కంప్యూటరైజేషన్ పేరిట ఇంకా టీచర్లను తగ్గిన్నూ నిరుద్యోగులను చేయాలని చూస్తున్నది. మనదేశంలో 36% ప్రజలు చదువుకోవడం లేదు. దీని వల్ల ఎంత మంది నిరుద్యోగులు అవుతారో అర్థం చేసుకోవచ్చు.

సాంఘిక అణిచివేత–నిరక్షరాస్యత

100 కు 80 మంది గ్రామీణ ప్రజలు నివసిస్తున్న గ్రామాల్లో భూస్వాముల దయా, దాక్షిణ్యాలు కూడ కొంత వరకు పిల్లల చదువులను నిర్ణయిస్తాయి. రైతు-కూలీల బిడ్డలు విజ్ఞాన వంతులైతే దోపిడిని ప్రశ్నిస్తారని, వారిని చదువులకు దూరం చేయడానికి భూస్వాములు అహంకారంతో హుంకరిస్తారు. "పాలె పట్టె సేతులకు కలాలెందుకురా? సదువుకొని రాజులౌతరా- రాజ్యాలేలుతారా" అని పిల్లలను, వారి తల్లిదండ్రులను బెదిరించి, గ్రామాలలో వారికున్న ఆర్థిక, రాజకీయ, సాంఘిక పెత్తనంతో చదువులకు దూరం చేస్తారు. అందుకే గ్రామాల్లో "పాలేరు కొడుకు-పాలేరే" అనే సామెతను కూడా వింటుంటాం. నూటికి 36 మంది అక్షరాస్యులుగా ఉన్న స్థితిలో సైతం వివిధ రకాలుగా మధ్యలో చదువు వదిలేసి హోటళ్ళలో, మెకానిక్ షాపులల్లో, పశువులను కాస్తూ బిచ్చమెత్తుతునో ఉంటారు. జీవితానికి సంబంధించిన పాఠ్యాంశాలు ఉండకపోవడం వల్ల, స్థానిక పరిస్థితుల వల్ల చదువునేర్చుకోకుండా 75% మంది బాలలు మధ్యలోనే చదువులు మానేస్తున్నారు. 1951లో దేశంలో 31 కోట్ల మంది నిరక్షరాస్యులు ఉండగా, 1961లో 33 కోట్లకు పెరిగినారు. 1971లో 37 కోట్లకు పెరిగారు. అంటే దీన్ని బట్టి 1981-89 వరకు ఎంతమంది నిరక్షరాస్యులున్నారో అర్థమవుతుంది. ఈ విధంగా భారతదేశ జానాభాలో నిరక్షరాస్యత పెరుగుతుంది, అక్షరాస్యుల సంఖ్య తగ్గుతుంది. అంటే ప్రాథమిక విద్యకు, విజ్ఞానానికి దూరమైన వారు దేశంలో పెద్దసంఖ్యలో ఉన్నారు.

పొట్టకూటికి

5-14 సంవత్సరాల వయస్సు పిల్లలు ఆనందంగా పాఠశాలలకు వెళ్ళుతుండాలి. కాని దేశంలో 1 కోటి 70 లక్షల మంది పిల్లలు పొట్ట నింపుకోవడానికి పలురకాల కూలి పని చేస్తున్నారు. ఇది ప్రభుత్వం ఇచ్చిన అంకె. నిజానికి ఈ వయసులోని 4 కోట్ల 40లక్షల మంది పిల్లలు కూలిపని చేస్తున్నారని బరోడాలోని ఆపరేషన్స్ రీసర్చ్ గ్రూపు అంచనా వేసింది. వాస్తవానికి భారత దేశంలో బాల కూలీల సంఖ్య 10 కోట్ల వరకు ఉంటుందని అంతర్జాతీయ కార్మిక సంస్థ యొక్క అంచనా. చాలా మంది హొటళ్ళు, ఫ్యాక్టరీలు, వ్యవసాయ క్షేత్రాలు, ఇండ్లు నిర్మాణం మొదలయిన వాటిలో ఎన్నో గంటలు కష్టపడి పనిచేస్తున్నారు. బాలల పరిరక్షణకుఎన్ని శాసనాలున్నప్పటికి ఇవాళ దేశంలో పరిస్థితి ఈ విధంగా ఉందనడానికి 4 కోట్ల 40 లక్షల మంది బాలకూలీలే సజీవ నిదర్శనాలుగా మనకు కనిపిస్తున్నారు.

విద్యావిధానంలో మార్పు

40 సంవత్సరాల క్రితం "స్వాతంత్ర్యం" వచ్చిందని చెప్పబడ్డున్నప్పటికి భారత రాజ్యాంగం నిర్దేశించిన నిర్బంధోచిత ప్రాథమిక విద్య ఏ విధంగా అపహాస్యం పాలయిందో తెలుసుకున్నాము. దీనిని అమలు పరుచుటలో పాలక వర్గాలకు కనీస చిత్త శుద్దిలేదని గమనించాలి. ఒకవేళ చిత్త శుద్ధి ఉన్నా అది ఈ వ్యవస్థ పరిధిలో అమలు జరగడం సాధ్యం కాదు. అవి అమలు జరిగినా, దాని వల్ల ప్రయోజనం ఎంత మాత్రం లేదు. ఎందుకంటే బ్రిటిష్ మేధావి లార్డ్ మెకాలే తమ సామ్రాజ్యవాద పాలనను సుసంఘటితం చేసుకోడానికి ఉద్దేశించి ప్రవేశపెట్టిన "విద్యావిధానమే" నేటికీ కొనసాగుతున్నది. కేవలం గుమాస్తాలను తయారు చేయడానికి ఉద్దేశించిన బానిస విద్యావిధానం కొన్ని యాంత్రిక మార్పులతో ఈ నాటికీ యథాతథంగా ఉంది. ఒక మాటలో చెప్పాలంటే సమాజగమనానికి సంబంధం లేని అశాస్త్రీయ, విద్యావిధానం ఈనాటకి కొనసాగుతున్నది.. ఈ విద్యావిధానంలో మౌలిక మార్పుకోసం, ప్రజలందరూ చదువుకొని అవకాశాల కోసం పోరాడాలి.

ఎం. నిరంజన్ రెడ్డి

చరిత్రలో రాయలసీమ

అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాలు, ప్రకాశం జిల్లాలోని మార్కాపురం, గిద్దలూరు, కంభం తాలూకాలు రాయలసీమగా వ్యవహరింపబడుతున్నాయి. చరిత్రలో ఈ ప్రాంతాలకు ఎంతో ప్రాధాన్యత వుంది.

తెలుగు ప్రజల అదిమ నివాసస్థలం రాయలసీమ. చిత్తూరు జిల్లా రేణిగుంట సమీపాన వున్న రాళ్ల కాల్వవద్ద, కర్నూలు జిల్లాలో అనేక చోట్ల జరిగిన తవ్వకాలలో అతి ప్రాచీన మానవుని ఉనికికి సంబంధించిన అనేక ఆధారాలు లభించినట్టు ప్రముఖ చరిత్ర కారుడు ప్రొఫెసరు హెచ్.డి. సంకాలియా తెలియజేసినారు. "మద్రాసు చుట్టు పట్లా, కర్నూలు జిల్లాలో వున్న అనేక గుహలు అన్నిటికన్నా ముఖ్యమయిన స్థలాలని నాఅభిప్రాయం. దాదాపు అరవైయేళ్ల క్రితం రాబర్ట్ బ్రూస్ ఫుట్ ఆ ప్రదేశాలలో అనేక పరికరాలనూ, ఎముకలమీద చెక్క బడ్డ కళానైపుణ్యాన్ని కనుగొన్నాడు. ఆ పనితనాన్ని ఆయన అదేరోజుల్లో ఫ్రాన్స్ గుహల్లో కనుగొన్న పనితనంతో పోల్చినాడు. ఆ కాలాన్ని పురావస్తు శాస్త్రజ్ఞులు పాతరాతియుగం ఉన్నత దశ అంటారు. దురదృష్టవశాత్తూ ఫుట్ సేకరించిన వేవీ నేడు లభ్యం కావటంలేదు. అయితే ఆతవ్వకాలలో దొరికిన సమాచారం ఆధారంగా మనం గట్టిప్రయత్నం చేస్తే అభివృద్ధి చెందిన వేటగాడి దశలోని మానవుని ఉనికి గురించి అనేక ముఖ్యమయిన ఆధారాలు కర్నూలు గుహల్లో తప్పక దొరుకుతాయని, ఈ కృషిలో చిత్తూరు, మద్రాసు పరిసరాల గుహలుకూడ ఉపయోగ పడవచ్చునని నాకు గట్టినమ్మకం."

(హెచ్.డి. సంకాలియా)

కర్నూలు జిల్లాలోని నదులు, వాగుల వెంబడి పాతశిలా యుగపు పనిముట్లు ఎన్నో దొరికినాయి. బెలుంగుహల్లో పాత శిలాయిగపు ఉత్తరదశకు సంబంధించిన జనావాసాలు దొరికినాయి. ఇక్కడ మెల్లోవేసుకునే దంతహారాలు, కొన్ని పంపుటెముకలు దొరికినాయి, కడప జిల్లా రాయచోటి తాలూకా నరస్వతి పల్లెల, ముక్రావులపల్లె, ఇతర ప్రాంతాలకు చెందిన కనుమలో పల్లె, చిద్వేత, కలసపాడులలోను, అనంతపురంజిల్లా గుంతకల్లు స్టేషన్ నైరుతి దిక్కుగా వున్న దిబ్బలోను, విడపనకల్లు కోటలో, వేల్పుమడుగు గుట్టల్లో, లత్తవరం, కరుగముక్కల, కొత్తకోటకు పడమరగా వున్న మిట్టమీద, ఉరవకొండ ప్రాంతంలోను పాతశిలాయుగపు పనిముట్లు దొరికినాయి. గుంతకల్లు రైలు స్టేషన్ సమీపంలో ఫుట్ స్నేహితులొకరికి ఒక కర్ర పన్నె దొరికింది. ప్రపంచంలో ఎక్కడా ఇంత వరకూ లభించని ప్రాచీన కుడ్య చిత్రాలు బెలుంగుహల్లో వున్నాయి, రాయదుర్గం కొండమీద చెక్కడపు పనులు చిత్రలేఖనం లభించినాయి. కర్నూలు జిల్లాలోని బెలుంగుహల్లో అనాటి మానవునికి నిప్పుచేయటం తెలిసి వుందనటానికి కావాల్సిన కొన్ని సాక్ష్యాధారాలు కూడ దొరికినాయి.

రాయలసీమను మౌర్యులు, పల్లవులు, శాతవాహనులు, చాళుక్యులు పరిపాలించినారు. క్రీ.శ. 3వశతాబ్దంలో చిత్తూరు జిల్లా పల్లవుల రాజ్యపాలన కింద ఉండేది. అనంతపురంజిల్లా అశోకుని తర్వాత పల్లవుల పాలనలోకివచ్చింది. శాతవాహన పతనానంతరం క్రీ.శ. 2వ శతాబ్దంలో కడప జిల్లా పల్లవుల పరిపాలన కింద కొచ్చింది, కర్నూలు జిల్లా తెలుగు చోళుల పరిపాలనలో వుండేది.

ఆంధ్రదేశాన్ని దీర్ఘకాలం పరిపాలించి, ఆంధ్రచరిత్రలో కొన్ని నూతన అధ్యాయాలను నెలకొల్పిన చాళుక్యుల జన్మస్థలం కడప జిల్లా. ప్రాచీనకాలంలో ఈ జిల్లాను హిరణ్యరాష్ట్రమని పిలిచేవారు. బృహత్పలాయనులు, శాలం కాయనులు, అనందులు సంఘర్షిస్తున్న కాలంలో రాయల సీమకు చెందిన రేనాడులో తెలుగు చోళులు పరిపాలించేవారు. ఈ కుటుంబానికి చెందిన కరికాలచోళుడు, త్రిలోచనపల్లవుడనే నాలుగో విజయస్కంద వర్మను ఓడించినాడు. ఈయనే చోళవంశారంభకుడు. కరికాల చోళుని వారసులు కడపజిల్లాలోని కమలాపురం, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు తాలూకాలనూ, కర్నూలు జిల్లాకు చెందిన కొయిల కుంట్లతాలూకాను క్రీ.శ. 700 వరకు పరిపాలించ నారు. మదనపల్లె తాలూకా లోని చిప్పిలి వారి రాజధానిగా వుండేది.

క్రీ.శ. 5,8 శతాబ్దాల మధ్య కడప, కర్నూలు జిల్లాలను పాలించిన రేనాటి చోళులు తమశాసనాలలో ప్రాచీన తెలుగును ఉపయోగించినారు. ఈనాడు వానిని అర్థం చేసుకోవటం కష్టం. రేనాటి చోళులు తెలుగు పద్యానికి రాజాదరణ నిచ్చినారు.

కొంతకాలం పల్లవులకింద, మరి కొంతకాలం చాళుక్యులకింద సామంతులుగా వుండిన రేనాటి చోళులు తమరాజ్యాన్ని రాష్ట్రాలు, మండలాలుగా విభజించినారు. మండలాలు -గ్రామాలుగా విభజించినారు. పశుసంపదను రక్షించటంలో ప్రాణాలర్పించిన వీరు సంస్మరణార్థం అనాడు నాటిన రాతి స్తంభాలు రాయలసీమ గ్రామాల్లో నేటికీ వున్నాయి. అనాటి చోళరాజులు అనేక చెరువులు తవ్వించినారు.

కాకతీయులు తమ రాజ్యాన్ని రేనాడు, ములికినాడు, ఏరువ నాడులుగా విభజించి పరిపాలించినారు. కడప, కర్నూలు జిల్లాలు రేనాడు; కడప జిల్లాలోని పులివెందుల, రాజంపేట, ప్రొద్దుటూరు తాలూకాలు, బళ్లారి జిల్లా

ఉత్తర ప్రాంతమూ, అనంతపురం చిత్తూరు జిల్లాలో మురికినాడు, నెల్లూరు, కడప, కర్నూలు జిల్లా భాగాలు ఏరువనాడుగా విభజింప బడినాయి. కాకతీయులు వ్యవసాయాన్ని బాగా అభివృద్ధి చేసినారు. భూముల్ని కొలిచి తరగతుల కింద విభజించినారు. భూసారాన్ని బట్టి పన్నులు విధించినారు. కాలువలు, చెరువులు తవ్వించినారు. అంబాపురం లాంటి కొన్ని గ్రామాలు వెలసినాయి. పొత్తపినాడుపొరులు అత్తిరాళ్లలోని పరమేశ్వర దేవాలయంలో సభజరిపి "చెయ్యేరు దక్షిణపు ఒడ్డున కరకట్టపోసి పరమేశ్వర దేవాలయానికి వరదముంపు రాకుండా చెయ్యటానికై గ్రామానికో మూటే పనూలు చేయ నిశ్చయించినారు" అని ఒక శాసనం తెలుపుతోంది. కర్నూలు జిల్లా అడవిగా వుండటం చూసి ప్రతాపరుద్రుడు ఉత్తర దిశనుంచి నీటిపారుదలకు ప్రోత్సాహం ఇచ్చినాడు. అడవి కొట్టించి, గ్రామాలు నిర్మించి భూముల్ని ఉచితంగా ఇచ్చినాడు.

13 వ శతాబ్దం మొదట్లో యాదవసింగన పరిపాలన కాలంనాటి అనంతపురం జిల్లాలో వ్యవసాయదారుల సంఘం గురించిన సమాచారం వుంది. ఆ సంఘంపేరు "చిత్రమేలి". ఇది స్థానిక రైతులు ఏర్పరచుకున్న సంఘం. ఇటువంటి సంఘం ప్రసక్తి ఇక్కడ తప్పమరెక్కడా కనబడదు.

క్రీ.శ. 1136నుండి 1650 వరకు అధికారంలోవున్న విజయనగర సామ్రాజ్యంలో రాయలసీమ ప్రాంతం ప్రముఖ పాత్ర వహించింది. విజయనగర రాజుల కాలంలో రాయలసీమ రతనాల సీమగా వెలుగొందిందని ప్రతీతి. విజయనగరరాజులు అంతకు ముందు ఎన్నడూ జరగని విధంగా వ్యవసాయాన్ని అభివృద్ధి పరిచినారు. నీటి పారుదల ఏర్పాట్ల పట్ల ప్రత్యేక శ్రద్ధచూపించినారు. అనేక చెరువులు, కాల్వలు, ఆనకట్టలు కట్టించినారు. ఆనాడు పళ్లు, పత్తి, చెరకు, కొబ్బరి, తమలపాకు, పొక, ధాన్యం, పప్పు దినుసులు మొదలయిన అనేక రకాల వ్యాపారపంటలు విస్తారంగా పండేవి.

1565లో తళ్లికోట యుద్ధంతో బహామనీసుల్తానులు విజయం సాధించటంతో, విజయనగర రాజులు తమ రాజధానిని హంపీ నుండి అనంతపురం జిల్లాలోని పెనుగొండకు మార్చుకున్నారు. ఈ యుద్ధంలో విజయనగరసామ్రాజ్యం పూర్తిగా ఓడినా, పూర్తిగా పతనం కాలేదు. బీజాపూర్, గోల్కండ నవాబులు బలపడినారు. 1650 లో వీరు పెనుగొండమీద దాడిచేసి విజయనగర రాజ్యాన్ని పూర్తిగా ధ్వంసంచేసినారు. నవాబులు సరయిన ప్రభుత్వాన్ని ఇవ్వలేకపోయినారు. రాజ్యం చిన్న చిన్న ప్రభువుల అధీనంలో వుండేది. 1677 -78 ప్రాంతంలో శివాజీ పాలన క్రింద, తరువాత నిజాం ఆధిపత్యాన, తరువాత మైసూరు రాజ్యంలో హైదరాలీ కింద, 1792 ఒప్పందంతో నిజాం అధీనం కిందరకి వచ్చినాయి. 1800 ఒప్పందంతో నిజాం సీడెడ్ జిల్లాలను తూర్పు ఇండియా వారికి అప్పజెప్పినాడు.

రాయలసీమ ప్రాంతం ఆనాటి ప్రత్యేకత పాలగాళ్ల వ్యవస్థ. విజయనగర సామ్రాజ్యంలో ఈ వ్యవస్థ ఏర్పడింది. విజయనగర రాజులు తమరాజ్యాన్ని పాలనా సౌలభ్యం కొరకు వివిధ ప్రాంతాలుగా విభజించి అధికారులను నియమించినారు. పన్నులు వసూలుచేయటం, రక్షణ కావలాదార్లుగా వుండటం, రాజుకు అవసరమయిన సైన్యాలను సమకూర్చటం వీరి బాధ్యత. విజయనగర సామ్రాజ్యం పతనం తర్వాత ఈ వ్యవస్థ క్రమేణా దిగజారి అరాచక పరిస్థితి ఏర్పడింది. 18 వ శతాబ్దంలో పాలెగాళ్లు నైజాం అధికారాన్ని మన్నించినారు. కాని అతని బలహీనతను కనిపెట్టి కప్పం చెల్లించటంలో నిర్లక్ష్యంచేస్తూ, నిజాం అధికారాన్ని వ్యతిరేకిస్తూ వుండినారు. సుమారు 80 మంది పాలెగాళ్లు ప్రభుత్వాన్ని ధిక్కరించినారు. సైనికచర్యలకు అవకాశం కల్పించిన ఈ ధిక్కారంలో మొదటగా ఆదోనికి చెందిన ఒక గ్రామాధికారి లేవదీసినాడు. కాని ఇతను కంపెనీ సైన్యం చేతిలో ఓడిపోయినాడు.

విజయనగర రాజుల కాలం నుండి బ్రిటీషువారు అధికారం చేబట్టే వరకు ఈ ప్రాంతంలో భూసంబంధాలలో గాని, పంటల విధానంలోగాని, నీటి పారుదలలోగాని ఎటువంటి మార్పులు లేక పోవటం వల్ల,కరువు కాటకాలకు గురయి తీవ్రంగా చితికి పోయింది.

తూర్పు ఇండియా కంపెనీ వ్యాపారసంస్థ దీని అధీనంలోకి రాయలసీమ జిల్లాలు వచ్చి వున్నాయి. ఈ కంపెనీకి వ్యాపారం తప్పితే మరొక ధ్యాసలేదు. తమ బొక్కసం నింపుకోవటమే ప్రధాన లక్ష్యం. భూమి మీద విపరీతంగా పన్నులు విధించినారు. జమీందారీ విధానం ప్రవేశపెట్టడంతో రైతాంగం బాగా చితికి పోయింది. కరువు కాటకాలు వచ్చిన ప్రతిసారి వేలాదిమంది చనిపోయినారు. కంపెనీ గుత్త పద్ధతిని ప్రవేశ పెట్టింది. దీనివల్ల రైతులు గ్రామాలనే వదలి వెళ్లిపోయేవారు కంపెనీ పరిపాలనా కాలంలో రైతాంగం పరిస్థితి మరింత అధ్వాన్నంగా తయారయింది. "కంపెనీ పాలన కింద వున్న ప్రాంతాల్లోని ప్రజల్లో దత్తమండలాల ప్రజలే కడుబీదవారు" (మన్రో). తూర్పు ఇండియా పరిపాలనలో రాయలసీమ నిత్య కరువు కాటకాలకు నిలయంగా మారిపోయింది. రాయలసీమ రైతాంగ జీవితంలో కరువులు అంతర్భాగమయి పోయినాయి. 1870లలో కడప - కర్నూలు కాలవను ప్రారంభించినా అనేక అవకతవకలవల్ల నిర్మాణం 1882 చివరినాటికి గాని పూర్తికాలేదు. ఈ కాల్వను ప్రధానంగా రవాణాకు ఉద్దేశించటంవల్ల వ్యవసాయం అభివృద్ధి కాలేదు. కరువులు రాయలసీమ రైతాంగానికి జీవన్మరణ సమస్యగా తయారయి నాయి. రాయలసీమ దక్షిణ భారతదేశంలో కరువు ప్రాంతంగా మారిపోయింది.

— భూమన్

ప్రభుత్వ రంగాన్ని నీరు కార్చిందెవరు?

మనదేశంలో ప్రభుత్వరంగం, ప్రయివేటు రంగం రెండూ కలిసి ఉన్న మిశ్రమ ఆర్థిక విధానం అమలులో ఉన్నది. ఇటీవల కొంతమంది కేంద్ర మంత్రులు మొదలు ప్రధానమంత్రి వరకూ ప్రభుత్వరంగ సంస్థల పని తీరుపై ధ్వజమెత్తుతూ విమర్శలు గుప్పిస్తున్నారు. మరోవైపు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు రంగానికి అప్పగించటానికి ప్రయత్నిస్తున్నారు. మొదటి పంచవర్ష ప్రణాళికా ప్రారంభంలో కేవలం 5పైగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలు ఈనాడు 300 వరకూ ఉన్నాయి. బ్రిటిష్‌వారి నుంచి స్వాతంత్ర్యం పొందాక మనదేశాన్ని త్వరితగతిన ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి పరచాలనే లక్ష్యంతో ప్రభుత్వ రంగాన్ని స్థాపించారు. ప్రజల అవసరాలను, డిమాండ్లను తీర్చవలసిన బాధ్యత ప్రభుత్వానిదే. అత్యవసర సేవలను ప్రజలకు వెంటనే అందించాలని ఈసంస్థలకు అంకురార్పణ జరిగింది. ప్రజల నిత్య అవసరాల్ని తీర్చే భారీ పరిశ్రమలను స్థాపించడానికి అనాడు ప్రయివేటు రంగం ఆసక్తి చూపలేదు. ఈపరిశ్రమలలో భారీ పెట్టుబడులు పెట్టినా లాభాలు అధికంగా వచ్చే అవకాశం లేదు. కాని నేడు ఈప్రభుత్వ రంగ పరిశ్రమలను కబళించాలని ప్రయివేటు రంగం తీవ్రంగా ప్రయత్నిస్తున్నది.

ప్రజల ఆర్థిక, సాంఘికాభివృద్ధిని సాధించడమే ప్రభుత్వరంగ సంస్థల లక్ష్యం కాని ఆచరణలో ఇప్పటి వరకు ప్రభుత్వ రంగ సంస్థలవల్ల లాభపడ్డది ప్రయివేటు రంగ సంస్థలేనన్నది నగ్నసత్యం. ప్రభుత్వరంగ సంస్థల ఉత్పత్తులను, సేవలను సామాన్య ప్రజానీకం కంటే ప్రయివేటు రంగ సంస్థలే వాటి అభివృద్ధికోసం బాగా ఉపయోగించుకున్నాయి. ఉదాహరణకు, రైల్వేలనే చూడండి. ప్రజలు అత్యధిక ఛార్జీలు చెల్లిస్తూ అష్టకష్టాలు పడుతూ రైళ్ళలో ప్రయాణిస్తున్నారు. ప్రజలు రైళ్లను ఉపయోగించుకునే దానికన్నా ఎక్కువగా వ్యాపార సంస్థలు, ప్రయివేటు రంగ పరిశ్రమలు గూడ్సుబండ్లను తమ వ్యాపారాలకు ఉపయోగించు కుంటున్నాయి. అలాగే ప్రభుత్వరంగ సంస్థలే విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్నాయి. ప్రతి గ్రామానికి కరెంటు సౌకర్యం కల్పించే లక్ష్యం కంటే, ప్రతి ప్రయివేటు పరిశ్రమకు కరెంటు సప్లయి అవుతున్నది.

1948, 1956లో ప్రభుత్వం రాసుకున్న ప్రభుత్వ పారిశ్రామిక తీర్మానాలను విస్మరించి ప్రయివేటు రంగానికి అంతకంతకు ఎక్కువగా ప్రాధాన్యతను ఇవ్వడం ప్రారంభించింది. ముఖ్యంగా ఇది ఇందిరాగాంధీ హయాం నుంచి మొదలయి, రాజీవ్‌గాంధీ పాలనలో పరిపక్వ దశకు చేరుకున్నది. నేటి ప్రభుత్వం అనుసరించే ఆర్థిక విధానాలు కేవలం వ్యాపార సంస్థలకు, పారిశ్రామిక వేత్తలకు, బహుళజాతి సంస్థలకే ఉపయోగపడుతున్నాయి. ప్రభుత్వరంగ సంస్థల సామర్థ్యం దెబ్బతిన్నదనే సాకుతో "ప్రయివేటీకరణ" అనే భావనను ప్రచారం చేస్తున్నారు. బొగ్గు, విద్యుత్తు, ఉక్కు, పెట్రోలియం, టెలికమ్యూనికేషన్‌లాంటి కీలక పరిశ్రమలను ప్రభుత్వరంగం స్థాపించాలన్న పారిశ్రామిక విధానాన్ని గాలికి వదిలేసి, ప్రయివేటు రంగానికి, బహుళజాతి కంపెనీలకు ఈ పరిశ్రమలను అంటగట్టాలనే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి.

ప్రభుత్వరంగ సంస్థలు దెబ్బతినడానికి కారకులెవరు? అనేది పరిశీలించాల్సిన విషయం, ప్రభుత్వమే ప్రధాన కారణం. నేటి ప్రభుత్వరంగ సంస్థల్లో రాజకీయ జోక్యం అధికంగా ఉంది. పదవులు దొరకని రాజకీయ నాయకులు, పరిజ్ఞానం, అనుభవంలేని వారిని ఛైర్మన్‌లుగా, మేనేజింగ్ డైరెక్టర్లుగా నియమించటం, ప్రయివేటు రంగంలోని వారికి ప్రభుత్వరంగ సంస్థల్లో కీలకపదవులు ఇవ్వడం మొదలైన చర్యల వల్ల ఈ వ్యక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం ప్రభుత్వరంగ సంస్థల్ని ఉపయోగించకుంటున్నాయి. మరోవైపు ప్రభుత్వం ప్రయివేటు రంగానికి ఎక్కువ రాయితీలు ఇస్తూ వాటిని ప్రోత్సహిస్తున్నది. లైసెన్సు విధానాలను, గుత్తసంస్థల నిరోధక చట్టాలను నీరుకారుస్తున్నది. అంతేగాక ప్రయివేటు రంగ సంస్థలతో పోటీపడేవిధంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఉత్పత్తి పద్ధతులను, నైపుణ్యతను ప్రభుత్వ రంగసంస్థలో ప్రవేశపెట్టక పోవడంవల్ల ఈ సంస్థలు దివాళా తీస్తున్నాయి.

విదేశీ బహుళజాతి కంపెనీలను మన దేశంలోకి అనుమతించటంలో చాలా ఉదారవైఖరిని ప్రభుత్వం ప్రకటించడం ప్రభుత్వ రంగ సంస్థలు దెబ్బతినేందుకు మరో ముఖ్యకారణం.

ముఖ్యంగా ఈ పరిస్థితిని మందుల పరిశ్రమలో చూడవచ్చు. అనేక బహుళ జాతి మందుల సంస్థలు, ముఖ్యంగా అమెరికన్ సంస్థలు అధిక లాభాలను గడిస్తుండగా ఐ.డి.పి.ఎల్. లాంటి ప్రభుత్వరంగ పరిశ్రమ నష్టాలతో నడుస్తున్నది.

ప్రభుత్వరంగాన్ని కాపాడ వలసిన బాధ్యతను పాలక వర్గాలు విస్మరిస్తున్నాయి. ప్రభుత్వరంగం పెట్టుబడులు ప్రజలు చెల్లించే పన్నుల్లోవే. వాటిని కాపాడు కోవలసిన కర్తవ్యం ప్రజలందరిది.

—టి. వెంకటరాంనర్సయ్య

లాకప్ మృతిపై నిరసన వెల్లువ

అక్కడ రాజ్యాంగ సూత్రాలు, న్యాయచట్టాలు మూగబోయాయి. న్యాయాన్ని రక్షించాల్సిన ఖాకీ అధికారులు కదం తొక్కుతూ చేతుల్లో చిక్కినవారి ప్రాణాలు తీస్తున్న దృశ్యమది. చట్టాన్ని దొడ్డిదారిన తమ గుప్పిట్లో ఇరికించుకున్న పోలీసులు సామాన్యులమీద చేస్తున్న స్వైరవిహారం ఫలితమే ఈనాడు జరుగుతున్న లాకప్ మరణాలు. ప్రజలహక్కులను పరిరక్షించటానికి కాయితాలమీద ఎన్ని చట్టాలున్నా వాస్తవానికి వాటిలో నిజాయితీ లోపించడం వల్లనే ముద్దాయిలు లేదా అనుమానితులు కోర్టు వరకు వెళ్ళకుండానే పోలీస్ స్టేషన్ల చీకటి గదుల్లో దారుణ హింసాకాండకు, అమానుష చిత్ర వధలకు బలవుతున్నారు. అందులో భాగమే వడ్డే శ్రీనివాసులు లాకప్ మరణం.

అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం పోలీస్ స్టేషన్‌లో గతనెల 18న పోలీసుల చిత్రహింసల వల్ల శ్రీనివాసులు చనిపోయాడు. ఈదారుణాన్ని ప్రశ్నించటానికి స్టేషన్‌కు రావడమే ప్రజల నేరమైంది. అంతే, పోలీసులు ప్రజలపై కాల్పులు జరిపారు. ఈకాల్పుల్లో ముగ్గురు గాయపడ్డారు. లాకప్‌లో అమాయకులను హత్యచేసే పోలీసులకు తమ నేరాన్ని కప్పిపుచ్చుకోడానికి కట్టుకథలు అల్లడం వెన్నతో పెట్టిన విద్య. ఇక్కడ కూడా పోలీసులు అదే పాతకథ చెప్తున్నారు. శ్రీనివాసులు లాకప్‌లో చనిపోలేదని, మూర్ఛవ్యాధితో మరణించారని పోలీసులు బుకాయిస్తున్నారు. కాని వాస్తవాలు మరోరకంగా ఉన్నాయి.

కళ్యాణదుర్గంలో బి.కాం. చదువుతున్న కృష్ణారెడ్డికి వడ్డేపల్లి శ్రీనివాసులు స్నేహితుడు. జూన్ 17న తన గదిలో 800 రూపాయలు పోవడంతో కృష్ణారెడ్డి శ్రీనివాసులు మీద పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. అదేరోజు పోలీసులు శ్రీనివాసులును స్టేషన్‌కు పిలిపించి విచారిస్తుండగా గ్రామపెద్ద వచ్చి ఫిర్యాదుదారునికి, నిందితునికి మధ్య మధ్యవర్తిత్వం జరుపుతానని హామీఇవ్వడంతో శ్రీనివాసులును పంపించి వేశారు. అయితే 18న మధ్యాహ్నం శ్రీనివాసులును రెండోసారి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్ళారు. అయితే ఈవిధంగా తీసుకురాగానే మూర్ఛవచ్చి వరండాలోనే పడి చనిపోయాడని పోలీసులు కట్టుకథలు చెప్తున్నారు. కాని శ్రీనివాసులును రెండోసారి తీసుకురాగానే లాకప్‌లో పడేసి ఎస్.ఐ. కొందరు కానిస్టేబుళ్ళు తీవ్రంగా కొట్టారని కళ్యాణదుర్గం సర్పంచ్ జయం సుబ్రహ్మణ్యం చెప్పారు. లాకప్‌లో చనిపోయిన శ్రీనివాసులును వరండాకు తరలించారని, పోస్ట్‌మార్టంకు పంపటానికి ముందు శ్రీనివాసులు మృతదేహంపై గాయాలున్నాయని ఆయన తెలిపారు.

శ్రీనివాసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం చేసిన అనంతపురం జిల్లా ఆసుపత్రి సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.ఎన్. చౌదరి విలేకరులతో మాట్లాడుతూ మృతదేహంపై కమిలిన దెబ్బలు, చెక్కుకుపోయిన, గీచుకుపోయిన గాయాలు ఉన్నాయని చెప్పారు. మూర్ఛవల్ల చనిపోయాడనడం వాస్తవం కాదని, మృతునికి మూర్ఛలున్న లక్షణాలేవీ కనిపించలేదని డాక్టర్ తెలిపారు.

వాస్తవాలు ఇలాఉండగా ఒక అమాయకుడిని హత్య చేసిన పోలీసుల దారుణాన్ని ప్రశ్నించిన ప్రజలపై కాల్పులు జరిపారు. ఈలాకప్ మరణం గురించి తెలిసినా ప్రజలు గుంపులు గుంపులుగా స్టేషన్ దగ్గరకు చేరారు. పోలీసులను నిలదీశారు. దాంతో కాల్పులు జరిపారు. ఈకాల్పుల్లో ముగ్గురు గాయపడ్డారు. ప్రజలు ఎం.ఆర్.ఓ కార్యాలయంపై దాడిచేసి, జీపుకు నిప్పుఅంటించడానికి ప్రయత్నించగా కాల్పులు జరిపామని పోలీసులు పచ్చి అబద్ధాలు ఆడుతున్నారు. కాని పోలీసులు చెప్పిన ఈమాటలు వాస్తవం కాదని ధర్మవరం ఆర్.డి.ఓ. ఎస్.వి. వీరభద్రయ్య స్వయంగా చెప్పారు. ప్రజలు ఎలాంటి విధ్వంసక చర్యలకు పాల్పడలేదని ఆయన అన్నారు. అంతేగాక స్టేషన్‌కు 20 గజాల దూరంలోనే మండల కార్యాలయం ఉంది. కాని కాల్పులు జరపటానికి పోలీసులు మండలాధికారి నుంచి ఎలాంటి అనుమతి తీసుకోలేదు.

ఈ సంఘటనలకు నిరసనగా 19న అఖిల పక్షాలు కళ్యాణదుర్గం బంద్ పాటించాయి. న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశాయి. ప్రజల ఆందోళనలతో ప్రభుత్వం ఈసంఘటనలపై న్యాయవిచారణకు ఒక సంఘాన్ని నియమించింది.

తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో లాకప్ హత్యలు నిత్యకృత్యమయ్యాయి. లాకప్‌గదులు యమకూపాలుగా తయారయ్యాయి. కాని ప్రజలు మునుపటి మాదిరిగా తమకు పట్టనట్లు నిర్లిప్తంగా ఉండటం లేదు. లాకప్‌లో చనిపోయిన వాడు తమ తోబుట్టువు కాకపోయినా, ముఖపరిచయం ఉన్నవాడు కాకపోయినా వేలాదిమంది ప్రజలు అప్పటికప్పుడు కదులుతున్నారు. పోలీస్ స్టేషన్లముందు గుమిగూడుతున్నారు. పోలీసులపై తిట్ల వర్షమో, రాళ్ళవర్షమో కురిపిస్తున్నారు. రాజ్యహింసను సహించడానికి ప్రజలు సిద్ధంగా లేరనే ఈ సంఘటన రుజువు చేస్తున్నది.

ఆకలయ్యి అన్నమడిగితే...

"మీరు ఆరోగ్యంగా జీవించా లంటే మూడుమందులు వాడాలి. ఉదయం భోజనం లేదా అల్పాహారం ఒక మందు; మధ్యాహ్నం భోజనం రెండవ మందు; రాత్రి భోజనం మూడవ మందు" అన్నాడొక డాక్టరు. ఇందులో అతిశయోక్తి లేదు. కడుపు నిండా తిండి, తాగటానికి పనికొచ్చే నీళ్ళూ లేనికారణంగానే మనదేశంలో నూటికి 75 రోగాలు వస్తున్నాయని ఒక అంచనా.

తిండి సరిపడా ఉంటే రోగనిరోధక శక్తికూడా బావుంటుంది. ఈరోగనిరోధక శక్తి అనేక జబ్బుల్ని ఎదుర్కోటానికి ఉపయోగపడ్తుంది. క్షయ, విరేచనాలు, టైఫాయిడ్ మొదలైన జబ్బులు తిండిపుష్టి లేనివారిలో, తిండిపుష్టి ఉన్నవారిలో కంటే తీవ్రంగా రావటం వైద్యవృత్తికి తెలుసు. ఈవాదనను తిరగేసి చూస్తే యిలా ఉంటుంది. ... తిండి సరిపడా లేకపోతే రోగనిరోధక శక్తి తగ్గుతుంది. దీంతో రోగాలు వస్తాయి. రోగాల్తో అలాగే ఉంటే పనిచేయలేడు. పనిచేయకపోతే ఉన్న ఆదాయం కూడా పోయి అరకొరగా దొరుకుతున్న తిండికి మొదటికే ఎసరు వస్తుంది. అందు వలన రెక్కాడితేగాని డొక్కాడని జనం రోగంతో ఎక్కువరోజులు విశ్రాంతి తీసుకోవడం సాధ్యంకాదు. కనీసం అవసరమైనన్ని రోజులుకూడా విశ్రాంతి తీసుకోలేరు. జబ్బుచేస్తే అర్జంటుగా నయం కావాలని కోరుకుంటారు. "ఈ నయం కావాలని కోరుకోవటం" ఎక్కడికి దారితీస్తుందో తర్వాత చూద్దాము.

రోగులున్నచోట వైద్యులుండరు

నూటికి 80 మంది జనం పల్లెల్లో ఉన్నారు. నూటికి 80 మంది డాక్టర్లు పట్టణాల్లో ఉన్నారు. ఎక్కువమంది పేదవాళ్ళు పల్లెల్లో ఉన్నారు. పోనీ పట్టణాలలో ఉన్న గుడిసెల్లో నివసించేవారికి అందుబాటులో డాక్టర్లు ఉన్నారంటే అదీ లేదు. మొత్తంమీద పేదవారికి, కష్టపడేవారికీ వైద్యులు అందుబాటులో లేరు. వీరికి రోగాలువస్తే వారు నివసిస్తున్న చోటు నుండి డాక్టరు దగ్గరకు పోవాలి. ప్రయాణానికి అయ్యే ఖర్చు అటు మందుల మీద కోతగాను, యిటు తిండిమీద కోతగాను మారుతుంది. మందులమీద కోతబడితే రోగం పూర్తిగా నయంకాదు. తిండిమీద కోతబడితే పరోక్షంగా మరల ఎక్కువ జబ్బులకు దారితీస్తుంది.

తిండిలేని రోగానికి తిండే వైద్యం

కాని నేటి వైద్యవృత్తి, వైద్య సంస్కృతి ఈమాట చెప్పటానికి సిద్ధంగా లేదు. ఎందుకని?

తిండి తినండి మీరోగాలు పోతాయని చెప్తే ఇక వైద్యుని దగ్గరకు మరెవరు వస్తారు? కేవలం వైద్యుల దగ్గరకెవరు వస్తారు? కేవలం వైద్యులకంటే మించి, స్వప్రయోజనాలు కల్గిన వారూ దీని వెనుకున్నారు.

అందుకే వారు తిండిలేనివారిని కూడా తిండి బదులు బలం రావటానికి టానిక్కులు, బలం పొడులు, ఆరోగ్య ద్రావకాలు తినుకోమంటున్నారు. వీటిలో ఏముంటుందో చూసి, త్రాగితే వచ్చే పర్యవసానం ఆలోచిద్దాం.

టానిక్కులు :— ఏ కంపెనీ తయారుచేసే టానిక్ అయినా 20-25 రూపాయల ఖరీదు ఉంటుంది. సీసా మొత్తంలో 20 పైసలు ఖరీదుచేసే సారాయి, 20 పైసలు ఖరీదుచేసే గ్లిజరు ఫాస్ఫేటు అనే పదార్థము. 5 పైసల ఖరీదుచేసే విటమినులు ఉంటాయి. సారాయి త్రాగితే లివరు దెబ్బతింటుంది. లివరు జబ్బు బాగుకావటానికనే పేరుతో బోలెడన్ని లివరు టానిక్కులు మరలా అమ్ముకోవచ్చు. సారాయి త్రాగితే పొట్టలో పుండు పడ్తుంది. అది నయం కావటానికి యాంటిసిడ్స్, సిమిటిడిన్, రానిటిడిన్ అనే మందులు అమ్ముకోవచ్చు. సారాయి త్రాగితే అన్న వాహికలో కాన్సర్ వస్తుంది. గుండె జబ్బులు వస్తాయి. ఈ రెండింటి క్కూడా చాలా చాలా మందులు అమ్ముకోవచ్చు. సారాయి త్రాగితే వచ్చే జబ్బులు సారాయి కలిసుండే టానిక్‌లు త్రాగితే రావనే గ్యారంటీ లేదు.

టానిక్కుల్లో కలిసుండే గ్లిజరు ఫాస్ఫేట్లు ఉపయోగమేంటో చూద్దామని 2000 పేజీల సైజుండే ప్రామాణికమైన "గుడ్‌మన్ గిల్‌మన్ మందుల శాస్త్రం" పుస్తకమంతా వెదికితే అందులో గ్లిజరు ఫాస్ఫేట్లు అనే పేరే లేదు. ఇక అది శరీరంలో ఏంపనిచేయటానికి పనికొస్తుందో ఏం చెప్పాలి?

ఇన్ని లాభాలున్నాయి కాబట్టే మందుల కంపెనీలన్నీ టానిక్కులు తయారుచేస్తాయి. డాక్టర్ల దగ్గరకు తమ రిప్రజెంటేటివ్‌లను పంపి డాక్టర్లను ప్రభావితం చేసి అవసర మయితే ఫ్రిజ్‌లు, కలర్ టి.వీలు, స్కూటర్లు, మోటారు సైకిళ్ళు, మారుతికార్లు యివ్వజూపి తమ

టానిక్కులు "అలవాటు"గా అయాడాక్టర్లు రాసేట్లు చూసుకుంటారు,

మరి జనం ఎందుకు కావాలంటున్నారు? 'జనం టానిక్ కావాలంటున్నారు కదా అందుకని మేము రాస్తున్నామ'ని డాక్టర్లు తమ బాధ్యతని జనం నెత్తిన రుద్దాలని ప్రయత్నం చేస్తుంటారు.

అనేక జబ్బుల్లో నీరసం, ఆకలి లేకపోవటం వస్తాయి. డాక్టర్ అప్పుడొక టానిక్కు రాసిచ్చాడనుకోండి. టానిక్‌లో ఉన్న సారాయి వలన తాత్కాలికంగా ఆకలి పెరిగినట్లవుతుంది. దానంతటదే వచ్చే ఆకలి ఎటూ కొద్ది రోజుల్లో వస్తుంది. రోగేమో టానిక్ త్రాగినందువలన ఆకలి వచ్చిందనుకొంటాడు. తనతో ఆగకుండా ఇంటి ప్రక్క వాళ్ళకు, పైవాళ్ళకు, ఎదుటివాళ్ళకు అందరికీ ఆ టానిక్ సిఫారసు చేస్తాడు ఈ "మాజీ రోగి". ఈవిధంగా టానిక్ త్రాగాలనే సంస్కృతి పాదుకొనిపోయి "బలహీనంగా ఉన్నాను డాక్టర్! ఒక టానిక్ రాసివ్వరా" "మా పిల్లవాడు సరిగ్గా పెరగడం లేదండి టానిక్ రాసివ్వండి" అనే స్థితి వచ్చింది. దీనికి మూలకారణం వదిలేసి "జనం అడిగారు నేను రాశాను" అని డాక్టర్ తప్పుకోవటానికి ప్రయత్నం చేస్తాడు.

25 రూపాయలు పెట్టి కొనేదాంట్లో ఉండే సరుకు 45 పైసలు. అందులో పనికొచ్చేది 5 పైసలు. తిండికూడా మానుకొని పేకాడినట్లే, సారాయి త్రాగినట్లే, టానిక్కులు కొనుక్కొనే వాళ్ళూ ఉన్నారు. దీని బదులు కోడిగ్రుడ్లు, పప్పులు, ఆకుకూరలు, కాయగూరలు, అన్నం వగైరా ఎన్నయినా ఈడబ్బు అనుమతించిన మేరకు కొనుక్కోవచ్చు. తినవచ్చు.

ముఖ్యమైన తిండికి పెట్టాల్సిన ఖర్చు నిరుపయోగమైన టానిక్‌లకు ఖర్చు పెట్టినందువలన, తిండిలేక వచ్చే రోగాలు మరింత పెరుగుతాయి.


— డా॥ బ్రహ్మారెడ్డి

జాతి మొత్తం బందీ ఐనప్పుడు.........

భూమిపుత్రుణ్ణి బందీ కావిస్తారు.
అతడు ఖైదీనే కానీ మౌనికాడు.
కపాలంనించి కాళ్ళదాకా ఒరుచుకున్న సంకెళ్ళతోనే
చుకుముకి రాళ్ళ ధ్వనుల్ని సృష్టిస్తుంటాడు.
అతడు బందీనేకాని ఒంటరి కాడు.
పోల్స్‌మూర్ జైలుగోడల మధ్య
అసహనంగా తచ్చాడే అతని పదఘట్టనలు
జనం గుండె చప్పుళ్ళుగా ప్రతిధ్వనిస్తుంటాయి.
అతడు ప్రవాసంలో వున్నాడేకానీ అజ్ఞాతంగా లేడు.
అతడి ఊపిరి సెగలు గాలిలో కలిసి
పుప్పొడిగా ఎగిరి
జోహన్స్‌బర్గ్, బ్రాండ్‌పోర్ట్‌గోడల మీద
అక్షరాలుగా వాలతాయి.
"బందీ! నువ్వు జాతిస్వేచ్ఛాకాంక్షకు పదచిత్రానివి!"
అది చదివిన పసిపిల్లలుకూడ పోరాట కవితలౌతారు.
అతడికి కారాగారం కూడా రణరంగమే.
తెరుచుకున్న అతడి నోటిని బాయోనెట్లు పహారా చేస్తాయి.
అయినా కొన్ని తుఫానుల్ని సందేశమిస్తాడు.
"జాతి మొత్తం బందీ ఐనప్పుడు
ఏ ఒక్కడికీ తన స్వేచ్ఛను గూర్చి చర్చించే అర్హత ఉండదు.
విప్లవం ఒక్కటే మనకు మిగిలిన స్వేచ్ఛ.
ఉరితీయబడ్డ శిరస్సులిచ్చిన ఆజ్ఞలే మన భవిష్యత్తు!"
ప్రజలు అతడి సందేశాన్ని కరవాలంగా అందుకొంటారు.
వీపులమీద మొహరించిన నౌకల్ని ధ్వంసంచేయడానికి
ఒక్కొక్కడు ఒక్కో నల్ల సముద్రమై పొంగుతాడు.
గిరజాల జుట్ల పిల్లగాళ్లందరూ
అలలు అలలై
ప్రిటోరియా వీధుల్లో ధిక్కారంగా కవాతు చేస్తారు.
బంగారం గనులన్నీ
బొగ్గు కొలిములై రాజు కుంటాయి.
వైట్‌హౌస్ తెల్లబోతుంది
హౌస్ ఆఫ్ కామన్స్ విస్తుబోతుంది.
చరిత్ర తెరచుకున్న పుస్తకమై వ్యాఖ్యానిస్తుంది.
"నెల్సన్ మండేలా,
నువ్వు నా వీరోచిత అంతర్జాతీయ గీతానివి.
షార్ప్ విల్లే సిక్స్,
మీరు ఉరికొయ్యల మీది నా ఉయ్యాల పాటలు.
దక్షిణాఫ్రికా,
నువ్వు నా విశ్వ పోరాట కావ్యానివి!"

— అరణ్య కృష్ణ

వృక్ష మానవుడు



అతడు నడుస్తూ నడుస్తూ బాగా అలసిపోయాడు. అక్కడ నుంచి ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేక పోతున్నాడు. అది దట్టమైన అడవి. అందులోనుంచి బయట పడడంకోసం అనేక గంటలనుంచి తిరుగుతూనే వున్నాడు. అతడికి దారి దొరకలేదు. అలసిపోయి, విసిగిపోయి ఓ వృక్షం క్రింద కూర్చుండిపోయాడు. ఆకలి దప్పులతో అల్లాడి పోతున్నాడు. దానికి తోడు తిరిగి తిరిగివున్న అలసటతో ఒళ్ళంతా నుగ్గునుగ్గయి పోయింది. అలా కూర్చొని వుండగా అతడికి తెలియకుండానే నిద్రపట్టింది.

ఎవరో దగ్గరగా వచ్చి పిలుస్తున్నట్లనిపించింది. అతడు లేచి కూర్చున్నాడు. నలువైపులా చూశాడు. ఎవరూ కన్పించలేదు. తనను పిలుస్తు న్నట్లు మాత్రం స్పష్టంగా వినిపిస్తూ వుంది. ఎవరు పిలుస్తున్నారో, ఎక్కడ నుంచి పిలుస్తున్నారో అతడికి తెలియ డం లేదు. అతడికి ఆశ్చర్యంతోపాటు భయంకూడా వేసింది. ఈనట్టడవిలో అతణ్ణి ఎవరు పిలుస్తారు? ఎవరైనా వుంటే ఎందుకు కన్పించరు? అతడు జాగ్రత్తగా ఆధ్వనిని వింటున్నాడు. ఎవరో అంటున్నారు, 'మిత్రుడా, భయపడకు. నేను ఈవృక్షాన్ని మాట్లాడుతున్నాను. నేను నీకు సహాయపడ దలచుకున్నాను. నీవు దారితప్పి పోయావు కదూ? నేను నీకు దారిచూపిస్తాను. కాని నీవు ఆకలితో వున్నావు. అంచేత ఈపండు తిని ముందు నీ ఆకలి తీర్చుకో.''

వెంటనే ఆ వృక్షం మీదినుంచి అనేక పండ్లు టపటపా నేలమీద రాలి పడ్డాయి. అతడు ఆపండ్లను తీసుకొని తింటున్నాడు. అవి చాలా తియ్యగానూ, రసంగలవి గానూ ఉన్నాయి. రెండు మూడు పండ్లు తినగానే అతడి ఆకలి దప్పులు తీరిపోయాయి. అతడు ప్రేమతో ఆవృక్షం వైపు చూస్తూ అన్నాడు, "నీవు మనిషిలాగా మాట్లాడగలవంటే నమ్మలేకపోతున్నాను. పైగా నా మనసులోని మాటనుకూడా నీవు తెలుసుకోగలగటం మరీ ఆశ్చర్యంగా వుంది. ఇదెలా సాధ్యం? నీవు మనిషిని మించిన దానివిగా కన్పిస్తున్నావు. అన్ని వృక్షాలు ఇలాగే వుంటాయా?''

వృక్షం 'అవును' అన్నట్లుగా తన కొమ్మలను ఊపింది. మళ్ళీ మాట విన్పించింది, "వృక్షాలమైన మేమంతా వాస్తవంగా మనిషిలాంటి ప్రాణులమే. మేము పలకగలం, మాట్లాడగలం. మేముకూడా నీలాగా సంతోషిస్తాం, విచారిస్తాం. నీలాగే నవ్వుతాము, ఏడుస్తాము. మాకు సుఖ దుఃఖాలు వుంటాయి. అయితే మాభాషమాత్రం మీభాషకన్నా భిన్నంగా వుంటుంది.''

అతడు నివ్వెరపోయి అడిగాడు, "నీవు మా లాగా నడవగలవా?" ఆ వృక్షంనుంచి మాట వినిపించింది., "లేదు నడవలేను మీలాగా నడవలేను. ఎంచేతనంటే మావేళ్ళు భూమిలో చాల లోతుకు చొచ్చుకుపోయి వుంటాయి. ఈవేళ్ళ సహాయంతోనే మేము భూమి లోంచి నీటినీ, పోషకాహారాన్ని పొందుతూ వుంటాము.''

అతడు మళ్ళీ ప్రశ్నించాడు, "మాలాగా నీకు ఆకలి కూడా వేస్తుందా? మాలాగా భోజనం కూడా చేస్తావా?''

వృక్షం అన్నది, "అవును మాకు కూడా ఆకలి వేస్తుంది. కాని మేము భోజనం చేయం. స్వయంగా మా శరీరం లోపలే సూర్యరశ్మితో, నీటితో, గాలితో మా ఆహారాన్ని తయారుచేసు కొంటాం.''

అతడు ఆశ్చర్యపోతూ అడి గాడు, "అలాగా! అదెట్లా?''

వృక్షం అన్నది, "మా శరీరంలో ఆకుపచ్చని ద్రవం ఒకటి వుంటుంది. దానికి శాస్త్రజ్ఞులు క్లోరోఫిల్ అని లేక పత్రహరితమనీ పేరు పెట్టారు.

ఆకులు పచ్చగా వుండడానికి కారణం క్లోరోఫిల్ వుండటమే. మా ఆకులు గాలిలో నుంచి కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహిస్తాయి. సూర్యరశ్మి ఉండగా నీటి తోనూ, కార్బన్ డై ఆక్సైడ్‌తోనూ యీ క్లోరోఫిల్ కార్బోహైడ్రేట్‌ను, ఆక్సిజన్ నూ తయారుచేస్తోంది. ఆక్సిజన్‌ను మేము మళ్ళీ గాలిలోకి వదులుతాము. కార్బోహైడ్రేట్ మా శరీరంలో ఉండిపో తుంది. ఈవిధంగా పగటిపూట మేము ఆక్సిజన్‌ను వదులుతాము. ఈ ఆక్సిజ న్‌నే ప్రాణులన్నీ శ్వాసగా గ్రహిస్తాయి, కార్బన్ డై ఆక్సైడ్‌ను వదులుతాయి."

అతడు అడిగాడు, "అయితే మేముకూడా మీ మాదిరి గానే మాశరీరం లోపల గాలితోనూ, నీటితోనూ, సూర్యరశ్మితోనూ భోజనం తయారు చేసుకోలేమా?"

వృక్షం అన్నది, "చేసుకోలేరు! ఎంచేతనంటే మీశరీరంలో ఈ ప్రత్యేకమైన ద్రవంలేదు. ఈకారణంగా నీవుగానీ, తదితర ప్రాణులుగానీ భోజనం కోసం మాచెట్లు చేమల మీద ఆధారపడి ఉండవలసి వస్తున్నది. అన్ని ప్రాణులూ భోజన రూపంలో చెట్లు చేమలలోని ఏదో ఒక భాగాన్ని అది పండుకానివ్వు, పువ్వు కానివ్వు, ఆకులు కానివ్వు, కాండం కానివ్వు, వేళ్ళు కానివ్వు, తింటూనే వుంటాయి."

"దీని అర్థం చెట్లు-చేమలు లేకపోతే మేమందరం ఆకలితో వుండిపోతామని కదా? కాని మేము పక్షాదులనుంచీ ఇంకా ఇతర జీవాల నుంచీ లభ్యమయ్యే పదార్థాలు అంటే మాంసమూ, చేపలూ, గ్రుడ్లూ, పాలు, పెరుగు, నెయ్యిలాంటివి కూడా తిని బ్రతక గలంకదా?"

వృక్షం అన్నది, "కాని ఈపదార్థాలను ఇచ్చే పశువులుకూడా చెట్లు-చేమలు తినేగదా జీవిస్తున్నది. అంతేకాదు, ఈ చెట్లే లేకపోతే మీరంతా శ్వాసించటానికి ఆక్సిజన్ లభించదు. వాతావరణ మంతటా కార్బన్ డై ఆక్సైడ్ వ్యాపించి పోతుంది. ప్రాణులన్నీ ఊపి రాడక చచ్చిపోతాయి."

అతడు ఆ విషయం అంగీకరిస్తూ అన్నాడు, "నీవు ఎంత అవసరమైన దానివో నాకు ఇప్పుడు తెలిసింది. నేను పల్లెటూళ్ళో పడివుండే పిల్లవాణ్ణి. ఇటువంటి విషయాలు నాకు ఏమి తెలుస్తాయి? నేను చదువుకోలేదు కూడా. ఒక విద్వాంసునిలాగా నీకు చాలా విషయాలు తెలుసు. నేను రోజూ నీదగ్గరకు వస్తూ వుంటాను."

వృక్షం సంతోషిస్తూ అన్నది, "నీవు నా దగ్గరకు వస్తూ వుంటే నాకు చాల సంతోషం కలుగుతుంది. నేను నీకు రకరకాల కథలు చెబుతాను, తినటానికి తియ్యని పండ్లు ఇస్తాను".

అతడు సంతోషంగా చంకలెగరేస్తూ అన్నాడు, "ఆహా! అప్పుడు నాకు చాలా ఆనందం కలుగు తుంది. కాని నీలాంటి ఉపయోగకరమైన వృక్షాలను మనుషులు ఎందుకు నరికేస్తున్నారో నాకు అర్థం కావడం లేదు."

వృక్షం విచారిస్తూ అన్నది, " అదే మనుషులు చేస్తున్న తెలివితక్కువ పని. వాళ్ళు పెద్ద పెద్ద పరిశ్రమలు స్థాపించడానికి, రోడ్లు నిర్మించడానికి, పట్టణాలు సృష్టించడానికి మహోన్న తమైన భవనాలను నిలబెట్టడానికి చెట్లను అన్యాయంగా నరికేస్తున్నారు. చెట్లు, చేమలను గొడ్డళ్ళతో నరికించి నిజానికి వాళ్ళు తమను తామే నరికించు కుంటున్నారు. ఈ విషయం బహుశా వాళ్ళకు తెలియదను కొంటాను. అయి తే చాలమంది మనుషులు యీవిష యాన్ని తెలుసుకున్నారు. అటువంటి వారు మమ్మల్ని సంరక్షించడానికి పూర్తిగా ప్రయత్నిస్తున్నారు.

అతడన్నాడు, "నాకూ అలాగే అనిపిస్తున్నది. అయితే నీకుమాత్రం చాలా హాయిగా వుంది వుంటుంది. మామాదిరిగా నీవు ఆహారం కోసం తిరిగి తిరిగి శ్రమపడవలసిన అవ సరం లేదు. తిండి దొరకనప్పుడు కాలే కడుపుతో నిద్రించవలసిన పనిలేదు. నీకు ఏ కొరతా లేదు. గాలి, నీరు, సూర్యరశ్మి అన్నీ ఉచితంగానే లభి స్తాయి. నీవు ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు ఆహారం తయారుచేసు కోవచ్చు. ఆహా నీలాగా నేనుకూడా వృక్షాన్ని అయిపోతే ఎంత ఆనందంగా వుంటుంది!"

వృక్షం ఆశ్చర్యంగా అడిగింది, "ఏమిటి, నీవు వృక్షం కాదలచు కొన్నావా?"

అతడు తలూపుతూ అన్నాడు, "అవును, నీవు చెపుతున్నదంతా నిజమో కాదో చూడదలచుకొన్నాను."

వృక్షం అన్నది, "అలా అయితే మంచిదే. నీవు చేతులుచాపి నిలబడు."

"అయితే నేను ఎప్పుడు కావాలనుకొంటే అప్పుడు మళ్ళీ మనిషిని కాగలను కదా?"

వృక్షం అన్నది "అవును, నీవు ఎప్పుడు మనిషివి కావాలనుకొంటే అప్పుడు నాతో చెప్పు. వెంటనే నీవు మనిషివై పోతావు. అతరువాత నీకు రాసులకు రాసులే పళ్ళు ఇస్తాను. నీకు దారి చూపిస్తాను. నీవు నీఇంటికి వెళ్ళిపోవచ్చు."

"అట్లా అయితే మంచిదే." అని అతడు చేతులు చాపి నిలబడిపోయాడు. నిజంగానే అతడి ఒంటిమీద కొమ్మలు మొలుచు కొచ్చాయి. ఆకొమ్మలనిండా ఆకులు నిండి పోయాయి. కాళ్ళలోనుంచి అసంఖ్యాకంగా వేళ్ళుపుట్టుకొచ్చాయి. అతడు పూర్తిగా వృక్షమైపోయాడు. అతడి కొమ్మలు గాలికి కదులు

తున్నాయి. ఆకులు ఊగుతున్నాయి. తనవేళ్ళు భూమిలోనుంచి నీటిని పీల్చుతున్నట్లనిపించింది. ఆకులు గాలి పీల్చుతూ వదులుతూ ఉన్నాయి. తిండి తిప్పలకోసం ఇల్లిల్లూ తిరగవలసిన తిప్పలు తప్పిపోయి నందుకు అతడికి చాలా సంతోషంగా వుంది. అతడు తనకు దగ్గరగా నిలబడివున్న ఆ చెట్లభాష అర్థం చేసుకోగలుగుతున్నాడు. వాటితో మాట్లాడుతున్నాడు. చుట్టుప్రక్కల వున్న చెట్లన్నిటితో అతడికి స్నేహం ఏర్పడింది. అవన్నీ పూర్తిగా తనవేననే భావం అతడికి కలిగింది.

కొంతసేపటికి అతడికి కొందరు మనుషుల మాటలు వినిపించాయి. అతడు అటూఇటూ తిరిగి చూశాడు. కొందరు మనుషులు గొడ్డళ్ళు భుజాన పెట్టుకొని ఇటువైపుకే వస్తున్నారు. అతడు భయపడి పోయాడు. పరిసరాలలో వున్న చెట్లు చేమలు అన్నీ భయంతో వణకిపోతున్నాయి. కొన్ని మొక్కలు స్పృహతప్పి పోతున్నాయి. వీళ్ళు చెట్లను నరకడానికే ఇటువైపుకు వస్తున్నారని అతడు తెలుసుకొన్నాడు. వీళ్ళు ఓ క్షణంలో సజీవంగావున్న యీచెట్లను నిర్భయంగా నరికిపారేస్తారు. వేటి కారణంగా వీళ్ళు జీవించగలుగుతున్నారో ఆచెట్లు చేమలను నరకబోతున్నారు. ఏచెట్లనుంచి వాళ్ళు శ్వాసించడానికి స్వచ్ఛమైన గాలి లభిస్తున్నదో, ఏ చెట్లకారణంగా సకాలంలో వర్షాలు కురిసి, రైతులు పొలాలలో ధాన్యం పండించగలుగుతున్నారో, ఏచెట్ల పండ్లుతిని తమ కడుపు నింపుకొంటున్నారో, ఆచెట్లనే నరకడానికి బయలుదేరి వస్తున్నారు. ఆచెట్లు-చేమలు రూపుమానిపోతే ఈభూమిమీద మానవుని అస్తిత్వమే రూపుమానిపోగలదు ఆ చెట్లు-చేమలు రూపుమాపడానికి బయలుదేరి వస్తున్నారు. ఇలా ఆలోచిస్తూ ఆలోచిస్తూ అతడు ఉద్రేకపడిపోయాడు. ఆఉద్రేకంలో తానిప్పుడు వృక్షమై ఉన్నాడనీ, తనను నరకడానికి ఇద్దరు వ్యక్తులు ఇటువస్తున్నారనే విషయం అతడు మరచిపోయాడు.

ఆ ఇద్దరు వ్యక్తులు కొంతసేపటికి అతడికి అతి సమీపంగా వచ్చారు. ఆ చుట్టుప్రక్కల వున్న చెట్లను దయాదాక్షిణ్యాలు లేకుండా నరుకుతున్నారు. అతడు అరిచాడు, "ఏ దేషమూ ఎరుగని వాటిని నరకవద్దు. అవి మీలాంటివే. వాటిని నరకవద్దు. వాటిని నరకవద్దు. వద్దు..."

కాని అతడి స్వరం ఆ గొడ్డళ్ళ చప్పుళ్ళలో కలిసి పోయింది.

క్షణంలో అనేకచెట్లు విలవిలలాడుతూ నేలకొరిగాయి. ఆచెట్ల ఆక్రందనను అతడు అర్థం చేసుకొంటున్నాడు. భరింపరాని ఆచెట్ల బాధను అతడు అర్థం చేసుకుంటున్నాడు. ఈ క్రూరులు కూడా ఆబాధను అర్థం చేసుకొంటే ఎంత బాగుంటుంది! ఆహా! అకస్మాత్తుగా అతడి దృష్టి తనమిత్ర వృక్షంవైపు మళ్ళింది. తనను వృక్షంగా మార్చిన ఆ మిత్ర వృక్షం నేలమీదపడి విలవిలలాడుతూ ప్రాణం విడుస్తూ వుంది.

ఇప్పుడు తెగి నేలకూలవలసిన వంతు అతడిది. ఆవ్యక్తులు నిర్దోషులైన ఆవృక్షాల రక్తంతో తడిసిన గొడ్డళ్ళను తీసుకొని అతడివైపుకు సాగివస్తున్నారు. ఆ వృక్ష మానవుణ్ణి నరకడానికి గొడ్డలి పైకెత్తగానే అతడు బిగ్గరగా అరిచాడు.


"ఆహా....హా....హా"

హఠాత్తుగా అతడు మేల్కొన్నాడు. అతడి ఒళ్ళంతా చెమట బట్టిపోయింది.

— వినోద్‌కుమార్

చక్‌మక్, (అక్టోబర్ 1988)
పిల్లల హిందీ మాసపత్రిక.





ఇతరలోకాల్లో ప్రాణులున్నాయా	వెల రూ. 15
విజ్ఞానశాస్త్రం - మనిషి విస్తరణ	" రూ. 13
పిడుగు దేవర కథ	" రూ. 12
సౌరశక్తికి సంకెళ్ళు	" రూ. 12
ఆకాశంలో ఆశ్చర్యార్థకం	" రూ. 13
వినోదం - విజ్ఞానం	రూ. 4-50

హైదరాబాద్ బుక్ ట్రస్టు


చిరునామా :
హైదరాబాద్ బుక్ ట్రస్ట్
1-1-342/బి
వివేక్ నగర్, హైదరాబాద్-20.

KLUA 102M289

NALUPU Fortnightly Regd: H/SD-173/RNP

BE AN ENTREPRENEUR BE THE BOSS

ENTREPRENEURIAL ACTIVITIES ARE ESSENTIALLY PERSON ORIENTED THEREFORE
HIS/HER MAKE-UP WILL AFFECT THE SUCCESS OF HIS/HER VENTURE



ARE YOU DESIROUS OF ESTABLISHING AN ENTERPRISE
IN ANANTAPUR?
HERE IS "STED" AT YOUR SERVICE

—GUIDES TO IDENTIFY THE PRODUCT & PREPARE THE PROJECT REPORT
— COORDINATES WITH FINANCIAL & OTHER GOVT. INSTITUTIONS
— IMPARTS REQUIRED MANAGERIAL SKILLS & GUIDES IN ESTABLISHING THE INDUSTRY

A.P. STATE COUNCIL OF SCIENCE & TECHNOLOGY
STED—SCIENCE & TECHNOLOGY ENTREPRENEURSHIP DEVELOPMENT PROJECT
NEAR RAMCHANDRA TALKIES ,POST BOX 57, ANANTAPUR - 515 001.

Edited by B. Tharakam, and published by Cyril Reddy on behalf of
Hyderabad Book Trust, Printed at Gayatri Enterprises of Hyderabad Printers of Hyderabad

BC

మనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA102M289
పుస్తకం పేరు	వలువు
తారీఖు	07 February 2025
ముందు అట్ట	Yes
వెనుక అట్ట	Yes
మొత్తం పేజీలు	41
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	NO
తయారు చేసినది	Hema
పేజీలు విడదీసినది	Priyanka
స్కాన్ చేసినది	Priyanka
పరీక్ష చేసినది	HEMA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	Good